మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

రేవంత్‌రెడ్డి పాసా? ఫెయిలా?
తెలంగాణ ఏమంటున్నది!
తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్‌టిసి కార్మికుల పాత్ర మరువలేనిది
ఫ్రాన్స్‌లో కుప్పకూలిన బార్నియర్ ప్రభుత్వం
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 10 | శుక్రవారం | 06-12-2024 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# నిప్పులు చిమ్ముతూ నింగికి..



61సార్లు అంతరిక్షంలోకి వెళ్ళిన పిఎస్‌ఎల్‌వి

ఇఎస్ఎ ప్రోబా– 3 జంట ఉపగ్రహాల ప్రయోగం విజయవంతం

ప్రాజెక్టు టీముకు ఇస్రో చైర్మన్ సోమనాథ్ అభినందనలు



**శ్రీహరికోట :** సూర్యగోళం అంచు (రిమ్)ను, బాహ్యాపొరను పరిశోధించేందుకు ఉద్దేశించిన ప్రోబా–3 (ప్రాజెక్ట్ ఫర్ ఆన్‌బోర్డ్ అనాటమీ) జంట ఉపగ్రహాలను ఇస్రో గురువారంనాడు విజయవంతంగా ప్రయోగించింది. అంతరిక్ష నౌక ప్రోబాను మోసుకెళ్ళే వాహకనౌక పిఎస్‌ఎల్‌వి–సి 59 రాకెట్ 18 నిమిషాలసేపు ప్రయాణంచేసి జంట ఉపగ్రహాలను నిర్దేశిత ప్రదేశంలో వదిలిపెట్టిందని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ చెప్పారు. యూరోపియన్ స్పేస్ ఏజన్సీ (ఇఎస్ఎ) ఈ సౌర ప్రయోగాన్ని చేపట్టింది. ముందుగా అనుకున్న దానికంటే ఒకరోజు ఆలస్యంగా ఈ ప్రోబా–3 ప్రయోగం జరిగింది. గురువారం ఉదయం 8.05 గంటలకు సవరించిన కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 44.5 మీటర్లు పొడవుగల పిఎస్‌ఎల్‌వి–సి59 రాకెట్ సాయంత్రం 4.04 గంటలకు 61వ సారి నింగిలోకి దూసుకుపోయి 18 నిమిషాల్లో గమ్యం చేరింది. ఈ జంట ఉపగ్రహాలు విజయవంతంగా వేరుపడ్డాయి. రాబోయే నెలల్లో బెల్జియంలో ఉన్న యూరోపియన్ స్పేస్ ఏజన్సీ శాస్త్రవేత్తలు ఈ ఉపగ్రహాలను వారు కోరుకున్న విధంగా నిర్దేశిత కక్ష్యలలో ఉంచుతారు. వాహక నౌక తీసుకువెళ్ళిన రెండు ఉపగ్రహాలలో ఒకటి 310 కేజీలు బరువుగల కరోనాగ్రాఫ్ కాగా, మరొకటి 240 కేజీలు బరువుగల ఆక్యుల్టర్ ఉపగ్రహం. ఈ రెండింటినీ కలిపి ప్రోబా–3గా పిలుస్తున్నారు. 'ప్రోబా' అంటే లాటిన్‌భాషలో ''ప్రయత్నిద్దాం'' అని అర్థం. ఈ రెండూ ఒకటిగానే సంచరిస్తాయి. సూర్యుడి వెలుపలి వాతావరణపొర కరోనాను అధ్యయనం చేసేందుకు ఈ రెండూ దోహదం చేస్తాయి. ప్రోబా–3 ప్రయోగానంతరం సోమనాథ్ మిషన్ కంట్రోల్ సెంటర్‌లో శాస్త్రవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. ''ఉపగ్రహాలు రెండూ నిర్దేశిత ప్రదేశాలకు చేరుకున్నాయి. భూమికి దాదాపు 600 కి.మీ దూరంగా చాలా ఎత్తున ఉన్న అండాకార పరిభ్రమణ అంతరిక్ష కక్ష్యలో ఈ రెండు ఉపగ్రహాలను ప్రవేశపెట్టాం. గ్రహాలు సంచరించే అంతరిక్ష వలయంలో భూమితో అనుసంధానం కొనసాగిస్తూనే వీలైనంత దాదాపు ఎక్కువదూరంలో అంటే 60,000 కిమీల సమీపదూరంలో 59 డిగ్రీల కోణంలో వీటిని ఉంచాం, పిఎస్‌ఎల్‌వి (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్) వాహకనౌక ఈ విధంగా ఇప్పటివరకూ 61 సార్లు అంతరిక్షంలోకి ప్రయాణించి వివిధ ఉపగ్రహాలను వేరువేరు కక్ష్యలలోకి ప్రవేశపెట్టిన ఘనత సాధించింది. అందువల్ల తరువాయి 2లో

# పెద్దరికాన్ని నిలబెట్టుకోండి



మీ పిల్లలకు బుద్ధిచెప్పి నియంత్రణలో పెట్టండి

మాజీసిఎం కెసిఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హితవు

కెటిఆర్, హరీశ్‌రావులు 'మారీచ సుబాహుల్లా, రాహు కేతువులా వ్యవహరిస్తే చట్టం తనపని తాను చేసుకుంటూ ముందుకెళ్తుందని హెచ్చరిక

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పేదలకు నష్టం జరగకుండా విధివిధానాలు రూపొందించాం

గ్రీన్ ఛానల్ ద్వారా రూ.5 లక్షలు అందజేస్తాం

ప్రతి నియోజకవర్గానికీ 3,500లు, తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ ఆవిష్కరణలో సిఎం ప్రకటన




ప్రజాపక్షం/హైదరాబాద్

అర్హులైన నిరుపేదల ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఎంపికలో పేదలకు ఎటువంటి నష్టం, అన్యాయం జరగకుండా ఉండేందుకు విధివిధానాలను రూపొందించామని, గ్రీన్‌ఛానల్ ద్వారా లబ్ధిదారులకు రూ.5 లక్షలు అందజేస్తామని వెల్లడించారు. బిఆర్‌ఎస్ తమ పదేళ్ల కాలంలో చేయలేని పనులను, తాము ఏడాదిలోనే చేస్తుంటే, నిర్మాణాత్మకమైన సూచనలు చేయాల్సిన ప్రధానప్రతిపక్ష నేత కెసిఆర్ , వారి పిల్లలను( కెటిఆర్,హరీశ్‌రావు) ప్రభుత్వంపైకి ఉసిగొల్పారని, అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకునేందుకు వారు 'మారీచ సుబాహుల్లా, రాహు కేతువులా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఉద్యమ నాయకునిగా, రాష్ట్ర, కేంద్ర మంత్రిగా సిఎంగా అనుభవం ఉన్న కెసిఆర్, తమ పిల్లలకు బుద్ధి చెప్పి, నియంత్రణలో పెట్టాలని, తద్వారా కెసిఆర్ తన పెద్దరికాన్ని కాపాడుకోవాలని సిఎం హితవుపలికారు. వారిద్దరూ ఇలాగే (కెటిఆర్,హరీశ్‌రావు) ఎటమటంగా వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుంటూ ముందుకెళ్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా కెసిఆర్ మానసిక పరివర్తనలో మార్పు రావాల్సి ఉన్నదన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో 'ఇందిరమ్మ ఇండ్ల'మొబైల్ యాప్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, మహ్మద్ షబ్బీర్ అలీ, టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి మహేష్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరువాయి 2లో

## ఐటిడిఎ ప్రాంతాలకు ప్రత్యేక కోటా

రాష్ట్ర వ్యాప్తంగా ఐటిడిఎ పరిధిలోని గిరిజనులకు ప్రత్యేక కోటాను, నిధులను కేటాయిస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నల్లమల్లలోని చెంచులు, ఆదిలాబాద్‌లోని గోండులు, భద్రాచలంలోని కోయలు ఇలా తెలంగాణ మట్టి మనుషులు, మూల పురుషుల్లో వారికి ఇందిరమ్మ ఇళ్లను ప్రత్యేకంగా కేటాయిస్తామని తెలిపారు. ఇంద్రవెల్లికి తాను అల్లుడని చెప్పుకునే కెసిఆర్ ఆ గ్రామంలో ఇంటినిర్మాణం చేస్తానని హామీనిచ్చి విస్మరించారని, కానీ తాను అక్కడ ఐదు వేల గృహాలను అందజేసిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఈ నమూనానే పాటించాలనే నిబంధన ఏమీలేదని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలలంలో ఒక నమూనాతో కూడిన ఇందిరమ్మ ఇంటిని నిర్మిస్తామని, ఈ నమూనా నచ్చితే ఎవరైనా నిర్మించుకోవచ్చని సూచించారు.

# పోషకాలతో కూడిన భోజనం పెట్టాలి



ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం జారీ

**హైదరాబాద్ :** ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో పోషకాలతో కూడిన ఆహారం పెట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత నెల మాగనూరు, బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించిన ఘటనలో 6 వారాల్లో నివేదిక సమర్పించాలని అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌ను ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధె, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావులతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ పేర్కొన్న మూడు ఘటనలే కాకుండా మరో రెండు ఘటనలు ప్రభుత్వం దృష్టికి తరువాయి 2లో

# టిజిపిఎస్‌సి చైర్మన్‌గా బుర్రా వెంకటేశం బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

టిజిపిఎస్‌సి కమిషన్ పట్ల అభ్యర్థుల్లో పూర్తి విశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తానని టిజిపిఎస్‌సి చైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, ప్రణాళిక బద్ధంగా ప్రతీ పరీక్షా నిర్వహిస్తామని, పరీక్షలు ప్రశాంతంగా, విశ్వాసభరితంగా రాసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు మూడున్నర ఏళ్ల సర్వీస్‌ను వదులుకుని తాను టిజిపిఎస్‌సి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు లేకుండా పరీక్షలు రాయాలన్నారు. టిజిపిఎస్‌సిలో తాము ఉద్యోగాలను తరువాయి 2లో





# హరీశ్‌రావు అరెస్టు... విడుదల

పోలీసుల అదుపులో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ వద్ద బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల ఆందోళన

ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి ప్రతినిధి

మాజీ మంత్రి హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు గురువారం ఉదయం అదుపులోనికి తీసుకుని రాత్రి వదిలిపెట్టారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. హరీశ్‌రావును వదిలిపెట్టాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. అంతకు ముందు మాజీ మంత్రులు హరీశ్‌రావు , జగదీశ్ రెడ్డితో పాటు బిఆర్‌ఎస్ కార్యకర్తలు కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన ఇంట్లోకి ప్రవేశించేందుకు హరీశ్‌రావు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇంటి గేట్లు దూకి వెళ్లేందుకు కార్యకర్తలు యత్నించారు. ఈ క్రమంలో హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి హరీశ్‌రావును పోలీసులు తరలించేందుకు ప్రయత్నించగా పోలీసు వాహనాన్ని కార్యకర్తలు తరువాయి 2లో

## మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉండాలి

ఇందిరా మహిళాశక్తి బజార్‌ను ప్రారంభించిన గవర్నర్, సిఎం

03



# పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్ వ్యతిరేకం

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్




ప్రజాపక్షం/హైదరాబాద్

కొంత మంది బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని, వారు తమ పార్టీలో చేరే అవకాశం ఉందని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్‌గౌడ్ వెల్లడించారు. పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్ వ్యతిరేకమని, ఎవరైనా ఇష్టపడి తమకు తాము వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకుంటే చేర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఆదిలాబాద్ మాజీ ఎంపి సోయం బాపూరావు, తరువాయి 2లో



# దేవేంద్రుడి పట్టాభిషేకం

మహారాష్ట్ర 18వ సిఎంగా ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం

డిప్యూటీ సిఎంలుగా ఏక్‌నాథ్‌షిండే, అజిత్‌పవార్ కూడా...

**ముంబయి :** మహారాష్ట్ర 18వ ముఖ్యమంత్రిగా బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణం చేయించారు. దేవేంద్ర ఫడ్నవీస్ సిఎంగా ప్రమాణం చేయడం ఇది మూడోసారి కావడం విశేషం. అనంతరం శివసేన పార్టీ అధ్యక్షుడు ఏక్‌నాథ్ షిండే, ఎన్‌సిపి నేత అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. ముంబయి ఆజాద్ మైదాన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింధియా, రాందాస్ అథవాలే, బిజెపి అధ్యక్షుడు తరువాయి 2లో

# నేడు 'శంభు నుండి ఢిల్లీ'కి..

101మందితో రైతుల జాతా 'కవాతు షురూ'

రైతు నేత సర్వన్ సింగ్ పంధేర్ వెల్లడి

ఒంటి గంటకు జాతా బయల్దేరుతుందని ప్రకటన

ప్రభుత్వం జాతాను అడ్డుకుంటే రైతులకు 'నైతిక విజయమే'



**చండీగఢ్ :** దేశ వ్యాప్తంగా రైతుల నిరసన ఉధృతి తీవ్రరూపం దాల్చుతోంది. 101మంది రైతులతో కూడిన ఒక జాతా శుక్రవారం శంభు సరిహద్దు నిరసన స్థలం నుంచి ఢిల్లీకి ప్రదర్శనగా సాగనుంది. రైతుల నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ ఈ విషయాన్ని చెప్పారు. శుక్రవారం ఒంటిగంటకు ఈ జాతా బయల్దేరుతుందని గురువారం నాడు శంభు సరిహద్దు వద్ద పంధేర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు.'రైతుల జాతా ఢిల్లీ వైపు సాగుతోంది. ఏం చేయదలచుకుందో ప్రభుత్వమే ఆలోచించుకోవాలి. మేం మా మార్చ్‌ను శుక్రవారం ఒంటిగంటకు శంభు సరిహద్దు నుంచి ఢిల్లీవైపునకు ప్రారంభిస్తాం' అని సర్వన్‌సింగ్ పంధేర్ చెప్పారు.ఆయన మాట్లాడుతూ 'ఒకవేళ ప్రభుత్వం తమ మార్చ్ ముందుకు సాగకుండా ఆపివేసినట్లయితే రైతులకు అది ఒక 'నైతిక విజయమే' అవుతోంది' అని పంధేర్ తెలిపారు. 'రైతులు ట్రాక్టర్ ట్రాలీలను ఈ కార్యక్రమానికి తీసుకురాకుంటే అభ్యంతరం తరువాయి 12లో

# కాళేశ్వరం నీరు లేకున్నా.. సాగు భళా

పెరిగిన సాగు విస్తీర్ణం.. ధాన్యం దిగుబడిలో రికార్డు

కృష్ణా, గోదావరి జలాల వాటాలపై పంతం

ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేసే లక్ష్యం



ప్రజాపక్షం / హైదరాబాద్

వ్యవసాయ ప్రాధాన్యతకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే సాగునీటి రంగంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే కృష్ణా జలాల పంపిణీలో న్యాయంగా రాష్ట్రానికి రావాల్సిన వాటాను సాధించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. బిఆర్‌ఎస్ హయాంలో పదేండ్లలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన లోటుపాట్లు, విధ్వంసకర పరిస్థితులపై ప్రజా ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రం సమర్పించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం లక్ష కోట్ల రూపాయలతో అప్పటి ప్రభుత్వం నిర్మించి కాళేశ్వరంలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు కుంగిపోయిన తీరుపై ప్రజా ప్రభుత్వం అసెంబ్లీలోనే చర్చకు పెట్టింది. నీటిపారుదల రంగంలో పదేండ్లలో పెట్టిన ఖర్చులు, తెచ్చిన అప్పులు, ఆయకట్టు తీరుతెన్నులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ ను తరువాయి 12లో

# ఫ్రాన్స్‌లో కుప్పకూలిన బార్నియర్ ప్రభుత్వం

## పార్లమెంటులో నెగ్గిన లెఫ్ట్ 'అవిశ్వాస తీర్మానం'



**పారిస్ :** అందరూ ఊహించినవిధంగానే ఫ్రెంచ్ ప్రభుత్వం కుప్పకూలింది. పార్లమెంటులో వామపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానం గెలిచింది. పార్లమెంటులో ఈ తీర్మానం 3312 ఓట్లతో ఆమోదం పొందడంతో ప్రధానమంత్రి మైఖేల్ బార్నియర్ (72) ప్రభుత్వం మూన్నాళ్ళముచ్చటగా మిగిలిపోయింది. బార్నియర్ ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్ బిల్లు, ఆయన తీసుకున్న పొదుపు చర్యలను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కానీ బడ్జెట్ బిల్లుపై చర్చ లేకుండా, ఓటింగ్ లేకుండా అమలుచేసి అందరిపైనా రుద్దేందుకు ప్రయత్నించిన బార్నియర్ రాజ్యాంగంలో ఉన్న విశేషాధికారాలను ఉపయోగించేందుకు ప్రయత్నించారు. దీంతో బార్నియర్‌పై వామపక్షాలు అవిశ్వాస తీర్మానం పెట్టాయి. ఆర్థికపరిస్థితి మెరుగుపడాలంటే పొదుపు చర్యలు చేపట్టాల్సిందేనని, అన్నివిధాలుగా బడ్జెట్‌లో కోతలు విధించాల్సిందేనని వాదించారు. ఈ పరిస్థితుల్లో పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ద్వారా కుప్పకూలిన బార్నియర్ ప్రభుత్వం 60 సంవత్సరాల క్రితంనాటి చరిత్రను పునరావృతం చేసింది. 1958 అక్టోబరు నాటి ఫిఫ్త్ రిపబ్లిక్ కింద రూపొందించిన రాజ్యాంగం (ప్రస్తుతంఅమలులో ఉన్న రాజ్యాంగం) ప్రకారం, ఆర్టికల్ 49.3 కింద ఓ టింగ్ లేకుండా బడ్జెట్‌ను ఆమోదించుకునే విశేషాధికారం ప్రధానమంత్రికి దఖలుపడింది. ఐతే దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితుల రీత్యా ఈ పొదుపు చర్యలను ప్రతిపక్షాలు ముఖ్యంగా వామపక్షాలు వ్యతిరేకించాయి. వామపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానానికి బుధవారంనాడు పార్లమెంటు సమావేశంలో పలు పార్టీల ఎంపీలు బలపరిచారు. చివరకు మితవాద నేషనల్ ర్యాలీపార్టీ అధ్యక్షురాలు లీపెన్ కూడా అవిశ్వాస తీర్మానాన్ని సమర్థించారు. గడచిన వేసవికాలంలో ఫ్రెంచ్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రాలేదు. దేశ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేట్ మేక్రాన్ వామపక్షాలను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారని అంతా భావించారు. కానీ ఆయన తనకు అనుకూలమైనవిధంగా మైఖేల్ బార్నియర్‌ను ప్రధానమంత్రిని చేశారు. అవిశ్వాస తీర్మానానికి పార్లమెంటులో అన్నివైపుల నుండీ భారీ మద్దతు లభించింది. రాజ్యాంగ నిబంధనలను గౌరవించి బార్నియర్ గురువారంనాడు ఉదయం అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మా క్రాన్‌ను కలుసుకుని తన రాజీనామా అందజేశారు. దీంతో దేశంలో చెలరేగిన ఆర్థిక గందరగోళంపై తక్షణ చర్యలు తీసుకోవడానికి దేశాధ్యక్షుడు మార్గాన్వేషణ చేయడంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో కడపటి వార్త లు అందేసరికి దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ గురువారం జాతిని ఉద్దేశించి ప్రసంగించేందుకు సిద్ధమ య్యారు. దేశ రాజకీ యాలలో స్థిరత్వం సాధించడంపై ఆయ న ప్రధా నంగా మాట్లాడతారు. ఐతే ప్రధానంగా కొత్త ప్రధాన మంత్రిని ఎవరిని ఎంపిక చేయాలనే విషయాన్ని ఆయన వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

### మేక్రాన్ రాజీనామాకు డిమాండ్




అస్తవ్యస్త నిర్ణయాలతోదేశాన్ని గందర గోళంలో పడేస్తున్న ఫ్రా న్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మే క్రాన్ కూడా రాజీ నామా చేయాలని దేశంలో డిమాండ్లు వస్తున్నాయి. మేక్రాన్‌చేత రాజీనామా చేయించి త్వరలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిపించాలని మితవాద నేషనల్ ర్యాలీపార్టీ అధ్యక్షురాలు లీపె న్ కోరుతున్నారు. తదుపరి ప్రధాన మంత్రి పదవి తనకే దక్కా లని లీపెన్ చాలా గాఢంగా వాంఛిస్తున్నారు. ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీ లో నేషనల్ ర్యా లీకే ఎక్కువసీట్లు కనిపిస్తున్నాయి. మేక్రాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ''దేశాధ్యక్షుడు మేక్రాన్ తన పదవినుండి వైదొ లగితేనే సమ స్యకు పరిష్కా రం వస్తుందని, దేశం స్థిరత్వం సాధిస్తుంది'' అని ఫ్రాన్స్ వామపక్ష అన్‌బౌవ్డ్ పార్టీ నాయకులు మాన్యు యె ల్ బంపార్డ్ వ్యాఖ్యానించారు. రాజీ నామా చేయాలన్న డిమా ండ్లపై మేక్రాన్ స్పందిస్తూ 2027 వరకూ తనకు పదవీ బాధ్యతలు న్నాయన్నారు. అలాంటి అవసరం లేదన్నారు.

# హమాస్‌తో ఇజ్రాయెల్ బందీల ఒప్పందం?

## 60 రోజులు కాల్పుల విరమణ

**టెల్‌అవీవ్ :** గాజాలో ఉన్న బందీల విడుదలకు సంబంధించి హమాస్ సంస్థతో ఇజ్రాయెల్ ఒప్పందం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు ఒక తాజా ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ప్రతిపాదించిందని ఆ దేశ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ చెప్పారు. ఆగస్టులో చర్చించిన దశలవారీ ప్రణాళికకు కొనసాగింపుగానే ఈ కొత్త ప్రతిపాదన కూడా ఉందని ఇద్దరు ఇజ్రాయెలీ ఉన్నతాధికారులను ఉటంకిస్తూ 'యాక్సియో స్ నివేదిక' వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం 2023 అక్టోబరులో హమాస్ ఉగ్రవాదులు బందీలుగా తీసుకువెళ్ళిన 50 మంది ఇజ్రాయెల్ స్త్రీ పురుషుల ఆరోగ్యపరిస్థితి ఏమాత్రం బాగోలేదు. వారి ఆరోగ్యాలు చాలా క్షీణదశలో ఉన్నాయి. ఐతే ఇజ్రాయె ల్ ప్రధానంగా 33 మంది బందీలను విడుదల చేయాలని కోరుతున్నది. కానీ ఈ 33 మందిలో కూడా ఎక్కువమంది సజీవంవగా ఉండే అవకాశం లేదని కూడా ఇజ్రాయెల్ భావిస్తున్నది. ఉగ్రవాద దాడులతో అనేకబమంది మరణాలకు కారణమై జీవితకాలశిక్ష అనుభవిస్తున్న హమాస్‌కు చెందన ఖైదీలతోపాటు వందలాదిమంది పాలస్తీనియన్లను జైళ్ళనుండి విడుదల చేసేందుకు ఈ ఒప్పందం ప్రకారం ఇ జ్రాయెల్ సిద్ధంగా ఉందని యాక్సియోస్ నివేదిక పేర్కొంది. గడచిన ఆదివారంనాడు జరిగిన సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహు, ఇతర సీనియర్ మం త్రులు, రక్షణవిభాగం మంత్రులు, అధికారులు ఈ ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపారు. కానీ హమాస్ మాత్రం వివక్షతో కూ డిన ఒప్పందాలకు తావిస్తోందని ఇజ్రాయెలీ అధికారులు పేర్కొన్నారు. గతంలో ప్రతిపాదన ప్రకారం 42 రోజులు కాల్పుల విరమణ అన్నారు. కానీ ఇప్పుడు తాజా ప్రతిపాదనలో 60 రోజుల కాల్పుల విరమణను ఉటంకించారు.



### ఆరుగురు బందీల మృతదేహాలపై ఇజ్రాయెల్ సందేహాలు

ఆగస్టునెలలో ఇజ్రాయెల్ ఆరుగురు బందీల మృతదేహాలను స్వాధీనం చేసుకుంది. ఐతే ఈ మృతదేహాలు గాజాలో తాము దాడులు జరిపిన ప్రదేశంలో ఉండటంపై ఇజ్రాయెల్ సైన్యం అనేక సందేహాలు వ్యక్తం చేస్తోంది. దీనిపై ఐడిఎఫ్ తాజాగా ఒక వివరణ ఇచ్చింది.ఈబందీల మరణాలపై ఇంకా దర్యాప్తు కొనసాగుతున్నదని ఐడిఎఫ్ తెలియజేసింది. తాము ఫిబ్రవరిలో గాజాలో గగనతల దాడులు చేశామని, ఐతే దాడులకు ముందుగానే ఈ బందీలను చంపి అక్కడ పడేసి ఉంటారనీ, లేదావారికి అక్కడ బంధించి ఉంటారని పలురకాల సందేహాలు ఐడిఎఫ్ వ్యక్తం చేస్తున్నది. ఫిబ్రవరిలో జరిగిన దాడుల ప్రదేశంలో ఉన్న బందీల మృతదేహాలను ఆగస్టులో ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. తమకు ఏమాత్రం అనుమానం రాకుండా హమాస్ బందీలను చంపి అక్కడ పడేసి ఉంటుందని ఇజ్రాయెల్ సైన్యం అనుమానిస్తున్నది.

### 48మంది పాలస్తీనియన్లు మృతి

ఇజ్రాయెల్ దాడుల్లో గడచిన 24 గంటల్లో 48 మంది పాలస్తీనియన్లు మరణించారు. గాజాలోని అల్ మవాసీ సేఫ్ జోన్‌లో చేసిన దాడుల్లో 21 మంది మరణించారు. డజన్లసంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. నస్సెర్ ఆసుపత్రి డైరెక్టర్ అతిఫ్ అల్ హౌత్ చెప్పారు. మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నాగానీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తున్నాయి. మజ్దాల్ జౌన్ ఏరియాలో ఈ దాడులు జరిగాయి.

# ప్రతిపక్షనేతను చితకబాదిన జార్జియా పోలీసులు



**తిబ్లిసి :** జార్జియాలో పోలీసులు ప్రతిపక్ష నాయకుడు (కొయిలేషన్ ఫర్ ఛేంజ్) నికా గ్వారామియా (48)ను పోలీసులు పార్టీ కార్యాలయంలోంచి బయటకు ఈడ్చుకువచ్చి చితకబాదారు. దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సమాయత్తమవుతున్న ప్రతిపక్షాలకు చెందిన 11 మంది నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. జార్జియాలో బలమైన నాయకుడు అలెకో ఎలిసాష్విలి కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. జార్జియావారం రోజులుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్లర్లు, హింసాకాండ కొనసాగుతున్నది. జార్జియాదేశం యూరోపియన్ యూ నియన్ సభ్యత్వం తీసుకునేందుకు తిరస్కరించడంతో దేశంలో అల్లర్లు, నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. ఈ అల్లర్లకు, నిరసనలు, హింసాకాండను ప్రతిపక్షాలే రెచ్చగొడుతున్నాయని ప్రభుత్వం మొదటినుండీ వాదిస్తున్నది. ఈ అల్లర్లకు కారకులైన మూలసూత్రధారులను రోడ్డుమీద నిలబెడతామని, న్యాయస్థానం ముందుకు తెస్తామని ప్రధానమంత్రి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడు గ్వారామియాను ఆయన పార్టీ కార్యాలయం నుండి పోలీసులు బయటకు ఈడ్చుకువచ్చి చితకబాదారు. దేశరాజధాని తిబ్లిసిలో పార్లమెంటు పక్కసందులోనే ఉన్న ప్రతిపక్ష రాజకీయపార్టీ కార్యాయం నుండి గ్వారామియాను పోలీసులు చేతులూ కాళ్ళూ పట్టుకుని బయటకు ఈడ్చుకువచ్చి చితకబాదారు. ఆయనతోపాటు మరికొంతమందిని కూడా తీవ్రంగా కొట్టారు. ప్రతిపక్ష నాయకులు అందరూ ఒక హోటల్‌లో సమావేశమై సార్వత్రిక సమ్మె చేయాలిన నిర్ణయం తీసుకున్నారు. తర్వాత పోలీసులు వారిపై కూడా దాడివేశారు. జార్జియాలో ఇప్పటికే 330 మందిని అరెస్టు చేశారు. జార్జియా అధికారపార్టీని పదవిలోంచి దించేసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. అధికార డ్రీమ్‌పార్టీ రష్యా అనుకూల విధానాలు అనుసరిస్తోందని, దేశాన్ని రష్యావైపు నడిపిస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. డ్రీమ్‌పార్టీ ప్రధానమంత్రి ఇరక్లీ కొబఖిడ్జే ఇటీవల యూరోపియన్ యూనియన్‌లో చేరేదిలేదని ప్రకటించారు. యూరోపియన్ యూనియన్‌కు బడ్జెట్ కేటాయింపులను కూడా 2028 వరకూ నిరవధికంగా వాయిదావేశారు.ఆతర్వాతనుండి దేశంలో అల్లర్లు ఉద్ధృతమయ్యాయి.

# హసీనా విద్వేష ప్రసంగాలను నిషేధించిన బిఐసిటి



ఢాకా : పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా చేసిన ప్రసంగాలను బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ (బిఐసిటి) నిషేధించింది. భారత్‌లో గుర్తు తెలియని చోట నాలుగు నెలలుగా తలదాచుకుంటున్న హసీనా ఇటీవల బంగ్లాదేశ్ తాత్కాలిక నాయకులు యూనుస్‌పై ప్రకటన చేశారు. యూనుస్ దేశంలో శాంతి భద్రతలను రక్షించడంలో,హిందూ మైనారిటీలకు రక్షణ ఇవ్వడంలో విఫలమయ్యారని ప్రకటన చేశారు. దీంతో పాటు ఆమె గతంలో చేసిన ప్రసంగాలన్నింటినీ విద్వేష ప్రసంగాలుగా బిఐసిటి అభివర్ణించింది. వాటన్నింటినీ నిషేధించింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలను ఊచకోత కోస్తున్నారని, వారికి రక్షణ లేదని ఇటీవల హసీనా ఒక ప్రకటన చేశారు. దీనిని విద్వేష ప్రసంగంగా బిఐసిటి పరిగణించింది. జస్టిస్ మహ్మద్ గోలమ్ మోర్తుజా మొజుందర్ నాయకత్వానగల ఇద్దరు సభ్యుల ట్రిబ్యునల్ ఈ నిషేధ ఉత్తర్వు జారీ చేసింది.

# హమా నగరాన్ని స్వాధీనం చేసుకున్న సిరియా తిరుగుబాటుదారులు





**డమాస్కస్ :** సిరియాలో తిరుగుబాటు దారులను అడ్డుకోవడంలో ప్రభుత్వ దళాలు విఫలమవుతున్నాయి. రాజధాని డమాస్కస్‌కు 213 కి.మీ దూరంలో ఉన్న అతిపెద్ద నగరం హమాను తిరుగుబాటుదారులు మూడు వైపుల నుండీ చుట్టుముట్టారు. నగరం వారి స్వాధీనంలోకి వెళ్ళిపోనున్నది. తిరుగుబాటుదారులు అన్నివైపుల నుండీ నగరాన్ని చుట్టుముట్టడంతో దేశాధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ నాయకత్వానగల ప్రభుత్వ దళాలు ఈ ప్రాంతాన్ని ఖాళీచేసి వెళ్ళిపోయాయి. వారం రోజులక్రితం అతిపెద్ద సిరియా నగరం అలెప్పోను తిరుగుబాటుదారులు స్వాధీనం చేసుకుని ప్రపంచాన్ని దిగ్భ్రాంతపరచాయి. పెద్ద సంఖ్యలో అస్సాద్ నాయకత్వానగల ప్రభు త్వ దళాలను హతమార్చి అలెప్పో ను తిరుగుబాటుదారులు స్వాధీ నం చేసుకున్నారు. ఐతే అస్సాద్ మాత్రం చాలా ధీమాగా ఉన్నారు. అంతర్జాతీయ మిత్రుల సహాయం తో తాము తిరిగి ఆ ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. అ స్సాద్‌కు మద్దతు ఇచ్చేందుకు ఇరాన్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇప్పటికే రష్యా యుద్ధ విమానాల సహాయంతో అస్సాద్ సైన్యం దేశంలో ఆధిపత్యంకోసం ప్రయత్నం చేస్తున్నది. ఐతే తిరుగుబాటుదారుల కమాండర్ హస్సన్ అబ్దుల్ ఘనీ సోషల్ మీడియాలో గురువారం ఒక పోస్టింగ్ పెడుతూ హమా నగరంలోకి తమ దళాలు ప్రవేశించడం ప్రారంభించాయని పేర్కొన్నారు. హయత్ తహ్రిర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) సంస్థకు చెందిన నాయకుడు అబూ మహ్మద్ అల్ జులానీ నాయకత్వంలో తిరుగుబాటుదారులు సిరియాలో జైత్రయాత్ర సాగిస్తున్నారు. కేవలం మూడు రోజుల్లో అలెప్పోను జులానీ వ్యూహంతోనే స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు మరో నగరం హమాను స్వాధీనం చేసుకున్నారు.

## బాధ్యతల స్వీకరణ (మొదటి పేజీ తరువాయి)

ఇప్పిస్తామని ఎవరైనా చెబితే, వారిపైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. టిజిపిఎస్‌సి కమిషన్‌కు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్‌ను కూడా కేటాయిస్తామని తెలిపారు. యుపిపిఎస్‌సితో సమానంగా టిజిపిఎస్‌సి పని చేస్తుందని అన్నారు. టిజిపిఎస్‌సికి స్వయం ప్రతిపత్తి ఉన్నదని, ఎవరికీ భయపడకుండా పని చేస్తామని స్పష్టం చేశారు. ఎవ్వరూ తప్పులు చేసినా ఉపేక్షించబోమన్నారు. విద్యాశాఖలో పనిచేయడం ద్వారా ప్రశ్నల తయారీపై మంచి అవగాహన సాధించానని, పోటీ పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలలో తప్పులు లేకుండా చూస్తామని చెప్పారు. ఛైర్మన్ పదవిలోకి రావడం తనకు ఎంతో సంతోషమన్నారు.

## పట్టాభిషేకం(మొదటి పేజీ తరువాయి)

జెపి నడ్డా, అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ, యోగి ఆదిత్యనాథ్ (ఉత్తరప్రదేశ్), నితీష్ కుమార్ (బీహార్), పుష్కర్ సింగ్ ధామి (ఉత్తరాఖండ్, నయాబ్ సింగ్ సైనీ (హర్యానా), భూపేంద్ర పటేల్ (గుజరాత్) మరియు ప్రమోద్ సావంత్ (గోవా) సహా అనేక ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా వేడుకకు హాజరయ్యారు. పారిశ్రామికవేత్తలు ముఖేష్ అంబానీ, కుమారమంగళం బిర్లా, బాలీవుడ్ స్టార్లు షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, రణబీర్ కపూర్, మాధురీ దీక్షిత్‌నేనే, సంజయ్ దత్, క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కూడా హాజరయ్యారు. నూతన సిఎంగా బాధ్యతలు స్వీకరించిన ఫడ్నవీస్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం ఫడ్నవీస్ , ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ను ప్రధాని అభినందించారు. దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఆయన భార్య అమృత ఫడ్నవీస్ మీడియాతో మాట్లాడారు. సిఎంగా ఆయనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. 'ఫడ్నవీస్ ఆరోసారి ఎమ్మెల్యే అయ్యారు. మూడోసారి సీఎం కానున్నారు ఈ విషయంలో ఆనందం కన్నా, ఆయనపై పెద్ద బాధ్యత ఉందనే భావన కలుగుతోంది' అని అమృత పేర్కొన్నారు. కాగా, ఫడ్నవీస్ 2014లో తొలిసారి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2014 నుంచి 2019 వరకు సిఎంగా వ్యవహరించారు. ఇక 2019లో రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటికీ అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా 3 రోజులకే రాజీనామా చేయాల్సి వచ్చింది. తాజాగా ఆయన మూడోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు.

## కాంగ్రెస్ వ్యతిరేకం(మొదటి పేజీ తరువాయి)

మాజీ ఎంఎల్‌ఎ ఆత్రం సక్కు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో సోయం బాపూరావు, ఆత్రం సక్కు కు కాంగ్రెస్ కండువా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకమన్నారు. గతంలో బిఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులను బెదిరింపులకు గురి చేసి పార్టీ ఫిరాయింపులకు పాల్పడిందన్నారు. కౌశిక్ రెడ్డి, హరీష్ రావుల వివాదంపై స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ చట్టం ఎవరికీ చుట్టం కాదని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామంటే ఉపేక్షించేదే లేదన్నారు.

## నిప్పులు చిమ్ముతూ నింగికి..

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశిత లక్ష్యాలు సాధించిన పిఎస్‌ఎల్‌వి ప్రాజెక్టు టీముకు నా అభినందనలు తెలియజేస్తున్నాను''అని సోమనాథ్ అన్నారు.
అంతకుముందు సోషల్ మీడియాలో 'ఇస్రో' ఒక పోస్టింగ్ పెడుతూ, ''ప్రయోగం విజయవంతమైంది. పిఎస్‌ఎల్‌వి–సి59–ప్రోబా–3 ప్రయోగం లక్ష్యాన్ని చేరుకుంది. సూర్యుణ్ణి సన్నిహితంగా అధ్యయనం చేసేందుకు ఈ ప్రయోగాన్ని చేపట్టారు, యూరోపియన్ స్పేస్ ఏజన్సీ చాలా ప్రత్యేకమైనది,ప్రోబా–3 అంతరిక్ష నౌకలో రెండు ఉపగ్రహాలూ ఒకటిగానే ఉన్నాయి. రాబోయే నెలల్లో ఈ రెండు ఉపగ్రహాలు వేరు పడతాయి. కానీ ఎలాంటి ఎక్కువ తక్కువలూ లేకుండా చాలా ఖచ్చితత్వంతో సమానస్థాయిలో పయనం కొనసాగిస్తాయి, సౌరవ్యవస్థలోని చాలా ఆసక్తికరమైన కరోగ్రఫీ శాస్త్రీయ పరిశోధనను ఈ ఉపగ్రహాలు నిర్వహిస్తాయి'' అని సోమనాథ్ పేర్కొన్నారు.

# పెద్దరికాన్ని నిలబెట్టుకోండి

(మొదటి పేజీ తరువాయి)



శాంతికుమారితో కలిసి సిఎం రేవంత్ రెడ్డి 'ఇందిరమ్మ ఇంటి యాప్' గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో తొలి ఏడాదిలోనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించబోతున్నామన్నారు. నిరుపేదలు, దళిత, గిరిజన, బలహీనవర్గాలు, వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, పారిశుధ్య కార్మికులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ఇందిరమ్మ లబ్ధిదారులుగా ఎంపిక చేయడమే తమ మొదటి ప్రాధాన్యత అని అన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్నామని, దేశంలో ఇంత మొత్తం కేటాయిస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని అన్నారు. ఆత్మగౌరవంతో బతకాలనుకుంటే సొంత ఇల్లు ఉండాలని, ఆ కల నెరవేరాలనే ఉద్దేశంతోనే ఇందిరా గాంధీ నాడు ఇళ్లను నిర్మించి పేదలకు ఇచ్చారని వివరించారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చేమో కానీ, ఇందిరమ్మ గృహాలు లేని గ్రామం లేదన్నారు. కూడు.. గూడు.. గుడ్డ... నినాదాన్ని ఇందిరా గాంధీ ఆచరణలోకి తీసుకువచ్చారన్నారు. సీలింగ్ యాక్ట్ ద్వారా గిరిజనులు, దళితులకు మిగులు భూముల పంపిణీ చేపట్టారని, ఇందిరమ్మ హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.10 వేలు కేటాయిస్తే, నాటి వై.ఎస్ ప్రభుత్వం రూ.1.25 లక్షలకు పెంచారని, ప్రస్తుతం అధికారంలోనికి వచ్చిన ప్రజా ప్రభుత్వం పెరిగిన ధరల ప్రకారం రూ.5 లక్షలు ఇస్తోందని సిఎం తెలిపారు. లక్ష్యం ఎంత గొప్పదైనా అమలులో లోపాలు ఉంటే ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతింటుందని, పేదలకు అన్యాయం జరుగుతుందనే ఆలోచనతోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను కూడా వినియోగిస్తున్నామని వివరించారు.

**నాటి పదేళ్ల కాంగ్రెస్ పాలనలో 25 లక్షల ఇళ్లు పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో 65 వేల ఇళ్లు**

ఉమ్మడి రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతంలో 2004 నుంచి 2014 వరకు నాటి కాంగ్రెస్ పదేళ్ల కాలంలో 25.04 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తే, 2014 నుంచి 2023 వరకు బిఆర్‌ఎస్ కేవలం 65వేల ఇళ్లను మాత్రమే నిర్మించిందని సిఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. నాటి ఇందిరమ్మ ఇళ్లను పిట్ట గూళ్లని, కొడుకు, కోడలు, అల్లుడు, బిడ్డ వస్తే ఎక్కడ ఉంటారని, మేకను, కోడిని ఎక్కడ కట్టేస్తారని ఎన్నికల ప్రచార సభల్లో కెసిఆర్ విమర్శలు చేసిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కెసిఆర్ పాలనలో కేవలం లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ప్రారంభించి, 65 వేల ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 35 వేల ఇళ్ల నిర్మాణ పనులను తామే రూ.195 కోట్లు కేటాయించి, ఆ పెండింగ్ పనులను పూర్తి చేశామన్నారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో ప్రగతి భవన్‌ను, వాస్తు కోసం సచివాలయాన్ని నిర్మించుకున్నారని, గజ్వేల్,జన్వాడ ఫామ్‌హౌసులను నిర్మించుకున్నారని, బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ భవనాల కోసం ఎకరాల కొద్ది భూమి కేటాయించుకున్నారని, కానీ పేదల డబల్‌బెడ్‌రూముల నిర్మాణాలను మాత్రం పూర్తి చేయలేదని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ ప్రాధాన్యత పేదలు కాదని వారికి వారే ప్రాధాన్యత అని అన్నారు. కెసిఆర్ తన పదవీ కాలంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదని, ఆయన చెప్పినట్లు కోడి, మేక ఎక్కడ ఉండాలో చూపలేదని, కానీ కాలనీకో బెల్టు షాపులు మాత్రం పెట్టారని సిఎం విమర్శించారు.ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేస్తున్నామన్నారు.

**కెసిఆర్ తన పెద్దరికాన్ని కాపాడుకోవాలి:**

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్‌కు అప్పగిస్తే, ఆయన తన పదేళ్ల పాలనా కాలం తర్వాత రూ.7 లక్షల కోట్ల అప్పుతో తమకు అప్పగించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కెసిఆర్ పాలనా కాలంలో చేసిన అప్పులు,తప్పులను సరి చేయడానికే తమకు సమయం పడుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత రాజశేఖర్ రెడ్డి, ఆ తర్వాత రాజశేఖర్ రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ప్రజా సమస్యలపైన ప్రభుత్వానికి నివేదికల రూపంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవారని అన్నారు. సిద్ధిపేట నియోజకవర్గ అభివృద్ధి పనుల నిమ్మితం ఉమ్మడి రాష్ట్రంలో టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్‌రావు అప్పటి సిఎం వైఎస్‌ఆర్‌ను కలిస్తే, కాంగ్రెస్‌లో చేరేందుకే వైఎస్‌ను హరీశ్ కలిశారని ప్రచారం కూడా జరిగిందని, కానీ తాను అభివృద్ధి పనుల నిమ్మితమే వైఎస్‌ఆర్‌ను కలిసినట్టు హరీశ్ వివరణ ఇచ్చుకున్నారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. సిఎంను ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు కలిసే మంచి సాంప్రదాయం ఉండేదని, కానీ కెసిఆర్ సిఎం అయిన తర్వాత ఆ సంప్రదాయాన్ని పక్కన పెట్టి, ప్రభుత్వం, ప్రతిపక్షం అంటే ఒక పాకిస్తాన్ , భారత్ అనే రెండు శత్రుదేశాల సైనికులు అనే వాతావరణాన్ని కలిపించారని సిఎం మండిపడ్డారు. తమిళనాడులో రాజకీయ వైరుధ్యాలు ఎంత ఉన్నప్పటికీ ఆ రాష్ట్ర అంశాల విషయంలో మాత్రం అన్ని రాజకీయ పార్టీలు ఏకమవుతారని.. ఇక్కడ అలానే కావాలని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై రాష్ట్రంలో 17 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ సభ్యులకు సూచనలు ఇచ్చేందుకు కెసిఆర్ కలిసి రావాలని సిఎం ఆహ్వానించారు.

**ఆటబొమ్మలు విరగ్గొట్టే పిల్లల్లా**

తాము అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండింటిన సమతూకం చేసుకుంటూ ముందుకెళ్తుంటే, చిన్న పిల్లల్లా కెటిఆర్, హరీశ్ రావు వ్యవహరిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. హోమ్‌వర్క్ చేయని పిల్లలు హోమ్ వర్క్ చేసిన పిల్లాడి నోట్సు చింపివేసినట్లు..పక్క వాడి చేతిలో ఆట బొమ్మలు విరగొట్టే చిన్న పిల్లల్లా ఆ ఇద్దరూ (హరీశ్ రావు, కెటిఆర్) ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. శాసన సభలో పాలక పక్షానికి ఎంత ప్రాధాన్యత ఉందో ప్రతిపక్షానికి అంతే ప్రాధాన్యత ఉన్నదని సూచించారు. కెసిఆర్ శాసనసభకు వచ్చి ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని, ఇరకాటంలో కూడా పెట్టవచ్చని సూచించారు. సభలో ప్రధానప్రతిపక్ష సీటు ఖాళీగా ఉండడం మంచిది కాదని హితువు పలికారు.

**కెసిఆర్.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఆహ్వానం**

ఈ నెల 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ విష్కరణ కార్యక్రమానికి ప్రధానప్రతిపక్ష నేత కెసిఆర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, సిపిఐ ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావుతో పాటు ఎంపిఎంను కూడా ఆహ్వానించాలని సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ కు సూచించారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో సచివాలయ ప్రాంగణం, నెక్లెస్ రోడ్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో జరిగే తెలంగాణ సంబరాల్లో కూడా ప్రధాన ప్రతిపక్ష నేత పాల్గొనాలన్నారు.

**రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు: భట్టి**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ నాలుగున్నర లక్షల కుటుంబాలకు రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి జీవికి,మనిషికి ఒక గూడు అవసరమన్నారు. బిఆర్‌ఎస్ అడ్డగోలుగా చేసిన అప్పులకు తాము రూ. 64 వేల కోట్లు వడ్డీలను చెల్లిస్తున్నామన్నారు. ఆర్థిక క్రమశిక్షణతో తాము సంక్షేమ పథకాలుఅమలు చేస్తుంటే, కొందరు తమ ప్రభుత్వంపైన బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆనాడే ఇంటిగ్రేడ్ హాస్టల్స్‌ను ఏర్పాటు చేసి ఉంటే,ప్రస్తుతం గురుకులాల్లో ఇలాంటి పరిస్థితులు వచ్చేవి కావని, సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందిపడే వారు కాదు కదా అని భట్టి అన్నారు.

**ఎవ్వరూ ఒక్క రూపాయి ఇవ్వరు : మంత్రి పొంగులేటి**

గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి కోసం ఎవ్వరూ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా నిరుపేదలకు ముందుగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులుగా గుర్తిస్తామని, ఈ కార్యక్రమం నిరంతరంగా నిర్వహిస్తామని తెలిపారు. దేశంలోనే అత్యధిక ఇంటినిర్మాణాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణ ఉండేలా చేస్తామని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాదిపూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్న పెద్ద కానుక ఇందిరమ్మ ఇళ్లు అని అన్నారు.

## హరీశ్‌రావు అరెస్టు... విడుదల

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ మంత్రులు జి.జగదీష్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితతో పాటు ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు , సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ను విడుదల చేయాలంటూ బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితతో పాటు పలువురు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. హామీలపైన కాంగ్రెస్‌ను నిలదీస్తే అరెస్టులు చేయడం ఏమిటని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. ఈమేరకు ఆయన తన ట్విట్టర్‌లో (ఎక్స్)లో పోస్ట్ చేశారు. ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అన్నారు.

**రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన : హరీశ్ రావు**

ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని ఎమర్జెన్సీ పాలనను తీసుకొచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. పోలీసులను అతిగా ప్రయోగించిన ఏ ప్రభుత్వం నిలబడలేదన్నారు. ఎవరిని అరెస్టు చేయాలో గాంధీభవన్ లోనే నిర్ణయిస్తున్నారని, రేవంత్ రెడ్డి శాశ్వతం కాదని, పోలీసులు ఈ విషయం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సైకోలాగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఎంఎల్‌ఎ కౌశిక్ రెడ్డిని కూడా బేషరతుగా విడుదల చేయాలని ఆయన కోరారు.

**ఎంఎల్‌ఎ కౌశిక్ రెడ్డి అరెస్ట్**

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో తమ విధులకు ఆటంకం కలిగించారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర చేసిన ఫిర్యాదు మేరకు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ పాడి కౌశిక్ రెడ్డిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు అతని అనుచరులపై కేసు నమోదు చేశారు .గురువారం ఉదయం కొండాపూర్‌లోని కౌశిక్ రెడ్డి నివాసం వద్ద భారీగా పోలీసులు చేరుకుని ఆయనను అరెస్ట్ చేశారు.ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాప్ చేస్తూ ట్రాక్ చేస్తోందని పాడి కౌశిక్ రెడ్డి బుధవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలోనే పోలీసులకు, కౌశిక్ రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. ఫిర్యాదు చేయడానికి రమ్మని పిలిచిన పోలీసు అధికారి ఆ సమయంలో లేకపోవడంపై కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కింది స్థాయి సిబ్బంది తన ఫిర్యాదు తీసుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పాటు బెదిరించారని ఆరోపిస్తూ ఇన్‌స్పెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఎం ఎల్‌ఎ కౌశిక్ రెడ్డి దూషించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపైన పోలీసులు కేసు నమోదు చేశారు.

## పోషకాలతో కూడిన భోజనం పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాయని ఆయా ఘటనలో బాధ్యులైన వాళ్లపై చర్యలు తీసుకున్నట్లు ఎఎజి ఇమ్రాన్‌ఖాన్ కోర్టుకు తెలిపారు. నారాయణపేట్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో వేర్వేరుగా రెండు కమిటీలు ఏర్పాటు చేశామని భోజనం వికటించిన ఘటనపై అధ్యయనం చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఇప్పటికే నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. 25వేల 941 ప్రభుత్వ పాఠశాలల్లో 18లక్షల మందికి పైగా విద్యార్థులన్నారని వాళ్లలో 75 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురయ్యారని ఏఏజీ వివరించారు. ఈ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర మార్గనిర్దేశకాల ప్రకారం గ్రామ, మండల, జిల్లా,రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా పర్యవేక్షించాల్సి ఉంటుందని కానీ క్షేత్రస్థాయిలో ఇలా చోటు చేసుకోవడం లేదని పిటీషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు తెలిపారు. మధ్యాహ్న భోజనంలో సరైన ఆహారం పెట్టడం లేదని గుడ్డు కూడా ఇవ్వడం లేదని కోర్టుకు తెలిపారు. ఆ కమిటీలకు అదనంగానే ఇటీవల చోటు చేసుకున్న ఘటనలపై అధ్యయనానికి మరో రెండు కమిటీలు ఏర్పాటు చేశామని అన్ని కమిటీలు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. మధ్యాహ్న భోజనం వడ్డించే ఏజెన్సీలకు ప్రభుత్వం ఇటీవలే 40 శాతం డబ్బులు పెంచినట్లు తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న హైకోర్టు విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

ఫోకస్

# వ్యవసాయం

# ఉద్యమమే శరణ్యం..





వ్యవసాయ ప్రాధాన్యతగల మన దేశంలో రైతులే బాధితులు. కనీస డిమాండ్లు కూడా కేంద్రం నెరవేర్చకపోవడంతో, ఉద్యమమే శరణ్యమంటూ మలి పోరాటాలకు సిద్ధమవుతున్నారు. 2020 నవంబర్ 26న ప్రారంభమై, సుమారు ఏడాది కొనసాగిన రైతు నిరసనలు దేశంలో ప్రకంపనలు సృష్టించిన నేపథ్యంలో మోదీ సర్కారు ఇచ్చిన హామీలు అటకెక్కాయి. పంటకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని చట్టబద్ధం చేస్తామని, ఇతర డిమాండ్లను కూడా సాధ్యమైనంత త్వరలో నెరవేరుస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిన కేంద్రం, ఆ తర్వాత తన నిజస్వరూపాన్ని మరోసారి బయటపెట్టింది. రైతుల పట్ల గౌరవంగానీ, జాలిగానీ లేదని నిరూపించుకుంది. సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతృత్వంలో ఈనెల 6వ తేదీ, శుక్రవారం ప్రారంభించదలచిన 'ఢిల్లీ ఛలో' కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు జరుగుతున్నా యి. పంజాబ్, హర్యానా సరిహద్దుల నుంచి ముందుకు కదలకుండా రైతులను అడ్డుకోవడానికి సన్నాహాలు ముమ్మరమయ్యాయి. ఈ ఏడాది ఫిబవరి 13న, తిరిగి 21న చేపట్టిన 'ఢిల్లీ పాదయాత్ర' కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈసారి కాలినడకన ఢిల్లీ వెళ్లేందుకు ఎస్‌కెఎం నిర్ణయించింది. దశలవారీగా ఢిల్లీ చేరుకుంటామని, మార్గమధ్యంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ట్రాఫిక్‌కుగానీ, సామా న్య పౌరులకుగానీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతియుతంగా యాత్ర కొనసాగుతుందని తెలిపింది. కా నీ, ఢిల్లీ పోలీస్ అధికారుల నుంచి అనుమతి లభించే వరకూ యాత్ర మొదలుపెట్టడానికి వీల్లేదని అంబాలా అధికారులు స్పష్టం చేస్తున్నారు. రైతుల యాత్రను అడ్డుకోవడమే లక్ష్యమని ప్రస్తుత పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ సరిహద్దుల్లో ఎండకు ఎండి... వానకు తడిసి... ఏడాదిపాటు కొనసాగిన రైతుల ఆందోళనలో కనీసం 800 మంది ప్రాణాలు కోల్పోయారు. సర్వత్రా నిరసనలు వ్యక్తకాడం, అదే సమయంలో ఉత్తరప్రదేశ్ సహా అత్యంత కీలకమైన రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు మరోవైపు కేంద్రాన్ని భయపెట్టాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో వివాదాస్పద మూడు సాగు చట్టాలను రద్దు చేయడం ద్వారా రైతుల ఆందోళనలకు కేంద్రం ముగింపు పలికింది. అంతేగాక, రైతుల ఇతర డిమాండ్లను కూడా పరిష్కరించేందుకు లిఖితపూర్వక హా మీ ఇచ్చింది. కానీ, ఒక్క హామీ కూడా నెరవేరలేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ రైతు సమస్యలు పరిష్కరిస్తామని హామీలు గుప్పించడం, ఆ తర్వాత పట్టించుకోకపోవడం భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి అలవాటే. వరుసగా మూడోసారి కూడా అధికారంలోకి వచ్చిన మోదీ సర్కారు రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న దనేది బహిరంగ రహస్యం. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపనప్పుడు, ఆందోళనబాట పట్టడం మినహా రైతులకు ప్రత్యామ్నాం ఏముంటుంది?

## పర్యావరణం

## తీవ్రస్థాయికి ఉష్ణోగ్రతలు!



పారిశ్రామిక విప్లవానికి పూర్వం నుంచి ఇప్పటివరకూ ఉష్ణోగ్రతలు అత్యంత తీవ్రస్థాయికి చేరిన సంవత్సరంగా 2024 ఇప్పటికే రికార్డు పుటల్లోకి చేరడం ఖాయం గాఉంది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యు ఎంఒ), కోపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్ (సిఎఎస్) ఆందోళనకరమైన ఉష్ణోగ్రత పెరుగుదలను నివేదించాయి. ఈ ఏడాది ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు పారిశ్రామిక పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉండవచ్చని ప్రాథమిక డేటా సూచిస్తున్నది. ఈ ధోరణి అత్యంత ఆందోళకరంగా ఉంది. వాతావరణ పరిక్షణచర్యల తక్షణావసరాన్ని స్పష్టం చేస్తున్నది. అంతకు ముందు ఎన్నడూ లేనంతగా గత ఏడాది ఉష్ణోగ్రతలు నమోదుకాగా, వరుసగా రెండో సంవత్సరం ఇదే పరిస్థితి ఉంటుందని విశ్లేషణ స్పష్టం చేస్తున్నది. 2024 మొదటి పది నెలల డేటాను మూల్యాంకనం చేసిన సిఎఎస్, అక్టోబర్‌లో పారిశ్రామిక పూర్వస్థాయి కంటే ఉష్ణోగ్రతలు 1.65 డిగ్రీల సెల్సియస్ అధికమని వెల్లడించింది.1.5డిగ్రీల సెల్సియస్‌ను దాటకుండా చూడాలన్న తీర్మానాలకు విరుద్ధంగా, అంతకు మించిన ఉష్ణోగ్రతలు నమోదుకావడం గత 16నెలల్లో ఇది 15వసారి కావడం గమనార్హం. ఉష్ణోగ్రతల రికార్డులను సంగ్రహించడానికి డబ్ల్యుఎంఒ వివిధ డేటాసెట్లను ఉపయోగిస్తుంది. వీటిలో ఎన్ఒఎఎ, నాసా, యుకె మెట్ ఆఫీస్ తదితర ప్రసిద్ధ మూలాలు ఉన్నాయి. డెటా సెట్లు పరిశీలనాత్మక వివరాలు, వాతావరణ నమూనాలను అందించగలుగుతాయి. ఇప్పటి వరకూ లభించిన డేటాను పరిశీలిస్తే, నేలపైనేగాక, సముద్రాల్లోనూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని తెలుస్తున్నది. ఈ ఏడాది అక్టోబర్ మాసంలో, ఉష్ణ మండల, సమశీతోష్ణమండల ప్రాంతాల్లో సగటు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 25.68 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గత ఏడాది ఇదే అత్యధిక సముద్ర సగటు ఉష్ణోగ్రత కాగా, ఈఏడాది ఇప్పటికే ఆ రికార్డు సమమైంది. ఏడాది చివరి నాటికి సగటు ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డు స్థాయికి చేరే ప్రమాదం లేకపోలేదు.

## రైతుల డిమాండ్లు



కనీస మద్దతు ధర (ఎంఎస్ పి)కి చట్టబద్ధత కల్పించాలి. అప్పుల్లో కూరుకుపోయినం దున రుణమాఫీ అమలు చేయాలి. రైతులు, వ్యవసాయ కూలీలలకు పెన్షన్ పథకం అమలు చేయాలి. విద్యుత్ టారిఫ్‌ను పెంచే ప్రయత్నాలు మానుకోవాలి. 2021లో లఖింపూర్ ఖేరీ ఆందోళనలో మృతి చెందిన రైతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలి. (లఖింపూర్ ఖేరిలో ఆందోళన చేస్తున్న రైతులపైకి ఉద్దేశపూర్వకంగా వాహనాన్ని నడిపించాడని అప్పటి కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాపై ఆరోపణలు ఉన్నాయి. వాహనం ఢీకొనడం, తదనంతరం జరిగిన తొక్కిసలాటలో ఎనిమిది మంది మృతి చెందారు. ఆశిష్ మిశ్రా కేసుపై విచారణ సుప్రీం కోర్టులో కొనసాగుతున్నది). 2020–21 ఆందోళన సమయంలో మృతి చెందిన రైతుల కుంటుంబాలకు పరిహారం చెల్లించాలి.

## మోదీ (బిజెపి) హామీలు..అమలులో వైఫల్యాలు

దేశంలో రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామని 2014 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ప్రధాన మంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగిన నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. (ఇచ్చిన గడువు పూర్తయి రెండు సంవత్సరాలు గడిచినప్పటికీ ఇంత వరకూ ఈ హామీ పూర్తికాలేదు) కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టబద్ధత కల్పించేందుకు కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని, అతి త్వరలో సానుకూల నిర్ణ యం తీసుకుంటామని మోదీ సర్కారు లిఖితపూర్వక హామీ ఇచ్చింది. (ఎంఎస్‌పిపై ఏర్పాటైన కమిటీ ఏం చేస్తున్నదో ఎవరికీ తెలియదు. హామీ ఇచ్చి రెండేళ్లు గడిచినా ఎంఎస్‌పికి చట్టబద్ధతపై స్పష్టత లేదు. ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు). వ్యవసాయ బీమాను అమలు చేస్తామని బిజెపి ప్రకటించింది. (ఈ హామీ సక్రమంగా అమలవుతున్న దాఖలాలు లేవు). లఖింపూర్ ఖేరీ బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చింది. (మిగతా హామీల మాదిరిగానే ఇది దా అటకెక్కింది). రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తీరుస్తామని మోదీ సర్కారు పదేపదే చెప్తున్నది,. (ఇంత వరకూ రైతుల అభ్యున్నతికి ఏ ఒక్క చర్యనూ చేపట్టలేదు. పైగా, వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కావడం, తదుపరి తీర్పు వెలువడే వరకూ వాటిని అమలు చేయరాదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేయ డం కారణంగా రద్దు చేసిన మూడు వివాదాస్పద సాగు చట్టాలను ఇతరత్రా మార్గాల్లో అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. తమ డిమాండ్లు పరిష్కారమవుతాయని, ఇచ్చిన హామీలను కేంద్రం నెరవేరుస్తుందని రెండు సంవత్సరాలకుపైగా ఎదురుచూసిన రైతులు,మరోసారి ఆందోళన బాట పడుతున్నారు. ఈసారి హామీలతో తప్పించుకోవడం కేంద్రానికి సాధ్యం కాకపోవచ్చు. గాలికి కొట్టుకుపోయే హామీలను రైతులు ఎంతోకాలం నమ్మరన్న నిజాన్ని మోదీ సర్కారు త్వరగా గుర్తిస్తే అంత మంచిది).






## అమరుల ఆశయాలతో ముందుకువెళ్తాం

### సిపిఐ నాయకులు మల్లేష్, ప్రసాద్‌లకు ఘననివాళి

### వారి త్యాగాలు, పోరాటాలు వెలకట్టలేనివి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్** సిపిఐ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ బాలమల్లేష్, రాష్ట్ర కార్యవర్గ స భ్యులు పోటు ప్రసాద్‌ల అకాల మరణా లు సిపిఐ నాయకుల మనసులను కలిచి వేశాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గరువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాయలంలో బాలమల్లేష్, పోటుప్రసాద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన వివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ నమ్ముకున్న కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం కోసం, పేద ప్రజల అభ్యున్నతి కోసం వారు చేసిన త్యాగాలు, పోరాటాలు వెల కట్టలేనివన్నారు. వారి ఆశయాలతో ముందుకువెళ్తామన్నారు. వారిమరణం పార్టీకి తీరనిలోటని,వారి కుటుంబ సభ్యు లకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, మండల వెంకటేశ్వర్లు అనసూర్యమ్మ, ఇందిరాల వెంకటేశ్వర్లు, మామిడి వెంకయ్య పాల్గొన్నారు.

## బాలమల్లేష్ మృతి వ్య.కా.ఉద్యమానికి తీరని లోటు

### బికెయంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క బాలమల్లేష్ అకాల మరణం వ్యవసాయ కార్మిక ఉద్యమానికి, ఉపాధి హామీ కూలీల పోరాటాలకు తీరని లోటు అని బికెయంయు రాష్ట్రకార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. బుధ వారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బికెయంయు జిల్లా సమితి ఆధ్వర్యంలో బాల మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పి ంచారు. సృజన్ కుమార్ మాట్లాడుతూ ఎర్రజెండా పోరాటాలకు , సిద్దాం తాలకు ఆకర్షితులైన బాలమల్లేష్ విద్యార్థి సంఘంలో చేరి సమస్యల పరి ష్కారం కోసం, విద్యార్థి ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేసి రాష్ట్రస్థాయికి ఎదిగి అనేక సమరశీల ఉద్యమాలు నడిపారని గుర్తు చేశారు. పేదలకు ఇంటి స్థలాలను ప్రభుత్వం నుంచి ఇప్పించడంలో అగ్రభాగాన నిలిచార న్నారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. బాల మల్లేష్ ఆశయాలను ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సృజన్ కుమార్ పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో బికెయంయు జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి వెంకటస్వామి, దరిపల్లి అంకుస్, సహాయ కార్యదర్శి విలాసాగరం అంజయ్య, ఎగుర్ల మల్లేశం, తదితరులున్నారు.

# ప్రభుత్వ వైద్య వ్యవస్థను భ్రష్టుపట్టిస్తే సహించం

### వైద్యులు, సిబ్బంది గైర్హాజర్ సరికాదు

### నిర్వహణా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది

### ఆస్పత్రి ఆకస్మిక తనిఖీలో 'కూనంనేని ఆగ్రహం'



**ప్రజాపక్షం/భద్రాచలం/పాల్వంచ :** ప్రభుత్వ వైద్య వ్యవస్తను బ్రష్టు పట్టిస్తే సహించేదే లేదని, ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని, అవసరమైతే విచారణకు ఆదేశిస్తానని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు అ న్నారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరులో నిర్లక్ష్యం వహిస్తున్నారని, వైద్యం కోసం వచ్చిన రోగులను ఇతర ఆస్పత్రులు, ల్యాబ్‌లకు పంపిస్తూ ప్రభుత్వాస్పత్రిని రిఫరల్ ఆస్పత్రిగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల బం ధువుల నుండి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అనంతరం రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించిన ఆయన 39 మందివైద్యులకు గానూ కేవలం 12 మంది మాత్రమే హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు రిజి ష్టర్ నిర్వహణలో లోపాలు ఉండటంతో సూపరింటెండెంట్‌ను మందలించారు. ఆయన మీడియా మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య వ్యవస్త అస్తవ్యస్థంగా ఉందని, వైద్యులు, సిబ్బంది ఇష్టాను సారంగా వ్యవహ రిస్తున్నారని అన్నారు. పర్యవేక్షణ లోపంతో సిబ్బంది సమయ పాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.వైద్య సేవల్లో జరుగుతున్న నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంక్య తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో నిఘా విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, వైద్య పరికరాలు, మందులు, సిబ్బంది కొరతపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని అన్నారు. ప్రభుత్వ వైద్య వ్యవస్తను బ్రష్టు పట్టించే చర్యలు సహించబోమని, సిబ్బంది పనితీరుపై ఎలాంటి విచారణకైనా ఆదేశిస్తానని చెప్పారు. తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాపాలనలో ఆర్‌టిసి సేవలు భేష్

ప్రజాపాలన నిర్వహణలో ఆర్‌టిసి సేవలు భేష్ అని, ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత చేపట్టిన తొలిపథకం ఇదే కావడం, ఆ పథకానికి అపూర్వ స్పందన రావడానికి సిబ్బంది కృషి అమోఘమని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తగూడెం ఆర్‌టిసి డిపో ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యాతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 9న మహిళకు ఉచిత బస్ రవాణా సదు పాయాన్ని ప్రభుత్వం కల్పించిందని, ఈ పథకానికి స్పందన లభిస్తోం దన్నారు. ఈ పథకం అమల్లోనికి వచ్చిన తర్వాత ఆర్‌టిసి లాభాల బాటపట్టిందన్నారు.



### నూతన జిపి కార్యాలయంతో పాలనాసేవలు సులభతరం

నూతనంగా నిర్మిస్తున్న పంచాయితీ కార్యాలయాలతో పాలన సేవలు సులభతరం అవుతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.గురువారం మండల పరిధిలోని తవిశలగూడెం, పాయకారి యానం భైలులలో 40లక్షలతో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనాలను ఎమ్మెల్యే అధికారులు గ్రామ ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే లక్షంగా శ్రమి స్తున్నామన్నారు. ఇజిఎస్, డిఎమ్ఎఫ్టీ, ఎన్డిఎఫ్ తదితర నిధులతో గడిచిన పదకుండు నెలల కాలంలో కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్లు, డ్రైన్లు నిర్మించడం జరిగిందని, ప్రతిపాదనలు పంపిన అభివృద్ధి పనులను త్వరలో అనుమతులు లభిస్తాయని తెలిపారు. త్వరలో మంజూరు కానున్న ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకు అందించి గృహ వసతి కల్పిస్తామని తెలిపారు.

## 50వ స్ట్రక్చర్ సమావేశాల్లో కుదిరిన హామీల అంగీకారం

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :** ఇటీవల జరిగిన 50వ స్ట్రక్చర్ సమావేశాలలో ఎన్నికలలో ఇచ్చిన చాలా హామీలు, పలు అంశాలపై యాజమాన్యంతో అంగీకారం కుదిరిందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ఏరియాలోని ఆర్‌కె 7గనిలో ఎఐటియుసి ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. మైని ంగ్ స్టాఫ్, సూపర్వైజర్స్, ట్రేడ్స్ మెన్, ఇపి ఆపరేటర్లు మెడికల్ అన్ఫిట్ అయితే వారికి సూటబుల్ జాబ్ ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరగా అందుకు యాజమాన్యం అంగీకారం తెలిపిందని, ట్రేడ్స్ మెన్, ఇపి ఆపరేటర్ల విషయంపై సిఎండితో జరిగే సమావేశంలో చర్చిస్తామని యాజమాన్యం తెలిపి ందని, డిస్మిస్ అయిన జెఎంఇటి లను తిరిగి తీసుకోనున్నట్లు వివరించారు. మిగతా డిస్మిస్ ఉద్యో గుల విషయంలో కమిటీ వేసి పరిష్కరిస్తామని కంపెనీ హామీ ఇస్తామన్న విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ప్రైవేట్ వారితో నిర్వహిస్తున్న క్యాంటీన్లను కంపెనీ ఆధ్వర్యంలో నడుపుతూ క్వాలిటీ, క్వాంటిటీలను పెంచడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా క్యాంటీన్లలో సదుపాయం కల్పించేందుకు సంస్థ ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇపి ఆపరేటర్లకు డి నుండి సిసి నుండి బి గ్రేడ్ ఖాళీ లతో సంబంధం లేకుండా టైం బౌండ్ పదోన్నతులు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించి ందన్నారు. క్యాడర్ స్కీములను మూడు నెలల్లో పరిష్కరిస్తూ డిసెంబర్ నుంచి మార్చి వరకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలని ఎఐటియుసి డిమాండ్ చేయగా యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ, మోత్కూరి కొమురయ్య, వైస్ ప్రెసిడెంట్ కొట్టె కిషన్ రావు, ఫిట్ కా ర్యదర్శిలు సారయ్య, సదానందం, నర్సింగరావు, లక్ష్మ ణ్, మురళి చౌదరి, మైనింగ్ స్టాఫ్ నాయ కులు పారుపల్లి రాజేందర్, చంద్రశేఖర్, పిట్ నాయకులు సదానందం, యాదగిరి ,పవన్, బానేష్, తిరుపతి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు సగం వాటా ఇవ్వాల్సిందే

### బిసి హక్కుల సాధన సమితి

**ప్రజాపక్షం/వరంగల్‌ప్రతినిధి :** జనాభాలో బిసిలు సగం ఉన్నారని, అన్నింటిలోనూ బిసిలకు సగం వాటా ఇవ్వాలనదే బిసి హక్కుల సాధన సమితి నినాదమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. గురువారం వరంగల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యా లయంలో జరిగిన బిసి హక్కుల సాధన సమితి జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిసి కులగణన చేపట్టాలని, జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని, అలాగే బడ్జెట్లో కూడా బిసిల సంక్షేమానికి సగభాగం కేటాయించాలని, బిసి విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర వ్యాపితంగా బిసి గురుకుల పాఠశా లలకు, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు.వరంగల్ జిల్లా సిపిఐ సహాయకార్యదర్శి పనాస ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో సగానికి పైగా ఉన్న బిసిల మధ్య ఐక్యత ఏర్పడితే రాజ్యాధికారం సిద్ధిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా నిర్మాణ బాధ్యులు పంజాల రమేష్, చిట్యాల సువర్ణ, నాయకులు చింతకింది కుమారస్వామి, వలబోజి వెంకన్న, బుస రవీందర్, బొట్ల శ్రీనివాస్, మేడిగ అశోక్, ఇల్లందుల సాంబయ్య, ఆరే రాజు, తదితరులు పాల్గొన్నారు.




## కార్మికుల సంక్షేమం ఎఐటియుసితోనే సాధ్యం

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్



**ప్రజాపక్షం/పాల్వంచ :** కార్మిక చట్టాలు, హక్కులపై యూనియన్ ప్రతినిధులు అవగాహన పెంచుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్ అన్నారు. గురువారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరుగుతున్న బిల్డింగ్ కనస్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్, రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులలో రెండవ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం ఎఐటియుసితోనే సాధ్యమని, ఎర్రజెండా పోరాట ఫలితమే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టం ఏర్పడిందని తెలిపారు. సంక్షేమ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయించుకునే బాధ్యత ఎఐటియుసి నాయకత్వంపై ఉందనీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను లేబర్ కోడులను రద్దు చేయాలని చూస్తుందని విమర్శించారు. జాతీయ కనీస వేతనం చట్టం ప్రకారం అసంఘటిత కార్మికులందరికీ సామాజిక భద్రత ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్మిక వర్గం ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యాలకు, పారిశ్రామికవేత్తలకు తాకట్టు పెడుతోందని విమర్శించారు. ఈకార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి మార్గోవి ప్రవీణ్‌కుమార్, నాయకులు లక్ష్మి నారాయణ, వేల్పుల మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, జడిపాశం, కడారి రాములు, వెంకట స్వామి, సమ్మయ్య, లావణ్యా, అన్నారపు వెంకటేశ్వర్లు, గిరీ, ఇట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

## అదానీ అంశంపై నల్ల జాకెట్లు ధరించి ...

# ఇండియా కూటమి నిరసన



**న్యూఢిల్లీ :** అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ దర్యాప్తు జరపాలని మరోసారి ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఎంపిలు పార్లమెంట్‌లో ఆవరణలో గురువారం నిరసన ప్రదర్శన చేశారు. 'మోదీ, అదానీ ఏక హై', 'అదానీ సేఫ్ హై' అనే సిట్టిక్కర్లు అతికించిన నల్లరంగు జాకెట్లు ధరించి నినాదాలు చేశారు. ప్రియాంకాగాంధీ వాద్రా సహా కాంగ్రెస్ ఎంపిలు, ఆర్‌జెడి, వామపక్ష పార్టీలు, ఇతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. తెల్లరంగు టిషర్ట్ వేసుకుని నల్లరంగు జాకెట్ ధరించిన లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీకి వ్యతిరేకంగా ప్రధాని నరేంద్ర మోదీ దర్యాప్తు జరించరని, ఒక వేళ దర్యాప్తు జరిపితే ఆయనపైనే విచారణ చేసినట్లు అవుతుందని మోదీ భావిస్తున్నారన్నారు. యుఎస్ కోర్టులో అదానిపై నమోదైన ముడుపులు, మోసం వంటి అభియోగాలపై పార్లమెంట్‌లో కచ్చితంగా చర్చ జరపాలని రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేశారు. ఈ అంశంపై సభలో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడాలన్నారు. పార్లమెంట్ మకర ద్వారం వైపునకు వెళ్లే మెట్లపై ప్రతిపక్ష పార్టీల ఎంపిలు నిరసన తెలిపారు. అయితే పార్లమెంట్‌కు వచ్చే వారికి ఇబ్బంది కలిగేలా వ్యవహరించకూడదని రెండు రోజుల క్రితం స్పీకర్ ఓమ్‌బిర్లా సభ్యులను హెచ్చరించిన విషయం తెలిసిందే. మంగళవారం, బుధవారం కూడా పార్లమెంట్ మకర ద్వారం వద్ద నిరసన తెలియజేసిన విషయం విదితమే. మెట్లపై కొద్ది సమయంపాటు నిరసన తెలిపిన ప్రతిపక్ష ఎంపిలు సంవిధాన్ సదన్ ముందు వరుసగా నిలబడి మోదీ, అదానీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన ప్రదర్శనకు మొదటి నుంచి టిఎంసి దూరంగా ఉంటుంది.

**లోక్‌సభలో వాయిదాల పర్వం...**

లోక్‌సభలో గురువారం పలుమార్లు వాయిదాల పర్వం కొనసాగింది. యుఎస్‌కు చెందిన మల్టీ బిలియనీర్‌తో తనకున్న సంబంధాలు ఏమిటి అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని లక్ష్యంగా చేసుకుని బిజెపి సభ్యుడు నిషికాంత్ దుబే వ్యాఖ్యానించడంతో సభలో దుమారం రేగింది. దీంతో సభను స్పీకర్ మరుసటి రోజుకు వాయిదా వేశారు. అంతకు ముందు రెండుసార్లు వాయిదా పడిన సభ మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశమై ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య రైల్వేల (సవరణ) బిల్లు 2024ను ఆమోదించింది. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ ప్రతిపక్ష సభ్యులను శాంతిపరిచేందుకు ప్రయత్నించి బిల్లుపై సమాధానం ఇవ్వాల్సిందిగా రైల్వే శాఖమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. అయితే ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళను ఉధృతం చేశారు. వారి తమ ఆందోళను తీవ్రంగా కొనసాగించడంతో పాల్ సభను వాయిదా వేశారు. అంతకు ముందు మధ్యాహ్నం జరిగిన జీరో అవర్‌లో బిలియనీర్ ఇన్వెస్టర్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపించిన ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) పరిశోధనల ఆధారంగా ఒక నివేదిక ప్రచురితమైన నేపథ్యంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు పార్లమెంటు కార్యకలాపాలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించాయని దుబే పేర్కొన్నారు. దుబే వ్యాఖ్యలను ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా ఖండించారు. దీంతో సభ అట్టుడికింది. ఈ ఆందోళన మధ్యే స్పీకర్ ఓమ్‌బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైన తరువాత కూడా ఇలాంటి ఘటనలో చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి కిరణ్ రిజిజు కల్పించుకుని మాట్లాడుతూ ప్రతిపక్షాల వైఖరి ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రతిపక్షాలు రంగురంగుల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు వచ్చారని, పార్లమెంట్ వెలుపల ఫ్యాషన్ షో నిర్వహించారని ఎద్దేవా చేశారు. ఈ చర్య పార్లమెంట్ గౌరవాన్ని దిగజారుస్తుందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సభకు అంతరాయం కలిగించి సాధించేదేమీలేదన్నారు. దీని వల్ల ఓట్లు రావని వ్యాఖ్యానించారు. ఈ తరుణంలో ప్రతిపక్ష ఎంపిలు తమ ఆందోళను ఇంకా తీవ్ర తరం చేశారు. దీంతో సభను పాల్ మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు.

## అదానీకి ఆరు విమానాశ్రయాలు లీజుకిచ్చాం : కేంద్రం





**న్యూఢిల్లీ :** అదానీ గ్రూప్‌కు ఆరు విమానాశ్రయాలను లీజుకు ఇచ్చినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. పారదర్శక, పోటీ విధానం ద్వారానే వాటిని కట్టబెట్టినట్లు తెలిపారు. లక్నో, అహ్మదాబాద్, మంగళూరు, జైపూర్, గువహతి, తిరువనంతపురంలో ఉన్న ప్రభుత్వ ఆధీనంలోని ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ)లను అదానీ సంస్థకు లీజుకు ఇచ్చారు. ఒకే సంస్థకు రెండు విమనాశ్రయాలు ఇవ్వవద్దని నీతి ఆయోగ్, ఆర్థిక వ్యవహారాల విభాగం (డిఇఎ) అభిప్రాయంతో ఉన్నట్లు తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సౌగతారాయ్ గురువారం లోక్‌సభలో అన్నారు. దీనికి మంత్రి రామ్మోహన్‌నాయుడు స్పందిస్తూ ఆయన వ్యాఖ్యలు వాస్తవం కాదని చెప్పారు. విమానాశ్రాలను లీజుకు ఇచ్చేందుకు లోతుగా పరిశీలించే విధానానిన అవలంభించినట్ల తెలిపారు. ఆరు విమానాశ్రయాల ప్రస్తుత విలువ సుమారు రూ.5,260 కోట్లు అని, పిపిపి కింద వాటిని అప్పగించినట్లు లిఖిత పూర్వక సమాధానంలో రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. అవసరమైన పని తీరు ప్రమాణాలన నిర్వణ కోసం పెట్టే పెట్టుబడి వ్యయాన్ని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియానే భరిస్తుందని, ఆ మొత్తం పిపిపి భాగస్వామి నుంచి అప్‌ఫ్రంట్ పేమెంట్ రూపంలో వస్తుందని తెలిపారు. ఆయా విమానాశ్రయాలలో అసిస్టెంట్ జనరల మేనేజర్ లేదా అంత కంటే తక్కువ స్థాయి ఉద్యోగులకు ఒక ఏడాది అదే విమానాశ్రయంలో కొనసాగిస్తారని, మరో రెండేళ్ళు డిప్యూటేషన్ పేరుతో కొనసాగించేలా కన్సెషన్ ఒప్పందం ఉన్నదన్నారు. ఈ మూడేళ్లలో కనీసం 60 శాతం ఉద్యోగులకు ప్రస్తుత ఉద్యోగకర్త ఎఎఐ నిబంధనలు, షరతులే వర్తిస్తాయని పేర్కొనానరు. ఈ ఒప్పందాని ఉద్యోగాలు అంగీకరించవచ్చని లేదా తిరస్కరించవచ్చని, ఒప్పందాన్ని అంగీకరించిన వారు ఎఎఐకి రాజీనామా చేసి కొత్త భాగస్వామి సంస్థ కింద చేరవచ్చన్నారు. తిరస్కరించిన ఉద్యోగులు మూడేళ్ళు ఒకే ఎయిర్‌పోర్ట్‌లో పని చేస్తారని, అప్పటి వరకు ఎఎఐ ఉద్యోగులుగానే ఉంటారని, తరువాత ఎఎఐ నుంచి విడిపోయినప్పుడు కొత్త యాజమాన్యమే ఉద్యోగుల వ్యయాన్ని భరిస్తుందని వివరించారు.

## హేమంత్ సోరెన్ కేబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకారం

### జెంఎంఎం నుంచి ఆరుగురికి, కాంగ్రెస్ నుంచి నలుగురికి, ఆర్‌జెడి నుంచి ఒకరికి చోటు




**రాంచి :** వారం రోజుల క్రితం జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన జెఎంఎం నేత హేమంత్ సోరేన్ తాజాగా మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. ఇందులో భాగంగా 11 మందికి చోటు కల్పించారు. వారంతా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అందులో ఆరుగురు జెంఎంఎం పార్టీకి చెందిన వారు ఉండగా, నలుగురు కాంగ్రెస్ సభ్యులు, ఒకరు ఆర్‌జెడి సభ్యుడు ఉన్నారు. వీరితో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ రాజ్‌భవన్‌లోని అశోక్ ఉద్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయించారు. జెంఎంఎం ఎమ్మెల్యేలు సుదివ్యకమార్, దీపక్ బిరువా, రాందాస్ సోరెన్, చంద్రా లిండా యేగేంద్ర ప్రసాద్, హాఫీజుల్ హసన్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దీపక్ పాండే సింగ్, శిల్పి నేహా టిర్కే, ఇర్ఫాన్ అన్సారీ, రాధాకృష్ణ కిషోర్‌లు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్‌గా జెంఎంఎం ఎమ్మెల్యే స్టీఫెన్ మరాండీ ప్రమాణం చేశారు. కాగా, ఇటీవలే జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 81 నియోజకవర్గాలకు గానూ జెఎంఎం కూటమికి 56 స్థానాలు, ఎన్‌డిఎ కూటమికి 24 స్థానాలు లభించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా జెఎంఎం చీఫ్ హేమంత్ సోరేన్ గత నెల 28న ప్రమాణ స్వీకారం చేశారు.

## సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా

# మన్మోహన్‌సింగ్ ప్రమాణం



**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ చేత సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా గురువారం నాడు భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ప్రమాణం చేయించారు. దీంతో సుప్రీం కోర్టులో మంజూరైన 34 న్యాయమూర్తుల స్థానాలలో న్యాయమూర్తుల సంఖ్య 33కు పెరిగింది. జస్టిస్ మన్మోహన్ (61) ప్రమాణస్వీకారం సుప్రీం కోర్టులో జరిగింది. ఆయన పేరును నవంబర్ 28న సుప్రీం కోర్టు కొల్లీజియం సిఫార్సు చేసింది. డిసెంబర్ 3న ఆయన సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

## షిండే శకం ముగిసింది..

### ఆయన మళ్లీ సిఎం కాలేరు : సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు



**ముంబయి :** మహారాష్ట్రలో గత పది రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్ పేరు ఖరారైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని బిజెపి బుధవారం అధికారికంగా ప్రకటించింది. డిప్యూటీ సిఎంలుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లు ఎన్నికయ్యారు. వారు గురువారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇక షిండే శకం ముగిసింది' అని వ్యాఖ్యానించారు. ఏక్‌నాథ్ షిండే బిజెపి ఇన్ని రోజులూ ఉపయోగించుకుందని.. ఇప్పుడు మాత్రం పక్కకు నెట్టేసిందని వ్యాఖ్యానించారు. 'షిండేని బిజెపి పావులా వాడుకుంది. ఇప్పుడు పక్కకు నెట్టేసింది. ఇక షిండే శకం ముగిసింది. ఆయన మళ్లీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాలేరు. ఆయన అవసరం కూడా బిజెపికి లేదు. అవసరమైతే షిండే పార్టీని కూడా బిజెపి విచ్ఛిన్నం చేయగలదు. ఇది ప్రధాని మోదీ రాజకీయ పంథా' అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. మహాయుతికి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ.. 15 రోజులైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారని రౌత్ అన్నారు. అంటే వారి కూటమిలో ఏదో లోపం ఉందని అర్థమవుతోందన్నారు. అది ఇవాళ కాకపోయినా తర్వాతైనా బయటకి వస్తుందని చెప్పుకొచ్చారు.

## సంభల్ హింసలో నిందితుల ఫోటోలను

# గోడలపై ప్రదర్శిస్తాం

- జిల్లా కలెక్టర్ రాజేందర్ పెన్సియా వెల్లడి
- ఇప్పటివరకు 400మంది నిందితుల ఫోటోలు సేకరించామని ప్రకటన
- బాబ్రీ మసీదు కూల్చివేతకు ముందు రోజైన డిసెంబరు 5న సంభల్‌లో భారీగా పోలీసు భద్రత



**సంభల్ :** ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని సంభల్ జిల్లాలో పోలీస్ భద్రతను మరింతగా పెంచడం ఆ ప్రాంత పరిస్థితిని చెప్పకనే చెబుతోంది. 1992లో హిందువులు అయోధ్యలోని బాబ్రీ మసీదును కూల్చివేసిన డిసెంబరు 6వ తేదీకి ముందురోజైన గురువారంను పరిగణనలోనికి తీసుకున్న సంభల్ అధికార యంత్రాంగం ముందస్తుచర్యలో భాగంగా భద్రతా బలగాలను మోహరింపజేయాలని నిర్ణయించింది. అదే సమయంలో సంభల్‌లో హింసాకాండకు కారకులైన వారి పోస్టర్లు వేయాలని నిర్ణయించింది. సంభల్‌లో అగ్నిప్రమాదం, విధ్వంసం వల్ల జరిగిన నష్టం రూ. ఒక కోటి కంటే ఎక్కువగానే ఉన్నదని పోలీసులు అంచనా వేశారు. సంభల్ హింసలో భాగస్వాములైన వారి పోస్టర్లను వేసి వారిగురించి అధికస్థాయిలో ప్రచారం చేయాలని అనుకుంటున్నాం' అని సంభల్ జిల్లా మేజిస్ట్రేట్ రాజేందర్ పెన్సియా 'పిటిఐకి' చెప్పారు. 'గత నెలలో షాహీ జమా మసీదు సర్వే సందర్భంగా సంభల్ జిల్లాలో చెలరేగిన హింసాకాండతో సంబంధం ఉన్నటువంటి 400మందికి పైగా వ్యక్తులను అధికారులు గుర్తించడం జరిగింది అని డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ చెప్పారు. శాంతి సంఘం సమావేశం 3గంటల సమయంలో జరుగనుందని, పరిస్థితికి సంబంధించిన అన్ని వివరాల గురించి చర్చిస్తామని తెలియజేశారు. ప్రసుత్తం మేము హింసకు బాధ్యులైన వారి పోస్టర్‌ను డిజైన్ చేస్తున్నాం. అది ఈ రోజుకు పూర్తి అవుతుంది. 400మందిని హింసకు పాల్పడిన వారిగా గుర్తించాం. ఇప్పటికే అరెస్ట్‌చేసిన వారిని మినహాయించి మిగతా వారి పోస్టర్లు వేస్తాం 'అని రాజేందర్ పెన్సియా తెలియజేశారు. మిగిలిన నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కృష్ణకుమార్ బిష్ణోయ్ చెప్పారు. మిగతా నిందితులను పట్టుకునే ప్రయత్నంలోనే ఉన్నామని చెప్పారు. సంభల్ హింసాకాండకు కారకులైన వారిలో 34మందిని ఇప్పటి వరకు అరెస్ట్ చేయగా, ఇంకా 83మంది వ్యక్తులు దొరకాల్సి ఉందని, 400మంది వ్యక్తుల ఫోటోగ్రాఫ్‌లను సేకరించామని, ప్రత్యేక గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నదని ఎస్‌పి కృష్ణకుమార్ బిష్ణోయ్ తెలియజేశారు. డ్యామేజీ రూ.1 కోటికి మించి ఉంటుందని, దీనిలో ట్రాన్స్‌ఫార్మర్లను తగులబెట్టడం, కెమెరాలను ధ్వంస ం చేయడం, వాహనాలకు నిప్పుపెట్టడం లాంటివి ఉన్నాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వారిని ఒకసారి గుర్తించడమే తర్వాయని, వెంటనే వారిపై ఛార్జిషీట్లు నమోదు చేస్తామని ఎస్‌పి తెలిపారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నవంబరు 27 సంఘటన గురించి మాట్లాడుతూ సంభల్ హింసలో పాల్గొని ప్రజల ఆస్తులకు నష్టం కలిగించినవారి ఫోటోలను ముద్రించి పబ్లిక్ వాల్స్‌పై ప్రదర్శిస్తామని చెప్పింది. అయితే ఈ హింసకు సంబంధించిన పాల్గొన్నవ్యక్తులకు సంబంధించిన పలువురి ఫోటోలను ఇప్పటికే విడుదల చేశామని సంభల్ పోలీసులు చెప్పారు.ఈ ఫోటోలలో ఉన్న 9మందిని ఇప్పటికే గుర్తించామని, అయితే మాస్కులు ధరించిన మిగతా వ్యక్తులను కనుగొనుగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. వారి అరెస్ట్‌చేసేందుకు సహకరించినట్లయితే వారికి రివార్డును ప్రకటిస్తామని ఒక అధికార ప్రతినిధి ఒకరు ఇంతకుముందు చెప్పారు.

## ఇద్దరు మాజీ సర్పంచ్‌లను హత్యచేసిన నక్సలైట్లు



**బీజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మాజీ సర్పంచ్‌లను నక్సలైట్లు హతమార్చినట్లు పోలీసులు గురువారం తెలిపారు. నక్సలైట్లు తమ కరపత్రాలలో మాజీ సర్పంచ్ సుక్లు పర్సా బిజెపి కార్యకర్త అని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ సుఖ్‌రామ్ అవ్లామ్ పోలీసు క్యాంపు ఏర్పాటులో పోలీసులకు సహాయం చేశారని ఆరోపించారు. పర్సాను బుధవారం భైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య చేయగా, అవ్లామ్ అదే రోజు నైమెడ్ ప్రాంతంలో హత్యకు గురయ్యాడని ఇక్కడి అధికారి తెలిపారు. ఈ ఘటనలతో, బీజాపూర్‌తో సహా రాష్ట్రంలోని బస్తర్ డివిజన్‌లో ఈ సంవత్సరం ఇప్పటివరకు నక్సలైట్లు కనీసం 55 మందిని చంపినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, నక్సలైట్లు సోమవారం బిరియా భూమి గ్రామం నుండి పర్సాను అపహరించి, బుధవారం హత్య చేసినట్లు అధికారి తెలిపారు. బుధవారం రాత్రి నక్సలైట్లు మృతదేహాన్ని గ్రామ సమీపంలో పడేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఘటనా స్థలంలో లభించిన కరపత్రంలో, భైరామ్‌గఢ్ ఏరియా మావోయిస్టుల కమిటీ పర్సా హత్యకు బాధ్యత వహించిందని , అతను అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి) కార్యకర్తగా ఉన్నాడని పేర్కొన్నట్లు అధికారి తెలిపారు. బుధవారం రాత్రి నైమెడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాదర్, కైకా గ్రామాలను కలిపే రహదారిపై సుఖ్‌రామ్ అవ్లాం మృతదేహం లభ్యమైందని అధికారి తెలిపారు. అవ్లామ్‌ను నక్సలైట్లు కిడ్నాప్ చేసి చంపినట్లు పోలీసులకు గురువారం ఉదయం సమాచారం అందడంతో భద్రతా సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారని ఆయన చెప్పారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, బీజాపూర్ పట్టణంలో నివసించే అవ్లామ్ వ్యవసాయ సంబంధిత పనుల కోసం తన గ్రామమైన కడేర్‌కు వెళ్లాడు. బుధవారం సాయంత్రం అతను వ్యక్తిగత పని కోసం ఖాదర్ నుండి కైకాకు వెళుతుండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని అడ్డగించి అడవిలోకి తీసుకెళ్లారని అధికారి తెలిపారు. రాత్రి రోడ్డుపై మృతదేహం కనిపించిందని తెలిపారు. నక్సలైట్ల గంగలూర్ ఏరియా కమిటీ శిబిరం ఏర్పాటు చేయడంలో పోలీసులకు అవ్లామ్‌కు మద్దతిస్తోందని ఆరోపించిన కరపత్రం ఘటనా స్థలంలో లభించిందని అధికారి తెలిపారు. దుండగుల కోసం రెండు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ముడా కేసులో...కర్నాటక ప్రభుత్వం నోటీసులు

### సింగిల్ జడ్జిబెంచ్ తీర్పును సవాల్ చేస్తూ సిఎం సిద్ధరామయ్య అప్పీల్‌పై హైకోర్టు ఆదేశం

### 2025 జనవరి 25నాటికి విచారణ వాయిదా



**బెంగళూరు :** కర్నాటకలో మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) స్థల కేటాయింపుల కేసు రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ముడా స్థల కేటాయింపుల కుంభకోణంలో తనపై దర్యాప్తునకు అనుమతించిన గవర్నర్ నిర్ణయాన్ని సమర్థిస్తూ సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దాఖలు చేసిన అప్పీల్‌పై గురువారం కర్ణాటక హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వం సహా ఇతర ప్రతివాదులకూ నోటీసులు జారీ చేసింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్‌వి.అన్వరియా, జస్టిస్ కెవి.అరవింద్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 25 నాటికి వాయిదా వేసింది. తనకు ఎదురు దెబ్బ తగిలిన హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ అక్టోబరు 24న హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ముందు సిద్ధరామయ్య అప్పీల్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన సతీమణి పార్వతి బిఎం కు మైసూరు నగరాభివృద్ధి సంస్థ 14స్థలాల కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో తనపై విచారణకు థావర్ చంద్ గెహ్లాట్ ఆమోదించడాన్ని సవాల్‌చేస్తూ సిఎం సిద్ధరామయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను సెప్టెంబరు 24న జస్టిస్ నాగప్రసన్న ఏకసభ్య ధర్మాసనం తోసిపుచ్చిన విషయం తెలిసిందే. టిజె అబ్రహాం, ప్రదీప్‌కుమార్, స్నేహమయి కృష్ణ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై దాఖలు చేసిన మూడు పిటిషన్ల ఆధారంగా ఒక ప్రధాన ప్రాంతంలో ముడా ద్వారా 14సైట్ల కేటాయింపుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. తనపై విచారణకు గెహ్లాట్ ఆమోదం యొక్క చట్టబద్ధతను సిఎం సిద్ధరామయ్య సవాల్‌చేశారు. హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ ఆదేశాలను అనుసరించి మరుసటిరోజే ఇక్కడి ప్రత్యేక న్యాయస్థానం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసుల విచారణకు ఆదేశించింది.డిసెంబరు 2లోగా దర్యాప్తు నివేదికను సమర్పించాలని సూచించింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి బిఎం, బావమరిది మల్లికార్జునస్వామి, దేవరాజ్, స్వామి వారి నుంచి భూమిని కొనుగోలు చేసి పార్వతికి కానుకగా ఇచ్చారని, మరికొంతమంది పేర్లను మైసూరులోని లోకాయుక్త పోలీసులు సెప్టెంబరు 27న నమోదు చేసి ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. సెప్టెంబరు 30న, లోకాయుక్త ఎఫ్ఐఆర్ నమోదును పరిగణనలోనికి తీసుకుని, సిఎంతో సహా ఇతరులపై కేసు బుక్ చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఇసిఐఆర్)ను దాఖలు చేసింది. అంతేకాకుండా కేసును విచారిస్తోంది. ముడా పార్వతికి 3.16ఎకరాల భూమికి బదులుగా 50: 50 రేషియో స్కీమ్ కింద ప్లాట్లను కేటాయించింది. కేటాయించిన ప్లాట్లను ముడా రెసిడెన్షియల్ లేఓట్‌గా అభివృద్ధి చేసింది.వివాదాస్పద పథకం కింద అభివృద్ధి చెందని భూమికి బదులుగా భూమిని కోల్పోయేవారికి నివాస లేఔట్‌ల ఏర్పాటు కోసం ముడా 50శాతం అబివృద్ధి చెందిన భూమిని కేటాయించడం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆరోపణలకు తెరలేపినట్లైంది. మైసూరు శివార్లలోని కసరే గ్రామంలోని 464సర్వే నెంబర్‌లో ఉన్న ఈ 3.16ఎకరాల భూమిపై ముఖ్యమంత్రి భార్య పార్వతి బిఎం పై చట్టబద్ధమైన హక్కులేదని ఆరోపించబడింది. అయితే సైట్ల కేటాయింపు వివాదాలకు దారితీయడంతో పార్వతి తనకు ముడా కేటాయించిన 14సైట్లను రద్దు చేయాలని మైసూరు నగరాభివృద్ధి సంస్థను కోరగా ముడా ఆమె అభ్యర్థనను అంగీకరించిన విషయం విదితమే.

## లేటరల్ ఎంట్రీ ద్వారా

# 63 మంది నియామకం : కేంద్రం



**న్యూఢిల్లీ :** వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలలో లేటరల్ ఎంట్రీ ద్వారా 63 మంది స్పెషలిస్టులను 2019 నుంచి 2023 మధ్య కాలంలో నియమితులైనట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఇందులో 35 మంది కాంట్రాక్ట్ విధానంలో, మిగతా 28 మంది డిప్యూటేషన్ విధానంలో తీసుకున్నట్లు గురువారం రాజ్యసభకు వెల్లడించారు. 2018 నుంచి ప్రత్యేక పనుల కోసం విశిష్ఠ విజ్ఞానం, నిపుణత కలిగిన వారిని లేటరల్ ఎంట్రీ విధానంలో జాయింట్ సెక్రెటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ స్థాయిలో తీసుకుంటున్నట్లు తెలిపారు. 2019లో ఎనిమిది మంది జాయింట్ సెక్రెటరీ స్థాయిలో నియమించగా, వారిలో ఐదుగురు కాంట్రాక్ట్, ముగ్గురు డిప్యూటీషన్ పద్ధతిలో చేరారని అన్నారు. 2021లో లేటరల్ ఎంట్రీ విధానంలో ముగ్గురిని జాయింట్ సెక్రెటరీలుగా, 18 మందిని డైరెక్టర్‌లుగా, తొమ్మిది మందిని డిప్యూటీ సెక్రెటరీలుగా నియమించినట్లు, వారిలో 14 మంది కాంట్రాక్ట్, 16 మందిని డిప్యూటేషన్ ద్వారా తీసుకున్నట్లు తెలిపారు. 2023లో 25 మందిని ఈ విధానంలో తీసుకున్నామన్నారు.

**ఖాళీల వివరాలు శాఖల వద్దే ఉంటాయి**

ఖాళీలు ఏర్పడడం, వాటిని భర్తీ చేయడమనేది నిరంతర ప్రక్రియ అని, ఖాళీల వివరాలు ఆయా మంత్రిత్వ శాఖలు లేదా విభాగాల వద్ద ఉంటాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తమ వద్ద ఏర్పడిన ఖాళీలను నిర్ణీత గడువులోగా ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని మంత్రిత్వ శాఖలు లేదా విభాగాలను కేంద్రం ఆదేశించినట్లు కేంద్ర ఉద్యోగ, సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ రాజ్యసభకు ఇచ్చిన లిఖిత సమాధానంలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ఖాళీలపై అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా జవాబిచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగుల వివరాల గురించి అడిగిన మరో ప్రశ్నకు జవాబిస్తూ ఆ వివరాల కూడా ఆయా మంత్రిత్వ శాఖలు లేదా విభాగాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, యుపిఎస్‌సి, ఎస్ఎస్‌సి, ఆర్ఆర్‌బి , ఐబిపిఎస్ వంటి సంబంధిత నియామక ఏజెన్సీల వద్ద ఉంటాయన్నారు. కాంట్రాకు ఉద్యోగాలను జనరల్ ఫైనాన్షియల్ రూల్స్, 2017 నిబంధనల మేరకే తీసుకుంటారన్నారు.

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శుక్రవారం, డిసెంబరు 06

## బిజెపి ఖాతాలోకి మహారాష్ట్ర

మహారాష్ట్ర ఓటర్లు మహాయుతి కూటమికి సంపూర్ణ మెజారిటీ ఇచ్చినా ప్రభుత్వం ఏర్పాటుకు 12 రోజులు సమయం అవసరమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రచారానికి సారథ్యం వహించిన ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండె నుంచి ఆ పదవిని – అనగా మహారాష్ట్ర ప్రభుత్వ సారథ్య బాధ్యతను బిజెపి చేబట్టేటట్లు షిండేను ఒప్పించేందుకు ఈ వ్యవధి తప్పని సరి అవసరమైంది. ఎట్టకేలకు గురువారం సాయంత్రం బిజెపినేత దేవేంద్ర సరిత గంగాధర్ ఫడ్నవీస్(55 సం.) ముఖ్యమంత్రిగా, ఏక్‌నాథ్ షిండే (శివసేన), అజిత్ పవార్(ఎన్‌సిపి) ఉపముఖ్యమంత్రులుగా మంత్రివర్గంపదవీ ప్రమాణం స్వీకరించింది. బిజెపి శాసనసభాపక్ష నాయకుని ఎన్నిక, మహాయుతి కూటమి నాయకుని ఎన్నిక జరగకమునుపే బిజెపి అధిష్టానం మంత్రివర్గ ప్రమాణస్వీకార తేదీని నిర్ణయించటం విశేషం. వివిధ వాదనలు, పదవుల డిమాండ్లు చేస్తున్న షిండేపై ఒత్తిడి పెంచే ఎత్తుగడగా దీన్ని చూడవచ్చు. మరో భాగస్వామ్య పక్షం ఎన్‌సిపి(అజిత్ పవార్) ముందే ముఖ్యమంత్రిపదవి బిజెపి చేబట్టేందుకు అంగీకరించింది. 288 స్థానాలుగల అసెంబ్లీలో బిజెపి 132 సీట్లు, శివసేన(షిండే) 57, ఎన్‌సిపి(అజిత్ పవార్) 41గెలుపొందాయి. కూటమిలో అతిపెద్ద పార్టీగా, ఏకపక్ష మెజారిటీకి 13సీట్ల దూరంలో ఉన్న బిజెపి ముఖ్యమంత్రి పదవి కోరుకోవటం సహజం. అయితే సంకీర్ణ రాజకీయాల్లో అలా అని నియమం ఏదీలేదు. 2014లో దేవేంద్ర ఫడ్నవీస్ తొలిసారి ముఖ్యమంత్రిత్వం చేబట్టారు. ఆయన పిన్నవయస్కుడేగాక మహారాష్ట్రకు మొట్టమొదటి బిజెపి ముఖ్యమంత్రి. నాడు అవిభాజ్య శివసేన–బిజెపి సంకీర్ణ భాగస్వాములు. బిజెపికి 122, శివసేనకు 63 సీట్లు లభించాయి. 2019లో అదే కూటమికి తిరిగి మెజారిటీ లభించింది. (బిజెపి 105, శివసేన 56) అయితే బిజెపి కేంద్రనాయకత్వం మౌఖికంగా ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి పదవి తమకు ఇవ్వాలని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే పట్టుబట్టాడు. అందుకు బిజెపి నిరాకరించింది. గవర్నర్‌ని అడ్డం పెట్టుకుని అప్పుడు నడిపిన డ్రామాలో ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా, అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రిగా ఉదయాన్నే రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయటం, శరద్ పవార్ కుటుంబం ఒత్తిడితో అజిత్ పవార్ వెనక్కు వెళ్లిపోవటం, 80గంటల్లోనే ఆ ప్రభుత్వ రాజీనామా, రాష్ట్రపతి పాలన విధింపు వంటి ఘటనలు చకచకా జరిగిపోయాయి. అప్పుడు కాంగ్రెస్, ఎన్‌సిపి, శివసేన అనూహ్య సంగమం (మహా వికాస్ అగాధి) ఏర్పడింది. ఆ కూటమి ప్రభుత్వానికి ఉద్ధవ్ థాక్రే ముఖ్యమంత్రి అయినారు. రెండున్నర సంవత్సరాల తదుపరి బిజెపి ప్రోద్బలంతో ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో శివసేన చీలిపోయింది. మెజారిటీ ఎమ్మెల్యేలు షిండే వెంట రావటంతో 2022 జూన్ 22న అగాధి ప్రభుత్వం పతనమైంది, కొత్త సంకీర్ణం కొలువుతీరింది. ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కావాలనుకున్నా, పార్టీ అధినాయకత్వం వ్యూహాత్మకంగా షిండేని ముఖ్యమంత్రిని చేసి, అంతకు రెట్టింపుకు పైగా సీట్లున్నప్పటికీ ఫడ్నవీస్‌ని ఉపముఖ్యమంత్రిగా నియమించింది. అటుతర్వాత కొద్దిమాసాలకు అజిత్ పవార్ ఎన్‌సిపిని చీల్చి మహాయుతి కూటమిలో చేరి మరో ఉపముఖ్యమంత్రి అయినారు. మెజారిటీ సీట్లున్న పార్టీకే ముఖ్యమంత్రి పదవి దక్కాలన్న నియమం లేదన్న షిండే వాదనకు అదే ప్రాతిపదిక. తన పాలన, పథకాల వల్లనే మహాయుతికి ప్రజలు మెజారిటీ సీట్లు ఇచ్చారన్నది ఆయన వాదన. చివరికి ప్రధాని నిర్ణయమే శిరోధార్యమన్నారు.

ఏమైతేనేం, మహారాష్ట్రపై తమ కాషాయ జెండా ఎగరాలనుకున్న బిజెపి నిరీక్షణ తిరుగులేనిరీతిలో ఫలించింది. శివసేన వ్యవస్థాపకుడు, హిందూత్వవాది బాల్‌థాక్రే జీవించి ఉన్నంతకాలం బిజెపి జూనియర్ భాగస్వామి. రెండు పార్టీలకు సిద్ధాంతమమేకత ఉంది. కాకపోతే బాల్‌థాక్రే స్థానికతవాదం, దక్షిణాది వ్యతిరేకత ఆయన్ను పైచేయిగా నిలబెట్టింది. శరద్‌పవార్ సోనియా గాంధీకి కాంగ్రెస్ అధ్యక్ష పదవి కట్టబెట్టటాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ నుంచి బయటకువచ్చి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి)పేరుతో సొంత పార్టీ పెట్టుకోవటంతో మహారాష్ట్రలో కాంగ్రెస్ క్షీణింపు మొదలైంది. కాంగ్రెస్ లౌకికవాదానికి, శివసేన హిందూత్వకు పొంతనలేకపోయినా బిజెపిని అధికారానికి దూరంగా ఉంచేందుకు శరద్‌పవార్ మధ్యవర్తిత్వంతో అవకాశవాదాన్ని ఆశ్రయించి ఒక్కటై మహావికాస్ అగాధి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. రెండున్నర ఏళ్లకు అది కూలిపోగా, మొన్నటి ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారు.

హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయాలతో పార్టీపై, ప్రభుత్వంపై ప్రధాని నరేంద్రమోదీ పట్టు బిగిసింది. లోక్‌సభ ఎన్నికల్లో పరాజయాల తర్వాత మోదీని అదుపులో పెట్టేందుకు ప్రయత్నించిన ఆర్‌ఎస్‌ఎస్ సణుగుళ్లు సద్దుమణిగాయి. మోదీ కోరుకున్నట్లే ఆయన 'పరమ మిత్రుడు' ఫడ్నవీస్‌కు ముఖ్యమంత్రి పీఠం దక్కింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిసా ముఖ్యమంత్రులను కూడా మోదీయే ఎంపిక చేశారు. వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరిగే బిహార్‌లో ముఖ్యమంత్రిని కూడా మోదీయే నిర్ణయించినా ఆశ్చర్యం లేదు!!

# రేవంత్ రెడ్డి పాసా? ఫెయిలా? తెలంగాణ ఏమంటున్నది!



ఎస్‌కె. జకీర్
9052631212
సీనియర్ జర్నలిస్ట్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాసయ్యారా? లేక్ ఫెయిలయ్యారా ? అనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినందున ఈ చర్చ సహజమే. అయితే ఒక ముఖ్యమంత్రి పనితీరు లేదా ప్రభుత్వ పనితీరును కేవలం ఒక్క ఏడాదికాలంలోనే ఎలా అంచనా వేయగలం! ఎలాంటి నిర్ధారణకు రాగలం! పాస్ లేదా ఫెయిలు మార్కులు ఎలా వేయగలం? దానికున్న ప్రామాణికత ఏమిటి? ప్రాతిపదిక ఏమిటి? ఏ కొలమానంతో మార్కులను వేయగలం! ప్రభుత్వం ఏర్పడి కొత్త సంసారం సర్దుకునే లోపే లోక్‌సభ ఎన్నికలు వచ్చి పడ్డాయి. వాటి తర్వాతే పరిపాలనపై రేవంత్ ప్రభుత్వం దృష్టి పెట్టడానికి వీలవుతోంది. అంటే ఆరేడు నెలలుగానే పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి, విధానాల రూపకల్పనకు ప్రభుత్వానికి వెసులుబాటు ఏర్పడిందని చెప్పాలి

సిఎం రేవంత్ రెడ్డి పరిపాలన ఎలా వుంది? ఆయన విజయాలు, అపజయాల సంగతి ఏమిటనే ప్రశ్నల కన్నా ముందు, ఎలాంటి సవాళ్ల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందో అర్థం చేసుకోవల సి ఉన్నది. ఆ సవాళ్ళలో మొట్టమొదట కనిపిస్తున్న 'భారీ పర్వతం' ఆర్థిక సమస్య. ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ పార్టీ తొమ్మిదిన్నర సంవత్సరాలలో సంపద సృష్టించినట్టు, బంగారు తెలంగాణగా మార్చేసినట్టు క్లెయిమ్ చేసుకుంటూ ఉంటుంది. ఆ పార్టీ నాయకులు, లేదా కెసి ఆర్, కెటిఆర్ 'భజన బ్యాచ్'లు, 'భక్త బృందాలు' సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచా రం, వాస్తవంలో 'డొల్ల' అని ప్రజలకు తెలిసిపోయింది.

వరుసగా రెండుసార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాల న్న బిఆర్ఎస్‌కు బ్రేకువేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి. అపర చాణక్యుడిగా పేరున్న కెసిఆర్‌ను సామాన్య నాయకుడు రేవంత్ రెడ్డి ఓడించడం అసాధారణ విషయం. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చినందున రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కింది. మంత్రిగా కూడా పనిచేయని ఆయనకు సిఎం పదవి లభించడం విశేషం. తమ పాలనను 'ప్రజాపాలన'గా రేవంత్ నిర్వచించారు. ప్రజాపాలన ఏడాది ముగిసిన సందర్భంగా ప్రభుత్వం విజయోత్సవాలను నిర్వహిస్తోం ది. కెసిఆర్ హయాంలో ఎప్పుడూ ప్రజాప్రభుత్వం లేదా ప్రజాపాలన అనే మాట వినబడలేదు. కెసిఆర్ పాలన అని మాత్రమే చెబుతూ వచ్చారు. అసలు ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారంటూ బిఆర్ఎస్, బిజెపిలు రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పిస్తున్నాయి.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడం, అప్పుల పరిస్థితిని దాటి అభివృద్ధిని గాడిలో పెట్టడం మామూలు వ్యవహారం కాదు. అప్పులతో అతలాకుతలమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకుగాను ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తోంది. 2014 నుంచి 2023 వరకు బిఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.7లక్షల కోట్ల అప్పులు చేసింది. వాటికి చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీలు కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు అడ్డుగోడగా మారాయి.

ప్రభుత్వ ఉద్యోగులకు గతంలో ఎప్పుడు జీతాలు పడతాయో తెలియని పరిస్థితి ఉండేది. ముందుగా ఆ పరిస్థితిని సిఎం రేవంత్ సాహసోపేతంగా మార్చగలిగారు. ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించే పద్ధతిని పునరుద్ధరించడం ముఖ్యమంత్రికి ప్లస్ పాయింటు. ఇది ఉద్యోగుల్లో రేవంత్‌పై అభిమానం ఏర్పడడానికి కారణమయ్యింది. కెసిఆర్ ప్రభుత్వం చెల్లించకుండా బకాయి పెట్టిన దాదాపు రూ.లక్ష కోట్ల బిల్లులను క్రమపద్ధతిలో 'క్లియర్' చేసే విధానాన్ని ముఖ్యమంత్రి అనుసరిస్తున్నారు.

కెసిఆర్ ప్రభుత్వం 'సంపద సృష్టి' పేరిట ఇబ్బడిముబ్బడిగా చేసిన అప్పులు తీర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నది. కెసిఆర్ హయాంలో చేసిన అప్పులపై వడ్డీలు, కిస్తీల కింద రూ.64,516 కోట్లను ప్రతినెలా చెల్లించవలసిన పరిస్థితి నెలకొన్నది. చేయూత, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200యూనిట్లలోపు ఉచిత గృహ విద్యుత్తు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, బియ్యం సబ్సిడీ, ఉపకారవేతనాలు, డైట్ చార్జీల పెంపు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు రూ.61,194 కోట్లను ఈ ఏడాదిలో ప్రభుత్వం ఖర్చు చేసింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల సంక్షేమానికి నవంబర్ నాటికే దాదాపు రూ.9,888 కోట్లను రేవంత్ ప్రభుత్వం ఖర్చు చేసింది.

ఒకవైపు కెసిఆర్ చేసిన అప్పులను తీర్చాలి. మరో వైపు ఎన్నికల సందర్భంగా తమ పార్టీ ఇచ్చిన 'గ్యారెంటీల' అమలుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఏకకాలంలో రైతులకు రూ.20,617కోట్ల రుణాన్ని మాఫీచేసి సిఎం రేవంత్ రెడ్డి కొత్త రికార్డు నెలకొల్పారు. రాష్ట్రంలోని 25.36లక్షల రైతు కుటుంబాలను 'రుణవిముక్తి' చేశారు. ఒక్క ఏడాదిలోనే రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి దాదాపు రూ.57వేల కోట్లు ఖర్చు చేశారు. 'రైతు భరోసా' సంక్రాంతి తర్వాత అమలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 2న ప్రకటించారు.

ఆగస్టు,సెప్టెంబర్‌లలో భారీవర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారంతో పాటు, బాధితులకు సహాయం అందించడానికి రూ.260 కోట్లు కేటాయించారు. మహాలక్ష్మి, గృహజ్యోతితో పాటు యువవికాసం పథకాలను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసింది.



గతంలో నిర్లక్ష్యానికి గురైన నిరుద్యోగులకు ఉద్యోగాలపై భరోసాను కల్పించడంలో రేవంత్ సక్సెస్ అయ్యారు. తొలి ఏడాదిలోనే వార్షిక ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదలచేసి 54,520 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం సంచలనం సృష్టిస్తోంది. విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. వైద్య ఆరోగ్య శాఖలో 7,750మందిని నియమించింది. మరో 6,496 ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. బిఆర్ఎస్ ప్రభుత్వం 8 మెడికల్ కాలేజ్‌లకు జిఒలు ఇచ్చినా, కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కెసిఆర్ విఫలమైనట్టు విమర్శలున్నవి.

ఉద్యోగాల కల్పనలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. రేవంత్ ప్రభుత్వం 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టి దేశ చరిత్రలోనే సరికొత్త రికార్డు నెలకొల్పింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి నియామకాలు జరుపుతోంది. డిఎస్‌సి ద్వారా 55 రోజుల్లో 11 వేలమందికి ఉద్యోగాలు ఇవ్వడం పెద్ద కుదుపు. గ్రూప్1 పరీక్షలు వద్దంటూ కెసిఆర్ పార్టీ కృత్రిమ ఉద్యమాన్ని నడిపించింది. పదేళ్ల పాటు గ్రూప్1 ఉద్యోగాలు రాలేదు. యువత బలిదానాలతో రాష్ట్రాన్ని సాధించుకున్నాం. లక్షలాదిమంది ఉద్యమబాట పట్టి తెలంగాణను సాధించుకున్నారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని అనుకున్నారు. కానీ పదేళ్లపాటు నియామకాలు చేపట్టకపోవడం బిఆర్ఎస్ కు మైనస్. 2011 తర్వాత గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించలేదు.13 ఏళ్ల తర్వాత 563మంది గ్రూప్ 1అధికారులు తెలంగాణ నిర్మాణం లో భాగస్వాములు కాబోతున్నారు. గత ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని సిఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను తోసిపుచ్చడానికి ఆస్కారం లేదు. చాలాకాలం పాటు యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లను నియమించకుండానే కెసిఆర్ కాలయాపన చేశారు.రేవంత్ ముఖ్యమంత్రిగా ఏడాది పూర్తి కాకుండానే వైస్ చాన్సలర్లను నియమించారు.

''తెలంగాణ రైతులు 63 లక్షల ఎకరాల్లో కోటి యాభై మూడు లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను పండించారు. సన్నవడ్లకు ఇస్తున్న బోనస్‌తో కౌలు రైతులు కూడా సంతోషంగా ఉన్నారు. వచ్చే పదేళ్ల మా ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. బోనస్ కొనసాగిస్తుంది.ఈ ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత తెలంగాణ ప్రజలదే. ప్రభుత్వం పైన జరుగుతున్న విష్రపచారాన్ని తిప్పికొట్టాలి''. అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కెసిఆర్ పాలనలో. 'రైతు బంధు' పేరిట రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ.10వేలు అందించింది. చేతికి ఎముకలేని చందంగా బడా భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, సంపన్నులు, ఎన్ఆర్ఐలకు కూడా 'రైతుబంధు' అందింది. తాము ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే రైతుల రుణమాఫీ చేసినందున 'రైతుభరోసా' కు ఆర్థిక అవరోధాలు ఎదురవుతున్నవి. రైతు భరోసా అమలు కాలేదని రైతులలో అసంతృప్తి ఉన్న మాట నిజమే. ఇదే అదనుగా 'కెసిఆర్ వుంటేనే బావుండనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది' అంటూ బిఆర్ఎస్ ప్రాయోజిత మీడియా పెద్దఎత్తున ప్రచారం ప్రారంభించింది. రైతు భరోసాకు సీలింగ్ విధించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలోని కేబినెట్ ఉపసంఘం దీనిపై సమర్పించనున్న నివేదికపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకోబోతున్నారు. భూస్వాములు, పెట్టుబడిదారులు, ఇతర సంపన్నులను 'రైతుభరోసా' నుంచి మినహాయించవచ్చు. ఇదే జరిగితే, చిన్న సన్నకారు రైతులంతా రేవంత్ రెడ్డి వైపునకు 'బదిలీ' కావడం ఖా యం. రేవంత్ లక్ష్యం కూడా వారే. అర్హులకే రైతుభరోసా అందించాలన్నది సిఎం ధ్యేయంగా కనిపిస్తోంది. భూస్వాములు, సంపన్నులకు ఆగ్రహం కలిగినా, దాన్ని ఎలా తిప్పికొట్టాలో రేవంత్ కు తెలుసు. హైదరాబాద్‌లో హైడ్రా, మూసీ ప్రక్షాళన వ్యవహారం కూడా రేవంత్ సర్కార్‌కు కొంత తలనొప్పిగా మారిన మాట నిజం. ఇది ప్రజల వైపు నుంచి కన్నా బిజెపి, బిఆర్ఎస్ వైపు నుంచి ఎక్కువ దుష్ప్రచారం జరుగుతుండడం వలన, ప్రతిపక్షాల ట్రాప్‌లో సాధారణ ప్రజలు సులభంగా చిక్కుకుంటున్నట్టు కనిపిస్తోంది. ఎవరెన్ని విధాలుగా అడ్డుపడినా తమ ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచంతో పోటీపడేలా తయారుచేయడానికి వెనుకాడబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 3న స్పష్టం చేశారు.

'హైదరాబాద్ ఎప్పుడూ ఆటో పైలట్ మోడ్‌'లో ఉంటుంది. ముఖ్యమంత్రి ఎవరైనా, ప్రభుత్వం ఏ పార్టీది అయినా చాలా సులువుగా ఇక్కడ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయి. అందుకు తగిన వాతావరణం, శతాబ్దాలుగా విస్తరించిన నగరం, మౌలిక సదుపాయాల కల్పన ఉండడమే. రేవంత్ ప్రభుత్వం బాగా పనిచేస్తోంది. ప్రతి ప్రభుత్వానికి కొన్ని ప్రాధాన్యతలు ఉంటాయి. హైడ్రా, మూసీ పునరుజ్జీవం వంటి చర్యలవల్ల మధ్యతరగతి జీవులకు ఇబ్బంది కలుగుతున్నది. కానీ భవిష్యత్తు తరాల కోసం ఇలాంటి కఠినమైన నిర్ణయాలు తప్పనిసరి'' అని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ ఇటీవల ఇంటర్వ్యూలో చెప్పారు. కెసిఆర్ హయాంలో జరిగిన చెరువుల ఆక్రమణ, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో భారీ అపార్టుమెంట్ల నిర్మాణానికి అనుమతులివ్వడాన్ని ఆయన తప్పుబట్టారు. మూసీ ప్రక్షాళన పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడం, ఖాళీ చేయాలని ఒత్తిడితేవడం వలన ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిరాశ్రయులయ్యే పేదలకు ప్రత్యామ్నాయ పరిహారం ఇవ్వాలని మేధావులు సిఎం రేవంత్ కు సూచిస్తున్నారు.

నాటి కెసిఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు, రైతు బంధు చుట్టూ తెలంగాణ సమాజాన్ని తిప్పింది. మహా మానవ నిర్మిత ప్రాజెక్టుగా కాళేశ్వరంను అంతర్జాతీయంగా ప్రచారం చేయడం, భారతదేశంలో రైతుబంధు వంటి పథకాలు మరెక్కడా లేవని అన్ని రాష్ట్రాలలో ప్రచారం సాగించి దీన్ని 'బంగారు తెలంగాణ' గా చిత్రీకరించడం కెసిఆర్ 'ట్రిక్కు'. ప్రజలను ఒక మిథ్యా ప్రపంచంలో జీవించేలా చేయడం కెసిఆర్‌కే సాధ్యమైంది. అందువల్ల ప్రజలకు వాస్తవాలు తెలిపి, తాము చేపడుతున్న కార్యక్రమాలు, ఆర్థిక పరిమితులపై ప్రజల్ని కన్విన్సు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కత్తి మీద సాము లాంటిది.

## నేలతల్లిని కాపాడుకుంటేనే మనుగడ

మానవుడు అభివృద్ధి పేరుతో చేపడుతున్న అనేక స్వార్థపూరిత చర్యల వల్ల పర్యావరణం గతంలో ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. వాతావరణంలోకి నిత్యం పెద్దయెత్తున్న విడుదలవుతున్న కలుషితాల వల్ల ఋతువులు గతి తప్పాయి. సహజవనరులు తమ సహజత్వాన్ని కోల్పోతున్నాయి. కోట్లాది ఎకరాల సాగు భూములు తమ సారాన్ని కోల్పోయి బీడు భూములుగా మారిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పచ్చిక బయళ్ల ధ్వంసం కావటం వల్ల కూడా మేత లేక ఏటా లక్షలాది పశువులు మృత్యువాత పడుతున్నాయని, వీటిని రక్షించుకోవాలంటే నేల క్షీణతను అరికట్టి, తిరిగి వాటిని పునరుద్ధరించటం ఒకటే మార్గమని పర్యావరణ వేత్తలు హితవు పలుకుతున్నారు. దానిలో భాగంగా ఈ సంవత్సరం ప్రపంచ నేల దినోత్సవాన్ని 'నేలల సంరక్షణ – మెజర్, మానిటర్ అండ్ మేనేజ్' అనే థీమ్‌తో జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య అండ్ వ్యవసాయ సంస్థ(ఎఫ్ఎఒ) ప్రపంచ దేశాలను కోరింది. సృష్టిలోని సమస్త జీవరాశి మనుగడకు కావాల్సిన ఆహారాన్ని, ఆవాసాన్ని అందించేది నేల తల్లే. జీవన ధాతువుగా నిలవాల్సిన ఆ నేలతల్లే మానవుని స్వార్థపూరిత చర్యల వల్ల వెదజల్లబడుతున్న కాలుష్యం వల్ల తల్లడిల్లుతుంది. భూమిని పుడమితల్లిగా పూజించే భారత్ వంటి దేశాలలో కూడా నేల క్షీణత, ఎడారీకరణ అత్యంత వేగవంతంగా సాగుతున్నాయి. వాతావరణ మార్పులు, మానవ ప్రేరిత చర్యల వల్ల భారత దేశంలో 32 శాతం నేల క్షీణతకు గురవుతుండగా, 25 శాతం భూమి ఎడారిగా మారిపోతుందని భారత కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2023లో యుఎన్‌సిసిడి విడుదల చేసిన తాజా నివేదికలో భారతదేశ జనాభాలో దాదాపు 18.39 శాతం మంది ప్రజలు భూక్షీణత, ఎడారీకరణ వల్ల అనేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొం ది. దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాలలో భూమి క్షీణత అధికంగా కనిపిస్తుందని, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, జమ్మూ అండ్ కాశ్మీర్, కర్ణాటక, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో 23.95 శాతం భూమి క్షీణతకు గురవుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది.

జీవ పరిణామ క్రమంలో అత్యంత విలువైన, సమర్థవంతమైన, సజీవమైన పాత్రను పోషించిన భూమి నేడు అత్యంత వేగంగా క్షీణతకు గురి కావటం ఒక విషాదం. కోట్లాది జీవరాశుల మనుగడకు అవసరమైన ఆహారానికి జీవంపోసే నేల నేడు జీవాన్ని కోల్పోయి నిర్జీవంగా మారిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల ఏటా కనీసం 1.6 బిలియన్ హెక్టార్ల నేల క్షీణతకు గురవుతుందని, ఇది సుమారు 3.2 బిలియన్ల మంది ప్రజల జీవితాలపై తీవ్రమైన ప్రభావాన్ని కలిగిస్తుందని పర్యావరణ వేత్తలు అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా భూమి క్షీణతకు గురై ఎడారిగా మారిపోతుంది. గడిచిన 10 సం.లో సుమారు 15 లక్షల హెక్టార్ల సాగు భూమి ఎడారిగా మారిపోయింది. 2050 నాటికి ప్రపంచ జనాభాలో మూడొంతుల మంది తీవ్రమైన కరువును ఎదుర్కొంటారని ఆ సంస్థ హెచ్చరిస్తుంది. దీంతో కోట్లాదిమంది ప్రజలు పర్యావరణ శరణార్థులుగా మారి ఇతర ప్రాంతాలకు, లేదా ఇతర దేశాలకు వలస పోవాల్సి వస్తుంది. విచ్చలవిడిగా రసాయినిక ఎరువుల వినియోగం, యాంత్రిక వ్యవసాయీకరణ, ఏకరూపక వ్యవసాయ సంస్కృతి మన దేశానికి హరిత విప్లవం అందించిన విధానాలు. ఇవే ఇప్పుడు నేలతల్లి పాలిట శాపాలుగా మారుతున్నాయి. దేశవ్యాప్తంగా హరిత విప్లవ కాలంలో అనుసరించిన వ్యవసాయిక విధానాల వల్ల నేల నిర్మాణం పూర్తిగా మారిపోయింది. దీంతో పాటు అభివృద్ధి పేరుతో పెద్దయెత్తున్న సాగుతున్న అటవీ విధ్వంసం, అడ్డు అదుపూ లేకుండా సాగుతున్న పట్టణీకరణ వంటి అంశాలు పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి. భారతదేశం భూమి క్షీణతను తగ్గించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని 2015లో పారీస్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమెట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ సదస్సులో ప్రకటించింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 26 మిలియన్ హెక్టార్ల నేలని తిరిగి పునరుద్ధరించే లక్ష్యంతో ఖాఫ్ పార్టీస్ చేపట్టిన బాన్ ఛాలెంజ్‌లో భారతదేశం భాగస్వామిగా చేరింది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాలలో నేల కలుషితమై తన సారాన్ని కోల్పోయి ఎడారులుగా మారిపోతుంది. సకల జీవరాశులకు జీవం పోసే నేల తన జీవాన్ని కోల్పోయి నిస్సారంగా మారితే సృష్టిలోని సకల జీవరాశుల మనుగడ ఒక పెను సంక్షోభంలో పడుతుంది. ఈ సంక్షోభాన్ని అరికడితేనే మానవ మనుగడ కూడా సాధ్యమవుతుంది, లేకుంటే వినాశనమే.

డాక్టర్ కె. శశిధర్, 94919 91918

## కుంటుపడ్డ కుల వృత్తులు

అవును ఇదీ నిజమే, భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం అని అందరికీ తెలుసు, ఇక్కడ ఒక్కో ప్రాంతానికి ఒక్కో చరిత్ర ఉంటుంది, వివిధ రకాల జాతులు, వివిధ రకాల మతాలు, కులాలు, సంస్కృతులు, పద్ధతులు, ఆచారాలు. సంప్రదాయాలు పాటించే వాళ్ళు ఎక్కువగా ఉంటారు, అయితే మన తెలుగు రాష్ట్రాలలో కులవృత్తులకు ప్రాధాన్యత చాలా ఉంటుంది. వివిధ రకాల వృత్తులమీద ఆధారపడి గతంలో చాలావరకు గ్రామీణ ప్రాంతాలలో ప్రజ లు జీవించేవారు,

**పారిశ్రామిక విప్లవం:** ముందుగా పారిశ్రామిక విప్లవ రంగం తొంభై దశకం వచ్చిన తరువాత మిషన్ల వాడకం పెరిగింది, మనిషికి పని తగ్గింది, అటు రైతులకు పని తగ్గింది, గతంలో ఎడ్ల ద్వారా వ్యవసాయం చేస్తే దానికి కమ్మరి, వడ్రంగిలకు పని లభించేది, ఆ రోజుల్లో ఊరు వెళ్లిన ఊర్లో 'రచ్చ బండ', అని 'కచ్చిరు' దగ్గర వడ్రంగులు పనులు చేస్తూ ముచ్చట పెట్టేవాళ్ళు, నేడు అంతా మరుగున పడిపోయింది,

వాటి స్థానంలో ట్రాక్టర్ మిషన్ వచ్చి పూర్తిగా టెక్నాలజీ వచ్చి పని సులువుగా అయ్యింది, అదే విధంగా వృత్తులు చేసుకునే వాళ్లకు పనిలేక నగరాలకు వలసపోయి ఏదో ఒకపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు, టెక్నాలజి రావొద్దు అని కాదు, కొంత మనిషికి ఉపాధి దిశగా ఉండాలి. ఇది పెద్ద మొత్తంలో కూలీలకు కష్టంగానే మారింది అని చెప్పవచ్చు.

**సబ్బండ వృత్తులు కనుమరుగు:** గ్రామీణ పల్లెలలో చెరువులు, కుంటలు, దర్శనం ఇస్తాయి, ఇందులోనే మన చాకలి వాళ్ళు ఊర్లో ఉన్న వాళ్ల బట్టలు తెచ్చి చెరువుల్లో ఉతికే వాళ్ళు, నేడు మన చాకలి కరువయ్యారు, వృత్తి పూర్తిగా చాలా గ్రామాలలో మానేశారు, అలాగే కుమ్మరి కులస్థులు కూడా మట్టితెచ్చి కుండలను సంప్రదాయ పద్ధతిలో చేసేవాళ్ళు, నేడు వాళ్ళు కనిపించడం లేదు, కుండలను వేరే ప్రాంతం నుండి దిగుమతి చేసుకొని, మన దగ్గర అమ్ముకోవడం జరుగుతుంది,

అదేవిధంగా గౌడ్‌లు ఒక్క తాటి, ఈత చెట్లపైనే ఆధారపడి జీవిస్తున్నారు, వీళ్ళకష్టం కూడా వర్ణనాతీతం. సుమారు నలభై అడుగుల ఎత్తులో ఉన్న తాటి చెట్టు ఎక్కడం చాలా కష్టమైన పనిగా భావించాలి, గౌండ్ల కష్టానికి ఫలితం దక్కడం లేదు, ప్రజలు మోడ్రన్ మందులు ఎక్కువ ఖరీదుకు కొని ఆరోగ్యానికి హానికరం అయినా మరీ తాగుతున్నారు, కానీ మన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే 'నిరా'కు ధర పెట్టకపోవడం చాలా బాధాకరం.ప్రజలు అంతా మోడ్రన్ టెక్నాలజీకి అలవాటు పడ్డ రోజులు అయ్యాయి, ఇదే కుల వృత్తుల వాళ్ళు మహా నగరాలలో కూలీకి పనిచేస్తూ జీవిస్తున్నారు, అదేవిధంగా మిగతా కులాల వాళ్ళు సైతం అరకొరగా వేరే పని చేపడుతూ జీవనం సాగిస్తున్నారు. కాబట్టి కొన్ని కుల వృత్తుల మీద ఆధారపడి జీవించే వాళ్లకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి అని కోరుకుందాం!

కిరణ్ ఫిషర్

## అందరివాడు... అంబేద్కర్



6 నవంబర్ అంబేద్కర్ వర్ధంతి

నవ బుద్ధుడు నవభారత దర్శకుడు గొప్ప విద్యావేత్త మేధావి రాజీపడని పోరాటయోధుడు ,రాజ్యాంగ పిత అందరి బంధువు ఆధునిక మనువు సమసమాజ స్వాప్నికుడు సమసమాజ స్థాపకుడు భారత సమాజానికి పరిచయం అక్కరలేని మహోన్నత వ్యక్తి అంతర్లేని సమాజం కోసం తన జీవితాన్ని ధారపోసిన ఉత్తముడు అన్ని వర్గాల ప్రజలు అభిమానించి గౌరవించే వ్యక్తులలో ఆయన ఒకరు ఆయనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ (14 ఏప్రిల్ 1891 – 6 నవంబరు 1956). ముఖ్యంగా సామాజిక తరగతుల అభివృద్ధికై ఆయన చేసిన మొదటి పోరాటం కులం మతం పైన. భారత సమాజంలో కులం యొక్క పునాదులు ఎంత బలంగా ఉన్నాయో అంబేద్కర్ గుర్తించారు. కులం మతం యొక్క సంబంధాలు ఈ సమాజాభివృద్ధి పై వాటి పాత్రను తెలుసుకున్నాడు. దాన్నుంచి పాఠాలు నేర్చుకుని అనుభవాలను విశ్లేషించి చెప్పారు. కుల మతాలలోని ఉన్న కుళ్ళునంత ఎండగట్టాడు. భారత సమాజాన్ని పట్టి పీడిస్తున్న మన వాదాన్ని తగలబెట్టాలని నిలువెత్తు చాటి మనువాదం నుంచి విముక్తి పొందడమే మార్గమని ఆ దిశగా నడిపించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్.

అంబేద్కర్ ఇప్పటి మధ్యప్రదేశ్‌లోని మహర్‌కులంలో భీమాబాయి , రాంజీ సక్ పాల్ దంపతులకు జన్మించారు. ఆయన మొదటి నుంచి ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారు. అంబేద్కర్ ఆరేళ్ల అప్పుడే తల్లి భీమాబాయి నీ కోల్పోయాడు. ఊహ తెలియని వయసు నుంచే అనేక కష్టాలు చూసి చూశాడు. అంబేద్కర్ తండ్రి రాంజీ ఉద్యోగం విరమణ చేశారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా చదువుపై ఉన్న మక్కువను మాత్రం అంబేద్కర్ చంపుకోలేదు. పాఠశాలలో ఇతర కులాలకు చిన్న పిల్లలకు దూరంగా ఓ గోనె పట్టా వేసుకొని పాఠాలను శ్రద్ధగా విని విజ్ఞానవంతుడయ్యాడు. చిన్నతనంలోనే అంటరానితనం ఎలా ఉంటుందో స్వయంగా అనుభవించాడు. ఓ రోజు మరో ఊరు నుంచి ఎడ్లబండిపై ప్రయాణిస్తుంటే బండి తోలేవాడు వీరిని తక్కువ కులం అని బండి నుంచి దించేశాడు. అలాగే కుళాయి నుంచి నీళ్లు తాగుతుంటే ఇతర కులస్తులు దండించిన తీరు అంబేద్కర్‌ను వేదనకు గురిచేసింది. చిరుప్రాయంలోనే అవమానాలను చీదరింపులు ఎలా ఉంటాయో ఆ పసి హృదయానికి అర్థమైంది. అంబేద్కర్‌లో చదువుకోవాలనే తపన అంటరాని గుర్తించిన ఓ బ్రాహ్మణుడు అన్నంపెట్టి ఆదరించాడు. విజ్ఞానాన్ని అందించాడు. ఆ గురువు పేరును తన పేరులో మొదటగా చేర్చుకుని గురువుని గౌరవించాడు అంబేద్కర్. కొలంబియా లండన్ విశ్వవిద్యాలయాల నుంచి పిహెచ్‌డి, డిఎస్‌సి, పట్టాలు అందుకున్నాడు. ఉన్నత విద్య అభ్యసించిన అంబేద్కర్‌పై ఆధిపత్య పెత్తందారి వర్గాలు అసూయతో అక్కసు వెళ్లగక్కాయి. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రజా ఉద్యమాలను బలపరుస్తూ పోరాటయోధుల అక్రమ కేసులను తీసుకొని వాదించాడు. దళితుల్ని చైతన్యం చేయటం కోసం దళిత విముక్తి సంఘాన్ని 1924 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని మహర్ లోని చౌదరి చెరువులో ఆధిపత్య కులాలకే హక్కు ఉండేది. ఆయన ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిరావు పూలేను గురువుగా చెప్పుకున్నాడంటే ఆయన గొప్పతనాన్ని నేటి సమాజం అర్థం చేసుకోవచ్చు. 1927 డిసెంబర్ 25న అంబేద్కర్ మనుస్మృతి ని దహనం చేయడం పెద్ద దుమారం రేపింది. అంబేద్కర్ సంపాదకత్వంలో ముక్ నాయక్ పక్షపత్రిక నడిచింది. 1927 సంవత్సరంలో బహిష్కృత భారతి మరాఠీ పక్ష పత్రిక ప్రారంభించాడు. కులాన్ని ఉపయోగించి విలువైన రచనల్ని అందించాడు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీని 1936 సంవత్సరంలో స్థాపించాడు. కమ్యూనిస్టులను బల పరచాల్సిన అవసరాన్ని గుర్తించి బొంబాయ్ నియోజకవర్గంలో డాంగే కమ్యూనిస్టు నాయకులతో కలిసి ఎన్నికలలో పాల్గొన్నాడు. బొంబై కౌన్సిల్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన గళాన్ని వినిపించాడు. ప్రజల డబ్బును ఇష్టా రీతిగా ఖర్చు చేయడం తగదని నాయకులను సూచించడం. రూపాయలు ఐదు వందలకు బదులుగా 75 నిర్ణయిస్తే సముచితంగా ఉంటుందని అంబేద్కర్ స్పష్టం చేశాడు. కార్మిక కర్షక సమస్యలను సభల్లో లేవనెత్తి చర్చకు పెట్టాడు. దేశంలోని లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంచాలని అణిచి వేయబడుతున్న వారిని అభివృద్ధిలోకి తీసుకురావాలని కోరుకున్నాడు. నీ నిచ్చిన్న మెట్ల కులవ్యవస్థను సమూలంగా నిర్మూలన చేయడం కోసం అనేక వర్గాలను అన్వేషించాడు. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు కులాంతర వివాహం సహపంక్తి భోజనాలు భూములను జాతీయ లాంటి తదితర అంశాలను సూచించాడు. దళిత హక్కుల కోసం సామాజిక హోదా కోసం ఆయన ఎన్నో పోరాటాలు నిర్వహించారు. స్వాతంత్రం అనంతరం ఏర్పడిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ రచన కమిటీకి అంబేద్కర్ చైర్మన్ గా ఉన్నాడు. రాజ్యాంగ రచనలో సింహభాగం అంబేద్కర్ కృషే.' రాజ్యాంగం ఎంత ఉన్నతమైందో అది అమలు కానప్పుడు చెత్త బుట్టలో పడేసిన చిత్తు కాగితంతో సమానమేనని అనగలిగాడు అంబేద్కర్. రాజ్యాంగ అమలు పై ఆయన అనుమానాలు వ్యక్తం చేశాడు. 1951 ఫిబ్రవరి 5న అంబేద్కర్ ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందలేదు. కాంగ్రెస్కు సభలో మెజార్టీ ఉన్న ఆ బిల్లు ఆమోదం పొందక పోవడంతో అంబేద్కర్ ఆవేదనకు చెందాడు. బిల్లు ఆమోదం లభించినందుకు నిరసనగా న్యాయశాఖ మంత్రి పదవిని రాజీనామా చేశాడు. 'మహిళలు సాధించిన ప్రగతినే.... నేను దేశప్రగతికి కొలమానంగా భావిస్తానని' ప్రకటించిన మహోన్నత వ్యక్తి స్త్రీ పక్షపాతి అంబేద్కర్. 'హిందువుగా పుట్టడం నా చేతుల్లో లేకపోయినా హిందువుగా మాత్రం చనిపోనని ' చెప్పిన ఆయన 1956 అక్టోబర్ 14న నాగపూర్లో బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. బౌద్ధం స్వీకరించి రెండు నెలలు గడవకముందే 1956 డిసెంబర్ 6న భారత సభ్య సమాజం నుంచి ఆ మహానుభావుడు భౌతికంగా దూరం అయ్యాడు.ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ, ది బుద్ధ అండ్ హిజ్ ధర్మ, కుల నిర్మూలన, శూద్రులు అంటే ఎవరు, అస్పృశ్యులు అంటే ఎవరు, బుద్ధుడు ధర్మం, ఇలాంటి ముఖ్య రచనలు వారివి. భారత ప్రభుత్వం ఆయన చేసిన సేవకు గుర్తింపుగా 1991 సంవత్సరంలో భారతరత్న అవార్డును ప్రకటించి గౌరవించింది. భారత రాజ్యాంగ కర్తగా ఆయన ఉన్నత స్థాయి శిఖరాలకు ఎదిగి ఒదిగిన తీరు మంత్రముగ్ధులను చేస్తుంది. కులం మతం పట్ల ఈ సమాజం గమనం పట్ల ఆయనకున్న అవగాహన, ఆచరణ అణగారిన జనాలను ఆలోచింపచేస్తోంది. నేటితరంలో ఉన్న యువత అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని ఆయన సిద్ధాంతాలను అనుసరిస్తూ ముందుకు నడవడమే నేటి సమాజంలో ఉన్న యువత ముఖ్య లక్ష్యంగా తీసుకోవాలి.....

నరేష్ జాటోత్, 8247887267

# కూసుమంచి పిహెచ్‌సిలో కిష్కిందకాండ

ఎటువంటి తీర్మానం లేకుండా పల్లె దవాఖాన డబ్బులు సుమారు మూడున్నర లక్షలు డ్రా..?

ఒకరిపై ఒకరు ఆర్‌టిఐలు వేసుకున్న సిబ్బంది

సబ్ సెంటర్ విధులను విస్మరించిన ఓ హెల్త్ అసిస్టెంట్

నిత్యం గొడవలు పడుతూ అంగీకార పత్రాలు వ్రాసుకుంటున్న పిహెచ్‌సి ఉద్యోగులు



**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, సబ్ సెంటర్లలో అందుబాటులో ఉంటూ వైద్యం అందించడంలో ముందుండాల్సిన వైద్య సిబ్బంది అంతర్గత గలాటకు ముందుంటున్న సంఘటనలు కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకుంటున్నాయి. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ పెత్తనం కోసం ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకుంటూ, ఫిర్యాదులు చేసుకుంటూ, ఆర్టిఎలు సైతం వేసుకుంటూ సిబ్బంది ఒకవైపు బిజీగా ఉంటే, మరోవైపు వైద్యాధికారి జాబ్ కమిటీ పండును డ్రా చేయడంలో బిజీగా ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా అంతర్గత కుమ్ములాటకు కేరాఫ్ గా మారుతున్న కూసుమంచిప్రాథమిక ఆరోగ్య కేంద్రం పై ప్రజాపక్షం ప్రత్యేక కథనం.

**ఎటువంటి తీర్మానాలు లేకుండా పల్లె దవాఖాన డబ్బులు డ్రా?**

గ్రామాల్లో వైద్యాన్ని విస్తరించేందుకు ఇటీవల ప్రభుత్వం ప్రతి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పల్లె దావకానాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మండలంలో ఏడు పల్లె దవకాన ఏర్పాటు చేసి సిబ్బందిని సైతం నియమించింది. అట్టి పల్లె దావాఖన నిర్వహణ, మెరుగైన వసతులు, కల్పించేందుకు ఒక్కోపల్లి దావకానకు సుమారు 80 వేల రూపాయలు మంజూరు చేసింది. మంజూరైన నిధులను జిల్లా అధికారులను సంప్రదించుకుంటూ, పలు రకాల అనుమతులు తీర్మానాలతో ఖర్చు చేయాల్సి ఉండగా ఎటువంటి తీర్మానాలు అనుమతులు లేకుండా కొందరి సిబ్బంది సహాయంతో వైద్యాధికారి ఒక్కొక్క పల్లె దావకాన నుండి 50 వేల చొప్పున సుమారు మూడున్నర లక్షల రూపాయలు డ్రా చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. డ్రా చేసిన డబ్బులతో ఏ రకమైన వస్తువులు కొంటున్నారు దేనికి ఖర్చు పెడుతున్నారనేది కనీసం సబ్ సెంటర్ సిబ్బందికి కూడా తెలియనివ్వట్లేదని విమర్శలు ఉన్నాయి. పల్లె దవఖాన ఎంఎల్‌హెచ్‌పి, మండల వైద్యాధికారి జాయింట్ అకౌంట్ లో ఉన్న డబ్బులను డ్రా చేయడం పట్ల వైద్య అధికారుల చర్య ఏ విధంగా ఉంటాయో వేచి చూడాలి.

**ఒకరిపై మరొకరు ఆర్.టి.ఐలు:**

ప్రజలు వారికి ఉన్న సందేహాలను నిర్వర్తి చేసుకోవడం కోసం సమాచారాన్ని తీసుకునేందుకు ఆర్టిఐ ద్వారా దరఖాస్తు చేసుకుంటారు. కానీ అధికారులే అంతర్గత విభేదాల్లో భాగంగా ఒకరిపై ఒకరు ఆర్టిఐలు వేసుకోవడం కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతుంది. మండల వైద్యాధికారి మాట వినలేదని ఒకరిపై వైద్యాధికారి వెంట ఉండే హెల్త్ అసిస్టెంట్ ఆర్టిఐ దరఖాస్తు వేపించాడని ఆ ఆర్టిఐకి బాధ్యులైన వారు తిరిగి మరో ఐదుగురుపై ఆర్‌టిఐలు బయట వ్యక్తులతో వేపియడం, ఇలా ఒకరిపై ఒకరు వేయించడం వీరికి ఒక సవాలుగా మారి నిత్యం గొడవలతో వర్థిల్లుతున్నది. దీనికి ప్రధాన కారణం సంబంధిత అధికారి అడ్మినిస్ట్రేషన్ గురించి సక్రమంగా తెలియకపోవటమా..? లేక కక్షపూరితమైన పని విధానానికి పురిగొల్పి కొంతమందిని టార్గెట్ చేసుకొని చేయించడమా..? అనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఈ సమాచార హక్కు చట్టం వేయించుకోవటం చివరికి సిల్కీ చిలికి గాలివానగా మారుతుంది.

**సబ్ సెంటర్ విధులు మరిచిన ఓ హెల్త్ అసిస్టెంట్:**

మండలంలో ప్రధాన రహదారిపై ఉన్న ఓ మేజర్ గ్రామానికి హెల్త్ అసిస్టెంట్ గా ఉన్న ఒకరు తన విధులను మరిచి నిత్యం వైద్యాధికారితోనే తిరుగుతూ పిహెచ్‌సి సిబ్బందిని, సూపర్వైజర్లను, ఏఎన్ఎమ్ లను, ఆశాలను తన పెత్తనాన్ని చేస్తూ విధులకు మాత్రం హాజరు కాకుండా పిహెచ్‌సి లో ఉంటూ విజిట్ల పేరుతో తన సబ్ సెంటర్ ను వదిలేసి వైద్యాధికారితో కలిసి అన్ని సబ్ సెంటర్లకు తిరుగుతూ, తన సబ్ సెంటర్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో లేకుండా ఉంటున్నాడు. ఎవరైనా ప్రశ్నిస్తే మీకెందుకు మీకు ఏమైనా ఇబ్బంది అవుతుందా అది నా ఇష్టం అంటూ మెడికల్ ఆఫీసర్ వారిని నోరు మూయించడంతో నిర్బంధంగా పనిచేస్తున్నట్లు చర్చి జరుగుతుంది. అదే గ్రామంలో ఉన్న ఒకే ఒక ఏఎన్ఎం విధులు నిర్వహిస్తున్నారు.

**నిత్యం గొడవలు పడుతూ అంగీకార పత్రాలు రాసుకుంటున్న పిహెచ్‌సి సిబ్బంది :**

వైద్య సిబ్బంది ఆధిపత్యం కోసం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, నిత్యం ఏదో ఒక విమర్శకు కేరాఫ్ గా మారుతున్నారు. వీరి మధ్య రగులుతున్న అంతర్గత కుమ్ములాటలను రాజీ కుదిరించేందుకు మండల వైద్యాధికారి చేసిన ప్రయత్నాలు రాజీ పత్రాల రూపంలో ఫులిస్టాప్ పడుతుంది. అనుకున్న రాజీకి రాకపోగా చివరికి అంగీకార పత్రాలు రాసుకునే పరిస్థితి చోటుచేసుకుంది. పత్రాలు పత్రాలుగానే మిగిలిపోయి అంతర్గత కుమ్ములాటలు మాత్రం కొనసాగుతున్నట్లుగానే తెలుస్తుంది.

**వైద్య అధికారి తనకు నచ్చిన వారికి మాత్రమే సెలవులు :**

ఇవ్వడం సక్రమంగా విధులు నిర్వహించక పోయిన పట్టించుకోకపోవడం పట్ల వైద్యాధికారిపై విమర్శలు వెలుగుతున్నాయి. ఇప్పటికైనా పల్లె దావఖాన నిధుల డ్రాప్ పై విచారణ జరిపి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అంతర్గత కొమ్ములాటలను జిల్లా అధికారులు ఫుల్‌స్టాప్ పెట్టి, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో వైద్య సిబ్బందిని సక్రమమైన పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**మండల వైద్యాధికారి వివరణ:** కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది మధ్య జరుగుతున్న అంతర్గత పోరు, పల్లె దావఖన నిధుల డ్రా పట్ల ప్రజాపక్షం విలేకరి వివరణ కోరగా నేను ఎవరి విషయంలో జోక్యం చేసుకోవడం లేదు. అంతా సక్రమంగానే ఉంది. పల్లె దావఖాన డబ్బులు డ్రా చేయలేదు అంటూనే ఫోను సంభాషణను నిలిపివేశారు.

## మొక్కలు నాటి సంరక్షించుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి. కళావతిబాయి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా పుట్టిన రోజు సందర్భంగా గురువారం వి.వెంకటాయపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం నందు డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ బి. కళావతిబాయి ఆధ్వర్యంలో మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందు నాయక్, డాక్టర్ మౌనిక, డిపిఓఎం.దుర్గ, ఎంపిహెచ్‌ఎస్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న ఆటోల బంద్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల ఏడున జరిగే ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని ఎఐటియుసి ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. మోహన్‌రావు పిలుపు నిచ్చారు. ఖమ్మం పాత బస్టాండ్ అడ్డాలో ఆటోల బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన ఇంత వరకు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.15వేలు అందించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిష్కరించాలని కోరుతూ ఆటో డ్రైవర్ల జేఏసి తలపెట్టినరాష్ట్రవ్యాప్తఆటోలబంద్‌నువిజయవంతంచేయాలని ఆయన కో రారు.

## బాబుమియా మృతికి పలువురు నివాళి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండలం పంగిడి గ్రామ మాజీ సర్పంచ్ షేక్ రజబ్ అలీ తండ్రి షేక్ బాబుమియా (90) మృతి పట్ల పలువురు నివాళులర్పించారు. అనారోగ్య కారణాలతో మృతి చెందిన బాబుమియా భౌతికాయాన్ని గురువారం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తరుపున ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో రెండవ డివిజన్ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, కిసాన్ సెల్ నాయకులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, యువజన కాంగ్రెస్ ఖమ్మంజిల్లా వైస్ ప్రెసిడెంట్ బానోత్ కోటేష్ నాయక్, రఘునాథపాలెం మండల యూత్ అధ్యక్షులు భూక్యా చిన్నయ్య నాయక్, మాలోత్ రాము, మంగీలాల్, ఉపేందర్, బీమా తదితరులు ఉన్నారు.

## రెబ్బవరం పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

**ప్రజాపక్షం/వైరా:** బాలల హక్కుల పేరిట పిల్లలకు ఎటువంటి తప్పు చేసినా వ్యవహారం లేకున్నా వారికి విద్యార్థి నేర్పించి బుద్దులు నేర్పించి క్రమశిక్షణలో వచ్చే ఉపాధ్యాయులు చేతులు ముడుచుకొని కూర్చునే పరిస్థితి రావడం వలన నిన్నటి రాయచోటి సంఘటన ప్రత్యక్ష నిదర్శనమని, ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్ళు తెరిచి విద్యారంగంలో ఏమి జరుగుతుందో పరిశీలించి చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో భారతదేశంలో గురుశిష్య సంబంధం లేకుండా పోతుందని భావిభారత పౌరుడు ఏ రకంగా తయారవుతారు. సమాజంలో జరిగే అశాంతి అకృత్యాలకు అంతు లేకుండా పోతుందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్‌టియు ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొడ్డా వరప్రసాదరావు అన్నారు. ఒక్కొక్క కుటుంబాల్లో ఒకరిద్దరే పిల్లలు ఉంటున్నారని వారిని మరీ గారాబం చేయడం క్రమశిక్షణ తెలియపరచక పోవడం విద్యార్థులకు పెద్దల పట్ల ఉపాధ్యాయుల పట్ల ఎలా ప్రవర్తించాలో తెలియడం లేదని అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెబ్బవరంలో అడిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు దొడ్డా వరప్రసాద్, ఉపాధ్యాయులు నర్సింహారావు, అక్బర్, చంద్రశేఖర్, సరస్వతి, భాగ్యలక్ష్మి, వేదన, భవాని తదితరులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు.

## జాతీయ రహదారుల నిర్మాణ, వ్యయ వివరాలు తెలపండి

లోక్‌సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న జా తీయ రహదారుల ప్రస్తుత నిర్మాణ పరిస్థితులు ఏమిటని, ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధుల వివరాలు తెలపాలని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల స ందర్భంగా గురువారం ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి ఈ మేరకు ప్రశ్నించారు. కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితీన్ గడ్కరీ స్పందించి సమాధానం ఇచ్చారు. తెలంగాణ రా ష్ట్రంలో ప్రజా అవసరాల మేరకు పూర్తి స్థాయిలో రోడ్డు, జాతీయ రహదారుల నిర్మాణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధుల సహకారంతో పాటు కేంద్ర ప్రభుత్వం 2024 – 25 సంవత్సరం వరకు రూ. 4, 494 కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రుద్రంపూర్ భద్రాచలం సెక్షన్ పనులు, హైదరాబాద్ భూపాలపట్టణం రహదారి పనులు, మహబూబ్ నగర్ చించోలి రహదారి విస్తరణ పనులు, తిరుమలగిరి సూర్యాపేట రోడ్డు విస్తరణ ఇలా రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల పనులు కొనసాగుతున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. రహదారి పనులన్ని సకాల ంలో పూర్తి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని తెలిపారు.

## ప్రైవేటు పాఠశాలలో సిసి కెమెరాల కలకలం

**ప్రజాపక్షం/భద్రాచలం:** కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ పాఠశాల్లో సిసి కెమేరాల కలకలం రేగింది. వివరాల ప్రకారం ఆ పాఠశాల్లోని ఓ గదిలో మహిళా టీచర్లకు కనిపించకుండా సిసి కెమోరాలు ఫిక్స్ చేసినట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఆ గదిలో పైకప్పు కూలిపోవడంతో సిసి కెమోరాలు బయటపడినట్లు చెబుతున్నారు. అయితే ఈ విషయంపై కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు విద్యార్థికారులను కలిసినట్లు తెలిసింది. ఈ విషయంలో మండల విద్యాధికారి, పోలీసులు పాఠశాలను తనికీ చేయగా అలాంటిదే ఏమీ లేనట్లు వారి విచారణలో తేలినట్లు సమాచారం. కాగా మంగళవారం చోటు చేసుకున్న ఈ విషయం బుధవారం నాటికి పెద్ద ఎత్తున ప్రచారం సాగడంతో మీడియా ప్రతినిధులు పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించగా మహిళా సిబ్బంది అలాంటిదేమీ లేనట్లు చెప్పుకొచ్చారు. కావాలని దీనిని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని,స్కూల్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు చేస్తున్నారని చెప్పుకొచ్చారు.

## మహిళలను ఆదుకుంటున్న మహాలక్ష్మి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తూ వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని ఖమ్మం కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారా, ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరాం తెలిపారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో గురువారం ఖమ్మం కొత్త బస్టాండ్ నందు ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలందరికీ పల్లెవెలుగులు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆర్టిసిలో ఉచిత ప్రయాణాన్ని నిరాటకంగా కొనసాగిస్తుందని ఆమె తెలిపారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఏడాది కాలంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం మాట్లాడుతూ ఉచిత ప్రయాణం నిరాటకంగా కొనసాగడం మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 114.34 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకుని రూ.3856.40 కోట్ల ఆదా చేశారన్నారు. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 4.28 కోట్ల మంది ప్రయాణించి రూ.208 కోట్లు ఆదా చేశారన్నారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టిసి బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఏడాది కాలంలో 1389 కొత్త బస్సులను తీసుకు రావడం జరిగిందని అందులో మహాలక్ష్మి పథకం కోసం 822 నూతన బస్సులను ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. మహిళల కోసం బస్టాండ్లలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం తీసుకు రావడం చాలా సంతోషంగా ఉందని పలువురు ప్రయాణికులు తెలిపారు. ఉచిత బస్సు ద్వారా కొంత డబ్బును ఆదా చేసుకోగలుగుతున్నామని మహిళా ప్రయాణికులు తెలిపారు. ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్, మధిర డిపో మేనేజర్ శంకర్‌రావు, పర్సనల్ మేనేజర్ జిఎస్ నారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ బాలస్వామి, మెడికల్ ఆఫీసర్ సాయిసుష్మా, అసిస్టెంట్ మేనేజర్లు రామయ్య, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో తనిఖీలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** డిసెంబర్ 2 నుండి 8వ తేదీ వరకు జరుగుతున్న మావోయిస్టు వారోత్సవాలను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు సిఐ అశోక్ రెడ్డి సూచనల మేరకు అశ్వాపురం మండలంలోని సీతారాంపురం గ్రామం వద్ద ఎస్ఐ తిరుపతిరావు తన సిబ్బందితో విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు సంఘ విద్రోహుల కార్యకలాపాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరించినట్లయితే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా ఏజెన్సీ యువత మంచి ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలను పొంది తమ జీవితాలను బాగుపరచుకోవాలని సూచించారు. దానికి సంబంధించిన ఏ రకమైన సహాయ సహకారాలు అందించడానికైన పోలీస్ శాఖ తమకు ఎల్లవేళలా సహకరిస్తుందని చెప్పారు. ప్రస్తుతం యువత డ్రగ్స్, గంజా, గుడుంబా లాంటి మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని సూచించారు.

## ఆదర్శ కమ్యూనిస్టు పోటు ప్రసాద్

సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు



**ప్రజాపక్షం/చింతకాని:** అమరజీవి పోటు ప్రసాద్ ఎంతో ఆదర్శవంతమైన కమ్యునిస్టు అని సిపిఐ జాతియ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. గురువారం చింతకాని మండలం బస్వాపురం గ్రామంలో జరిగిన పోటు ప్రసాద్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న చరిత్ర కలిగిన కుటుంబంలో పుట్టిన ప్రసాద్ ఖమ్మం జిల్లాకు వచ్చి విద్యార్థి నాయకుడిగా,కార్మిక నేతగా ఎదిగి సిపిఐ జిల్లా భాధ్యతలు నిర్వర్తిస్తూ ఆదర్శ కమ్యునిస్టు గా జీవించాడని కొనియాడారు. ఈనెల 8న ఖమ్మం లో జరగనున్న పోటు ప్రసాద్ సంస్మరణలో సభలో ప్ర తికార్యకర్త నాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స మితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి ,జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రా మాంజనేయులు,వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు,జిల్లా సమితి సభ్యులు మార్గం శ్రీను,శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు,నాయకులు బుర్రా అంజయ్య,ఆవుల నర్సింహారావు పాల్గొన్నారు.

## ధరణి ఆపరేటర్లా...వసూళ్ల ఆపరేటర్లా?

రిజిస్ట్రేషన్ చేస్తే డబ్బులు చెల్లించుకోవాల్సిందే

పెద్ద సార్ మిమ్మల్ని కలవమని అన్నారు

ఆ పెద్ద సారు ఎవరు?

**ప్రజాపక్షం/వైరా:** రెవెన్యూ శాఖలో రిజిస్ట్రేషన్లు కొంతమందికి కాసులు వరంగా మారాయి. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వ్యవసాయ భూములకు సంబంధించి గతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరిగేవి. అలా కాకుండా తహశీల్దార్ కార్యాలయంలోనే వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ధరణి పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కార్యక్రమం కొంతమందికి కాసులు వర్షాన్ని కురిపిస్తుంది. రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే కంప్యూటర్ ఆపరేటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి వద్ద నుండి డబ్బులు అడగడంతో పాటు పెద్ద సార్ మిమ్మల్ని కవలమని చెప్పారని, సరికొత్త దందా జోరుగా కొనసాగుతుంది. రిజిస్ట్రేషన్ అంటేనే రెవెన్యూ కార్యాలయాల్లో కాసులు వరంగా మారింది. కొంతమంది రిజిస్ట్రేన్ చేయించుకునే ముందు అధికారులను కలిసిన తర్వాతే ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకోవడం కూడా జరుగుతుంది అనే వాదన వినిపిస్తుంది. ముందుగానే అధికారులు కవలడం వెనక ఆంతర్యం ఏమిటి. ధరణి ఆపరేటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి వద్ద నుండి పెద్ద సార్‌కు ఎవరు. ఇటీవల కాలంలో ఖమ్మం జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న కొంతమంది వ్యాపారులు రియల్ వెంచర్ల విషయంలో ప్లాట్లు చేసి డిటిసిపి లేఔట్‌లు లేకుండానే విక్రయాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కుంటల్లో రిజిస్ట్రేషన్ చేయకుండా అమ్మిన ప్లాట్లను గజాల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇలా గజాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకునే ముందు కొంతమంది రియల్ వ్యాపారులు కలుస్తున్నారంట పెద్ద సార్ నుంచి సిగ్నల్ రాగానే ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ జరుగుతన్నాయి. స్లాల్ బుకింగ్ అయిన తర్వాత రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత కంప్యూటర్ రూమ్‌లో ఉన్న ధరణి ఆపరేటర్ నిముషాల్లో బయటకు వస్తాడు. వారి వద్ద నుంచి డబ్బులు తీసుకుంటారు. కొంతమంది లోపకారికంగా ముందే ఒప్పందాలు చేసుకొని ఉంటే పెద్ద సార్ పేరు చెప్పరు. అలాకాకుండా ఉంటే పెద్ద సారు, మిమ్మల్ని కలవమన్నారని చెబుతారు. అసలు ఈ పెద్ద సార్లు పాత్ర ఏంటి. రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఎందుకు డబ్బులు చెల్లించాలి. కొంతమంది ధరణి ఆపరేటర్లు ఎందుకు దందా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలువురు పెద్ద ఎత్తున రెవిన్యూ కార్యాలయంలో జరిగే ధరణి రిజిస్ట్రేషన్ పట్ల అటు ఆపరేటర్ల తీరుపై ఇటు అధికారులు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ధరణి రిజిస్ట్రేషన్‌ల పర్వంలో జరుగుతున్న దందాలపై దృష్టి సాధిస్తే అక్రమ వసూళ్లను అరికట్టవచ్చునని పలువురు ఆరోపిస్తున్నారు.

## సత్తుపల్లిలో సూక్ష్మ,చిన్న,మధ్య తరగతి పరిశ్రమలు ఏర్పాటు

* ఐటి,పరిశ్రమల శాఖామంత్రి శ్రీధర్ బాబు
* రైతులకు ఫుడ్‌పార్క్ ఎంతో ఉపయోగం
* వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల
* 75 సంవత్సరాల చరిత్రను తిరగరాసిన మీకు రుణపడి ఉంటా
* ఎంఎల్‌ఎ డా.మట్టా రాగమయి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి ప్రాంతంలో సూక్ష్మ,చిన్న,మధ్యతరగతి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు రాష్ట్ర ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ళ శ్రీదర్ బాబు. గురువారం మండల పరిధిలోని బుగ్గపాడు గ్రామంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి చేతులు మీదుగ శంఖుస్థాపన చేసుకున్న మెగా ఫుడ్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమం సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి అధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా రాష్ట్ర ఐటీ శాఖామాత్యులు దుద్దిళ్ళ శ్రీదర్ బాబు, వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావులు హాజరైనారు. రిబ్బన్ కట్ చేసి మోగా ఫుడ్ పార్క్‌ను ప్రారంభించారు. అనంతరం నూనె గింజల ఉత్పత్తి దారుల సహకార సమాఖ్య లిమిటెడ్ , తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం , కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు వారు ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాల్‌ను మంత్రులు, ఎంఎల్‌ఏ, కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సభాస్థలిపై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ళ శ్రీదర్ బాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా చైతన్యవంతమైన జిల్లా అన్నారు. రాజకీయంగా ,విద్యాపరంగా ఖమ్మం జిల్లా ముందుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నుండి నేటి తుమ్మల నాగేశ్వరరావు వరకు సత్తుపల్లి ప్రాంతాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. బుగ్గపాడు ఫుడ్ పార్క్ ఏర్పాటు కోసం ఆనాటి ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో భూమిని కేటాయించారని , ఆ తరువాత వచ్చిన కేసిఆర్ ప్రభుత్వం ఫుడ్‌పార్క్ పై నిర్లక్ష్యం వహించారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి అనంతరం ఫుడ్‌పార్క్‌లో మౌళిక వసతులు, పనులలో వేగం పెంచి నేడు ప్రారంభించుకోవటం సంతోషమన్నారు. రానున్న రోజులలో సత్తుపల్లి ప్రాంతంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాది అవకాశాలు కల్పిస్తామన్నారు. వ్యవసాయశాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫుడ్ పార్క్‌లో అదిక పరిశ్రమలు తీసుకువచ్చి ఈ ప్రాంత రైతులు పండించే జామ, కొబ్బరికాయ, ఆయిల్ ఫామ్, మొదలగు పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. మెగా ఫుడ్‌పార్క్‌లో మొత్తం 200 ఎకరాలకు పైగా అందుబాటులో ఉందని , దీనిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఫుడ్ పార్క్ పరిధిలో లక్ష ఎకరాల వరకు భూమి ఉందని , ఇక్కడ పండించే పంటలు ఆహార శుద్ధి పరిశ్రమకు ఉపయోగపడతాయన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 9వేల ఎకరాలలో ఆయిల ఫామ్ పంట సాగవుతుందన్నారు. ఈ సంవత్సరం 6వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా రెండు వేల ఎకరాలలో పండ్లు కూరగాయల పంట పెరిగే దిశగా పనిచేస్తున్నామన్నారు. ఎంఎల్ఏ డా,మట్టా రాగమయి దయానంద్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్న తరుణంలో మెగా ఫుడ్‌పార్క్ ను ప్రారంభించుకోవటం సంతోషంగా ఉందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో జలగం వెంగళరావు. జలగం ప్రసాదరావు, జలగం వెంకటరావు, తుమ్మల నాగేశ్వరరావు వంటి మహానీయులు ప్రాతినిధ్యం వహించారని, 75 సంవత్సరాల అనంతరం మహిళను ఆదరించి గెలిపించిన మీకు రుణపడి ఉంటానన్నారు. బుగ్గపాడు ఫుడ్ పార్క్‌లో ఉన్న సౌకర్యాలు హైద్రాబాద్‌లో కూడా లేవన్నారు. అనంతరం ఫుడ్ పార్క్‌లో పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామిక వేత్తలతో ఒప్పందాలు చేస్తూ భూ కేటాయింపులు జరిపారు. రూ.50 కోట్లతో 10 ఎకరాలలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్‌ను సన్‌బైట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, ఎకరంలో లక్ష్మి నారాయణ ట్రేడర్స్ ద్వారా సీరియల్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయటం జరిగింది. సుప్రీమ్ ప్రోడక్ట్స్, మోనాల్ గ్రాండ్ మార్ట్స్, సర్వ రాయల్ షుగర్స్ అండ్ సిహెచ్ వెంకటేశ్వరరావు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టిజిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీజిఐఐసి ఈడి పవన్‌కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజ య్ కుమార్, పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు. క మల్‌పాషా. మానుకోట ప్రసాద్, చల్లగుళ్ళ నర్సింహారా వు , పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ తదితరులు పాల్గొన్నా రు.



# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్





**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెడుతూ వారికి ప్రాధాన్యం ఇస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవాలను జగిత్యాల ఆర్టీసీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ జి.సునీత నిర్వహించగా ముఖ్యఅతిథిగా విప్ లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, ఆర్టీసీ పరిరక్షణకు, ప్రయాణికుల సౌకర్యానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి బస్ సర్వీస్ ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్, కౌన్సిలర్లు జగిత్యాల డిపో మేనేజర్ సునీత, కోరుట్ల డిపో మేనేజర్, మెట్పల్లి డిపో మేనేజర్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ కీలకపాత్ర పోషించాలి

రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్నా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యూత్ కాంగ్రెసు నాయకుల దేనని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల ఇందిరభవన్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తాటిపర్తి వినూత్నరెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షులు బీరం రాజేష్, జగిత్యాల అసెంబ్లీ అధ్యక్షులు నల్ల స్వామిరెడ్డి, జగిత్యాల పట్టణ అధ్యక్షులు తాటిపర్తి పరిక్షిత్‌రెడ్డి యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించగా వారిని విప్ లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పని చేసి పార్టీ పటిష్ఠతకు పాటుపడాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి తాటిపర్తి శోభారాణి, నాయకులు గాజంగి నందయ్య, చరిష్మారెడ్డి, బండ శంకర్, నక్క జీవన్, రఘువీర్‌గౌడ్, గుండా మధు, ఎన్న మధుకర్ రెడ్డి, కొండ్ర రామచంద్రారెడ్డి, కృష్ణహరి, జితేందర్ యాదవ్, బేతి శంకర్‌రెడ్డి, వేముల సుభాష్, మహేందర్ రెడ్డి, సుభాష్,పిప్పరి అనిత, నాగిరెడ్డి రజిత పాల్గొన్నారు.

## గడప గడపకూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు చేరవేయాలి

**ధర్మపురి :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తెలియజేయాలని విప్ లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గురువారం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎఐసిసి, రాష్ట్ర కాంగ్రెస్ ఆదేశానుసారం ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఎన్నికలు నిర్వహించుకున్నామని, ఎన్నికలలో విజేతలైన నేతలకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. భవిష్యత్‌లో వారి వారి సేవలను బట్టి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, రాందేని మొగిలి, జె.సుముఖ్, స్థంభంకాడి గణేష్, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు.

# దుర్వాసన పట్టించుకోరా?

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్‌టిసి అధికారులు

చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ ప్రధాన బస్టాండులో మురుగు కాలువలు తీయకపోవడంతో డ్రైనేజీ నుంచి తీవ్ర దుర్వాసన వస్తుందని, దీంతో ప్రయాణికులు అనారోగ్యాల పాలయ్యే ప్రమాదం ఉందని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు న్యాలపట్ల రాజులు ఆరోపించారు. గురువారం వారు స్థానికంగా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల క్రితం సెప్టిక్ ట్యాంకులు డ్రైనేజీలు బస్టాండులో నిర్మించారని, బస్టాండులోని హోటల్స్, లాడ్జిలలోని వ్యర్థ పదార్థాలు ఇందులోకి వదిలి వేయడంతో భరించలేని దుర్వాసన వస్తుందన్నారు. ఆర్టీసీలో షానిటేషన్ చేయడం కోసం ఒక ప్రత్యేక విభాగం ఉన్నప్పటికీ వారు ఏ మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రోజు వేలాది మంది వచ్చే బస్టాండులో మూతికి బట్ట కట్టుకుంటేనే వెళ్లే దుస్థితి నెలకొందని తెలిపారు. డ్రైనేజీలో బస్టాండులోని హోటల్ యజమానులు ఇష్టారీతిగా వ్యర్థ పదార్థాలు వేసి దుర్వాసనకు ప్రధాన కారణంగా మారుతున్నారని, వీరిపై చర్యలు తీసుకుని ఆర్టీసీ అధికారులు బస్టాండులో దుర్వాసన నివారించాలని డిమాండ్ చేశారు. రవాణాశాఖ మంత్రి ఉన్న సొంత జిల్లాలోనే బస్టాండు ఇంత దుర్వాసన వెదజల్లడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు బ్లీచింగ్ పౌడర్ చల్లి దుర్వాసనను అరికట్టుటకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను సురేందర్‌రెడ్డి, పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు కోరారు.

# సూపర్ స్పెషాలిటీ, క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు ఇంకెప్పుడు?

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** ప్రభుత్వాసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ విభాగం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ, క్రిటికల్ కేర్ వైద్యం లేకపోవడం మూలంగా రోగులు అత్యవసర సమయంలో సుదూర ప్రాంతాల నుంచి అత్యవసర చికిత్సలు సకాలంలో చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర చికిత్సకు ప్రభుత్వాసుపత్రికి వస్తున్న ప్రజలకు వైద్య సౌకర్యం లేకపోవడంతో హైదరాబాద్, వరంగల్‌లకు వైద్యం చేయించుకోవాలని వైద్యులు చెప్పడంతో వారు క్రిటికల్ పొజిషన్‌లో వాహనాల్లో వెళ్తున్న మార్గమధ్యంలోనే చాలా మంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో ఆసుపత్రికి వస్తున్నారని, ఉమ్మడి జిల్లాకు ప్రదాన కేంద్రమైన కరీంనగర్‌లో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ వైద్య సౌకర్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రేపు సిరిసిల్లలో బాలమల్లేష్, పోటు ప్రసాద్‌ల సంస్మరణ సభ

సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సిపిఐ కార్మిక భవనం సిరిసిల్లలో ఈ నెల 7న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌ల సంస్మరణ సభ జరుగుతుందని సిరిసిల్ల జిల్లా సిపిఐ కార్యదర్శి గుంటి వేణు తెలిపారు. గురువారం సిరిసిల్ల సిపిఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సభకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి హాజరవుతారన్నారు. విద్యార్థి, యువజన రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శిగా పనిచేసిన బాల మల్లేష్ రంగారెడ్డి జిల్లాలో వేలాది నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకుని నిలబడానికి అండగా నిలబడ్డ వ్యక్తి అన్నారు. సిపిఐ ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శి పోటుప్రసాద్ ప్రజల కోసమే పని చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఇద్దరిని స్మరించుకోవడానికి సిరిసిల్లలో సంస్మరణ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సభకు కమ్యూనిస్టు కార్యకర్తలు, నాయకులు హాజరవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారినా మధ్యాహ్న కార్మికుల జీతభత్యాలు పెరగవా?

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్




**ప్రజాపక్షం/ఇల్లంతకుంట:** ప్రభుత్వాలు మారుతున్నాయి తప్పా మధ్యాహ్నం భోజన కార్మికుల జీతభత్యాలు పెరగటం లేదని గురువారం ఇల్లంతకుంట మండలం తహసీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాల ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలో మధ్యా హ్నం భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మిడ్ డే మీల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రూ.పదివేల జీతం ఇవ్వాలన్నారు. నిత్యవసర సరుకుల ధరలు పెరిగాయని, బిల్లులు రాక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం అవట్లేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజవ్వ, జుబేదా, సంతోష, లత, వరలక్ష్మి, మంజుల, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

# పాత మున్సిపల్ భవనంలో తహసీల్ కార్యాలయం ఏర్పాటు

మంత్రికి సిపిఐ వినతి

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** ఇటీవల ఖాళీ చేయబడ్డ మున్సిపల్ భవనంలోకి తహసీల్ కార్యాలయాన్ని మార్చి ప్రజలకు అందుబాటులోకి తెవాలని సిపిఐ నాయకుల గడిపె మల్లేశ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, సిపిఐ నాయకుడు చాడ వెంకటరెడ్డికు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణంలో ఉండవలసిన రెవెన్యూ కార్యాలయం పట్టణానికి 5 కిలోమీటర్ల దూరం ఉన్న సమీకృత భవనంలోకి మార్చడంతో రెవెన్యూ సర్టిఫికెట్‌లు, రిజిష్ట్రేషన్ సంబంధించిన పత్రాలు, ప్రజలు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైన ప్రజల బాధలను దృష్టిలో పెట్టుకుని తహసీల్ కార్యాలయాన్ని వెంటనే పట్టణానికి మార్చాలని వారు మంత్రిని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకుల సంజీవరెడ్డి. మల్లారెడ్డి పాల్గొన్నారు.

# వృత్తి, నైపుణ్యతతో ఉద్యోగావకాశాలు

జిల్లా కలెక్టర్ మనుచౌదరి




**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** ప్రతి విద్యార్థి నైపుణ్య శిక్షణను పొంది ఉద్యోగాలు పొందాలని సిద్దిపేట జిలా కలెక్టర్ మనుచౌదరి విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో డిగ్రీ మరియు పాల్‌టెక్నిక్ కళాశాలలకు చెందిన విదార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు అదేశాల మేరకు పట్టణంలోని విద్యార్థులతో ముఖముఖి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలోని విద్యార్థులకు ఐటి ఉద్యోగాలు అందించాలనే సంకల్పంతోనే హైదరాబాద్ టి హబ్ లోగల సైన్స్‌హబ్ వారు హుస్నాబాద్ విద్యార్థులకు నైపుణ్యత శిక్షణ ఇప్పించి వారికి ఉద్యోగాలు ఇచ్చే ఒప్పందం కుదుర్చుకుందని అయన తెలిపారు. శిక్షకులు వంశీ, ధీరజ్‌లు అరు నెలల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతం అయితే జిల్లా మొత్తంలో ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కలిస్తామని పేర్కొన్నారు, ఈ లాంటి అవకాశాలను ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని కొరారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రామూర్తి, కళాశాల ప్రిన్సిపాల్లు బిక్షపతి, అశోక్ , సెల్‌క్టరల్ అధికారి రామస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా, శిశు సంరక్షణకు చర్యలు

జిల్లా సంక్షేమశాఖ అధికారి శారద

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా మహిళ శిశు సంక్షేమ అభివృద్ధి విభాగంలో ప్రజాపాలన విజయోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలను భాగస్వామ్యం చేసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా జిల్లా సంక్షేమశాఖ అధికారి శారద మాట్లాడుతూ ఈఏడాదిలో మహిళా, శిశు సంరక్షణకు తీసుకున్న చర్యలను వివరించారు. బాలమృతం అందించటం, పోషకాహారం లోపాన్ని తగ్గించటంలో విజయవంతమైనట్లు తెలిపారు. ఈసంవత్సరంలో పోషణ మాసం, పోషణ పకాడ, తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గర్భిణీలకు సీమాంతలు నిర్వహించటంతో పాటు, పిల్లలకు అన్నప్రాస వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.



# శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

జగిత్యాల జిల్లా ఎస్‌పి అశోక్‌కుమార్

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎస్ అశోక్ కుమార్ తెలిపారు, జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలం మల్లనపేట గ్రామంలో గల ప్రసిద్ధ పుణ్య క్షేత్రం మల్లికార్జునస్వామి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్‌పి అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 6 తేదీ నుండి డిసెంబర్ 29వ తేదీ వరకు జరుగు జాతర సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఎలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో, క్యూలైన్లలో, వాహనాల రాకపోకలు మొదలైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రత ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌పి శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఎస్‌పి వెంట డిఎసిపి రఘు చందర్, ఎస్ఐ చిర్ర సతీష్, మార్కెట్ చైర్మన్ భీమ సంతోష్, మల్లికార్జునస్వామి దేవాలయం ఇఒ విక్రం, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.



# వివేకానికి, విజ్ఞానానికి పుస్తకపఠనం





నవచేతన విజ్ఞాన సమితి సంచార పుస్తకాలయం ప్రారంభోత్సవంలో సిఐ నిరంజన్‌రెడ్డి

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** పుస్తక పఠనంతో వివేకం, విజ్ఞానం పెరుగుతుందని సిఐ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. నవచేతన విజ్ఞాన సమితి సంస్థ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నవచేతన విజ్ఞాన సమితి సంస్థ సంచార పుస్తకాలయాన్ని ప్రజాపక్షం దినపత్రిక మెట్‌పల్లి ఆర్‌సి రిపోర్టర్ మహమ్మద్ వసీం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ నిరంజన్‌రెడ్డి, టిడబ్ల్యుజె ఐజెయు మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గోరుమతుల నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు కోటగిరి దశరథం, కోరుట్ల నియోజకవర్గం సీనియర్ పాత్రికేయులు అలలా శంకర్, షౌకత్ అలీతో కలిసి నవచేతన విజ్ఞాన సమితి సంచార పుస్తకాలయాన్ని సిఐ ప్రారంభించారు, ఈ సందర్భంగా సిఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల ప్రపంచానికి సంబంధించిన కొత్త విషయాలు తెలుసుకోవచ్చని, వ్యక్తిత్వ వికాసానికి, జ్ఞానానికి సంబంధించి, చైతన్యానికి మూలాధారం ఒక పుస్తకమే అన్నారు. ప్రతీఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని కోరారు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గోరుమతుల నరేందర్ మాట్లాడుతూ ప్రజలు సెల్‌ఫోన్ మోజులో ప్రజలు పుస్తకాలు చదవడం మానేశారన్నారు. పుస్తకాలు చదవడంతో మనోధైర్యం లభిస్తుందన్నారు, సీనియర్ రిపోర్టర్ అలలా శంకర్ మాట్లాడుతూ పుస్తకం ప్రజల విజ్ఞానానికి ఉపయోగం పడుతుందన్నారు. దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకునే ఇబ్బంది కలగకుండా మె పల్లి పట్టణంలో మనకు కావాల్సిన పుస్తకాలను అందిస్తున్నందుకు నవచేతన విజ్ఞాన సమితికి అభినందనలు తెలిపారు. నవచేతన విజ్ఞాన సమితి సంచార పుస్తకాలయంలో విజ్ఞానం, వినోదం, సైన్స్, సాహిత్యం, బాలల కథలు, నవలలు, గణితం, ఆధ్యాత్మికం, పర్సనాలిటీ, సాంకేతికత, సామాజిక శాఖలకు చెందిన పుస్తకాలు పిల్లలకు, పెద్దలకు ప్రతీ ఒక్కరికీ ఎంతగానో విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు లభిస్తున్నాయి, ఈ నెల డిసెంబర్ 5 నుండి 8 వరకు మెట్‌పల్లి పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు అందరూ వినియెగించు కోవాలని ఆయన కోరారు, కార్యక్రమంలో ఉర్దూ పేపర్ రిపోర్టర్ మహమ్మద్ షాహిద్, భాస్కర్, అంకతి భరత్, టియుడబ్ల్యుజె ఐజెయు జిల్లా సంయుక్త కార్యదర్శి దాసం కిషన్, మెట్‌పల్లి ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా సంయుక్త కార్యదర్శి తరి రాజశేఖర్, ఆర్గనైజేషన్ కార్యదర్శి జోరిగే శ్రీనివాస్, గట్టి పెల్లి రాజశేఖర్, అబిద్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# నిధుల కేటాయింపుల్లో సర్కారు వివక్ష

ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**ప్రజాపక్షం/కొత్తపల్లిః** కరీంనగర్ జిల్లాకు నిధుల కేటాయింపుల్లో కాంగ్రెస్ సర్కారు వివక్ష చూపుతుందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కొత్తపెల్లి మండల కేంద్రంలో అమృత్ పథకంలో భాగంగా కొత్తపల్లిలో నూతనంగా నిర్మించే వాటర్ ట్యాంకు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ జిల్లాకు నిధులు తేవడంలో మంత్రులు విఫలమయ్యారని ఆరోపించారు. నిధుల సాధన కోసం త్వరలోనే బిఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. సిఎంగా కెసిఆర్ ఉన్నప్పుడు కరీంనగర్‌లో ప్రతి రోజూ తాగు సాగు నీరు సరఫరా చేశామన్నారు. 24 గంటల తాగునీరు కోసం చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం హెల్త్ సబ్ సెంటర్లకు నిధులు ఇవ్వకపోవడంతో విద్యుత్ అధికారులు కరెంటు కట్ చేస్తున్నారని, ప్రభుత్వం కరెంటు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ రుద్రరాజు, వైస్ చైర్మన్ జేరిపోతుల అంజలి, కౌన్సిలర్ వాసాల రమేష్, జేరిపోతుల మొండయ్య, నాజియాబాబా, మాజీ జడ్పి కో ఆప్షన్ సభ్యులు జమీలొద్దీన్, వేముల కవిత చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా ఉంటాం

చొప్పదండి ఎమ్మెల్యే సత్యం

**ప్రజాపక్షం/చొప్పదండిః** చొప్పదండి మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన గాలిపెల్లి భక్కయ్య అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. అదే విధంగా పందిళ్ల రాజయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, నాయకులు పెరుమాండ్ల గంగన్న, పురం రాజేశం, గుర్రం రమేష్ గౌడ్, కడారి శంకర్, మావురపు రాములు, పెద్ది రాజేందర్, బొడిగె శ్రీనివాస్ పాల్గొన్నారు.



**రామడుగుః** యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో రామడుగు మండల అధ్యక్షుడిగా అనుపురం పరశురాం గౌడ్ గెలుపొందారు. ఈ సంధర్భంగా పరశురాం గౌడ్ ఎమ్మెల్యే సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే సత్యం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన పరశురాంగౌడ్‌కు అభినందనలు తెలిపి త్కరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పంజాల శ్రీనివాస్‌గౌడ్, మామిడి దిలీప్, జవ్వాజి అజయ్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డుల మంజూరుకు కృషి

ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులతో పాటు వారికి కనీస వేతనం అమలుకు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ డా.వి.నరేందర్‌రెడ్డి వెల్లడించారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో పలువురు పట్టభద్రులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను రూపుమాపుతానని, ప్రభుత్వరంగ సంస్థలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కృషిచేసి పట్టభద్రులకు అండగా ఉంటానన్నారు. ప్రైవేట్ డిగ్రీ, పిజి కళాశాలల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల గాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారికి ప్రతి 3 నెలలకు ఒక సారి విడుదలయ్యే విధంగా వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ప్రైవేట్ స్కూల్, కళాశాలల పర్మిషన్ సమయంలో కొన్ని కఠిన నిబంధనలు ఉన్నాయని, వాటిని సులభతరం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ప్రభుత్వం నుంచి వచ్చే వేతనాన్ని నిరుపేద విద్యార్థులకు, పట్టభద్రుల సంక్షేమానికి ఒక నిధి ఏర్పాటు చేసి వారి అవసరాల కోసం ఖర్చు చేస్తానన్నారు.

# రూ.340 కోట్లతో రామగుండంలో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ వెల్లడి

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరినదిపై 4వ అతిపెద్దదైన పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు సాగు, తాగునీరు అందిస్తూ తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయగా మారిందని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లా మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంలో రూ.340 కోట్ల అభివృద్ధి పనులు నియోజకవర్గంలో జరుగుతున్నాయన్నారు. బ్రహ్మణపల్లి వద్ద నిర్మాణం పూర్తి చేసుకున్న రామగుండంఎల్లంపల్లిబండలవాగు ఎత్తిపోతలతో అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో 19 వేల ఎకరాల భూములకు సాగునీటిని త్వరలో అందించనున్నట్లు తెలిపారు. పాలకుర్తిఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మరో 15 వేల ఎకరాల భూములకు ఎల్లంపల్లి నీటిని అందిస్తామన్నారు. దీనికి సంబంధించి నిధులు కూడ మంజూరు చేశారని సర్వే కూడా జరుగుతున్నట్లు తెలిపారు. రామగుండంలో సింగరేణి జెన్‌కో ఆధ్వర్యంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి డీపీఆర్ రూపొందిస్తున్నట్లు త్వరలో సీఎంతో శంకుస్థాపన చేయిస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.280 కోట్లతో అభివృద్ధి పనులు చేపడ్తున్నామని ఇదిగాక బుధవారం పెద్దపల్లిలో రహదారులు, సర్వీసు రోడ్లు, రామగుండం అంతర్గాం పైవంతెన నిర్మాణానికి అదనంగా రూ.60.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రామగుండం గురుకుల పాఠశాల సమీపాన 27 ఎకరాల్లో రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైంది. రూ.26 కోట్లతో నర్సింగ్ కళాశాలను కూడ ప్రారంభించుకున్నట్లు తెలిపారు. త్వరలో సింగరేణి ఆధ్వర్యంలో రూ.15 కోట్లతో గోదావరిఖని చౌరస్తా వద్ద కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్సు నిర్మించనున్నట్లు, పనుల టెండర్లు కూడ పూర్తయ్యాయని, పది రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నగర మేయర్ బి.అనిల్‌కుమార్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, దీటి బాలరాజు పాల్గొన్నారు.



# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ





ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతనిధి: జిల్లాలో ఇందిరా క్రాంతి మహిళా శక్తి పథకం కింద నిర్వహించిన అనేక కార్యక్రమాల ద్వారా మహిళలను కోటేశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ ,సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మాత్యులు దామోదర్ రాజనర్సింహ్మ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలు 2024 ఇందిరా క్రాంతి పథకం మహిళా శక్తి లో భాగంగా గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా క్యాంటీన్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ రోజు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మాత్యులు దామోదర్ రాజనర్సింహ్మ పుట్టిన రోజు సందర్భంగా మంత్రికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా శక్తి పథకం రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలకు సమాజ ఆర్థిక ప్రగతికి ప్రధాన మైనదని మంత్రి పేర్కొన్నారు . ఇందిరా క్రాంతి పథకం మహిళల ఆర్థిక స్వలాంబనాన్ని పెంచి స్వయం ఉపాది అవకాశాలను సృష్టించడమే ప్రధాన ఉద్యేశ్యం అని మహిళా శక్తి పథకం కింది మహిళా సంఘాలకు మాత్రమే ఈ క్యాంటీన్ నిర్వహణ భాధ్యతలు అప్పగించబడిందన్నారు. మహిళలు సాధికారత ఆర్థిక స్వాలంబన పెంపొందించాలని అన్నారు. ఈ క్యాంటిన్ మహిళా సంఘాలకు ఆర్థికంగా బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంకా ఈ మహిళా క్యాంటిన్లు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. సమాజంలో మహిళా శక్తిని ప్రోత్సహించే దిశగా ఈ తరహ కార్యక్రమాలు విజయవంతం కావాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు ఆత్మ స్థైర్యం ,ఆత్మవిశ్వాసం పెంపొందించడం తద్వార కుటుంబాల స్థితి మెరుగవుతాయని మంత్రి అన్నారు. ఈ పథకం ద్వారా స్వయం ఉపాది అవకాశాలను సృష్టించుకునే మహిళలు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పరుచుకోగలుగుతారని మంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ కలెక్టరేట్ క్యాంటీన్ ప్రారంభించడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగువుతాయని క్యాంటీన్ వంటి ప్రాజెక్టులు గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఆర్థిక సహాయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ తెలిపారు. వివిధ రంగాల్లో మహిళలు స్వయం ఉపాది అవకాశాలను సృష్టించుకుని మరింత ముందుకు రావాలని కలెక్టర్ అన్నారు అనంతరం మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాలకు మొత్తం రూ. 650 కోట్ల విలువైన బ్యాంకు లింకేజ్ చెక్కులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ మాధురి పిడి జ్యోతి సంబందిత శాఖల అధికారులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఎసిబి అవగాహన ర్యాలీ



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల సందర్భంగా ఎసిబి అవగాహన ర్యాలీని జిల్లా ఇన్‌చార్జి సీపీ సీహెచ్. సింధూ శర్మ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల సందర్భంగా గురువారం ఉదయం డిఎస్పీ, ఎసిబి నిజామాబాద్ ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులు, ఉద్యోగులచే నిజామాబాద్ కలెక్టరేట్ గ్రౌండ్ నుండి నెహ్రూపార్కు వరకు ఏసిబి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నెహ్రూ పార్కు వద్ద మానవ హారం నిర్వహించి అవినీతి నిర్మూలన కోసం ర్యాలీలో పాల్గొన్న వారిచే ప్రతిజ్ఞ చేయించటం జరిగింది. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ బి.కోటేశ్వర్‌రావు, ట్రేనీ ఐపిఎస్ సాయికుమార్, ఎసిబి డీఎస్పీ శేఖర్‌గౌడ్, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థ అభివృద్ధిలో ప్రతీ ఉద్యోగి భాగస్వామ్యం



ప్రజాపక్షం/శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలని సింగరేణి సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం కార్మికులను కోరారు. ఏరియాలోని ఎస్ఆర్‌పి 3 గనిని బుధవారం రాత్రి సమయం 11:25కు మూడవ బదిలీలో ఆయనతో పాటు, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ సుభాని, జనరల్ మేనేజర్ ఎల్ వి సూర్యనారాయణ ఎస్ఆర్‌పి 3 గనిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి అంకితభావంతో కేటాయించిన 8 గంటల సమయంలో నిబద్ధత, రక్షణ సూత్రాలను పాటిస్తూ పనిచేయాలని, సంస్థ అభివృద్ధిలో ప్రతి ఒక్క ఉద్యోగి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన ఉద్యోగుల వద్దకు వెళ్లి మాట్లాడి, కరచాలనం చేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం సత్యనారాయణ, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ బాజిసైదా, గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, ఎఐటియుసి నాయకులు వీరభద్రయ్య, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజలను భయబ్రాంతులకు గురిచేయవద్దు



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: జిల్లాలో పులుల సంచారం నేపథ్యంలో స్పష్టమైన సమాచారాన్ని మాత్రమే ప్రజలకు తెలియజేసేందుకు కృషి చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ తెలిపారు. తప్పుడు పుకార్లు, వార్తలు ప్రజలకు వ్యాప్తి చేయడం జరుగుతున్నట్లు గమనించడం జరుగుతుందన్నారు. తప్పుడు ప్రచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఇలా భయాందోళన సృష్టించడం సరికాదన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చిన సమాచారాన్ని ప్రచురించే ముందు అటవీ శాఖ అధికారులతో ధ్రువీకరణ చేసుకోవాలని కోరారు. తప్పుడు వార్తలు ప్రచారం చేయడం కాకుండా సామాజిక మాధ్యమాల్లో సర్కులేట్ చేసే వారిపై శాఖ పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శ..



ప్రజాపక్షం/తలమడుగు: తలమడుగు మండలం బరంపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు జావీద్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వీరి వెంట బిఆర్ఎస్ నాయకులు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి,మాదూరి మల్లేష్,మాదూరి రమాకాంత్,భీంపూర్ మండల ఉపాధ్యక్షుడు లస్మన్న తదితరులు ఉన్నారు.

## జిల్లాకు ప్రొబిషనరీ ఐపిఎస్ సాయికిరణ్



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి జిల్లాకు ప్రొబెషనరీ నిమిత్తం వచ్చిన సాయికిరణ్ పత్తిపాక డిసెంబర్ 3న రావటం జరిగిందని గురువారం జిల్లా ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ తెలిపారు. 76 ఆర్ఆర్ (2023) బ్యాచ్‌కు చెందిన తాను వంరగల్ జిల్లా వాస్తవ్యులని బీఈ సివిల్ ఇంజనీర్, ఎంబిఎ విద్యాభ్యాసం చేశారని, 29 వారాల పాటు శిక్షణ నిమిత్తం రావటం జరిగిందన్నారు.

## బైక్ ర్యాలీకి అనుమతి ఇవ్వక పోవడంతో బిజెపి శ్రేణుల రాస్తారోకో..

ప్రభుత్వ తీరుపై మండి పడ్డ ఎమ్మెల్యే పవార్



ప్రజాపక్షం/బైంసా: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై బైంసాలో బిజెపి శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహిస్తామంటే ప్రభుత్వం,పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో గురువారం బిజెపి నాయకులు,కార్యకర్తలు పెద్ద మొత్తంలో రాస్తారోకో చేపట్టి రహదారిపై బైఠాయించారు.ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆందోళనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.ఎమ్మెల్యే ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.ప్రజాస్వామ్యంలో ఉన్నామా,లేదా ఇంకా నిజాం పాలన కొనిసాగుతున్నామా అనే ముఖ్యమంత్రి ని ప్రశ్నించారు.ఉదయం నుండి మండలాల వారీగా బిజెపి శ్రేణులు ర్యాలీ తీయడానికి ప్రయత్నిస్తే పోలీసులు ఫోన్ లు చేసి అడ్డుకోవడం సరికాదన్నారు.ఈ విషయమై అసెంబ్లీలో మాట్లాడతామన్నారు.అనంతరం ప్రొగ్రాం నియోజకవర్గ కన్వీనర్ రాజేష్ బాబు అధికారుల తీరుపై మండిపడ్డారు.రాస్తారోకోలో బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద మొత్తంలో పాల్గొనారు.

## రైతుల ఖాతాలలో రూ. 10 కోట్ల 80 లక్షలు జమ



ప్రజాపక్షం/మంచిర్యాల: ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 315 వరి ధాన్యం కొనుగోలు ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి 10 కోట్ల 80 లక్షల రూపాయల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో నమోదు చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 315 కొనుగోలు కేంద్రాల ద్వారా 11 వేల 635 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత 673 మంది రైతుల ఖాతాలలో 10కోట్ల 80 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 13 రైస్ మిల్లులకు సిఎంఆర్ అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు.

## ఆర్‌టిసి కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్ రావు



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్: ఆర్‌టిసి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మంచిర్యాల ఎంఎల్ఎ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం మహిళలకు ఎంతో ఆర్థిక భరోసా ఇచ్చిందని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆర్‌టిసి సంస్థ ఆస్తులను అమ్మే వరకు వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ప్రజా పాలనలో ఆర్‌టిసి లాభాల బాట పట్టిందని, ఒక్క మంచిర్యాల ఆర్‌టిసి డిపో 8 కోట్ల లాభాలను ఆర్థించడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఆర్‌టిసి యాజమాన్యం కార్మికులు సమిష్టి కృషితో ప్రయాణికులను తమ గమ్యస్థానాలు చేర్చడంలో కృషి చేస్తున్నారని వారికి నా అభినందనలు తెలియజేస్తున్నానని తెలిపారు. మహిళలు ఆర్థికంగా లాభపడితేనే కుటుంబాలు బాగుంటాయని దానిని నిజం చేసింది ఆర్‌టిసి కార్మికులేనని స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణంలో కోటి 30 లక్షల మంది మహిళలు సద్వినియోగం చేసుకోవడం సంతోషంగా ఉందని, ఆర్‌టిసి కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని త్వరలోనే వారికి జీతాలు పెంచి వచ్చిన లాభాల్లో వాటా ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మికులు, మెకానికులు పాల్గొన్నారు.

## మహాసభల గోడప్రతులు ఆవిష్కరణ




ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: జిల్లా మహాసభను జయప్రదం చేయండని జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి అన్నారు. గురువారం ఎఐటియుసి కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రెండవ జిల్లా మహాసభ పత్రిక గోడప్రతులు ఆవిష్కరించారు. అందులో భాగంగా రెండు సంవత్సరాల జరిగే ప్రణాళిక కార్యక్రమాలపై చర్చించుట అదేవిధంగా గతంలో జరిగిన కార్యక్రమాలపై ఈ సమస్యలపై పోరాటం చేయటానికి కావల్సిన ఉద్యమం అదేవిధంగా ప్రభుత్వాలకు మా సమస్యలపై కార్యక్రమాలు రచించుటపై కూడా ఈ సమావేశంలో చర్చించామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని పది వేల రూపాయలు ఇవ్వాలని మాట నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. లేనియెడల ఆందోళన చేస్తామన్నారు. సమావేశానికి జిల్లా మహాసభ జిల్లావ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ కార్మికులందరూ తరలిరావలని కోరారు. సమావేశంలో హన్మాండ్లు, నర్సింగ్‌రావు, సాయిలత, లింగవ్వ పాల్గొన్నారు.

## విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలి



ప్రజాపక్షం/ఇచ్చోడ: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలనీ కోరుతూ బోథ్ నియోజక వర్గం వీఆర్ఏ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యం లో గురువారం నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడారు. గత ప్రభుత్వం 2020 సెప్టెంబర్ 9 న అసెంబ్లీలో వీఆర్ఏలకు పే స్కేల్ , వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించిందని పేర్కొన్నారు. జీవో నంబర్ 81, 85 ప్రకారం వీఆర్ఏ వారసులకు ఉద్యా గాలు వస్తాయనే ఆశతో గత పదహారు నెలలుగా వేయి కళ్లతో ఎదురు చూస్తున్నామని వారు తెలిపారు. ఈ నెలలో జరుగబోయే అసెంబ్లీ సమావేశాల్లో వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలనీ వారు ఎమ్మెల్యేతో పేర్కొ న్నారు. అసెంబ్లీలో ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వీఆర్ఏలు దోనిపెల్లి రమేశ్, పి. శ్రీనివాస్, ఎస్కే సల్మాన్, జహీరొద్దీన్, విజయ్, భీముడు తధితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమమే ధ్యేయంగా, మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, ఆర్టీసీ మహాలక్ష్మి పథకం మహిళల మదిని చూరగొన్న పథకమని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం మెదక్ పట్టణంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల వేడుకలను డిసెంబర్ 1 నుండి 9 వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఐదో రోజులో భాగంగా టిఎస్ఆర్టిసి ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకం అమలుపై కార్యక్రమం నిర్వహించారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా మెదక్ కొత్త బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ మహాలక్ష్మి కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఆర్టీసీ డీఎం సురేఖలతో కలిసి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. మహాలక్ష్మి కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులలో మహిళలు ఆధార్ కార్డు ద్వారా జీరో టికెట్ కొనుగోలు చేసి 01 కోటి 60 లక్షలు మంది ఉచిత ప్రయాణం చేసి 53 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వానికి సంవత్సర కాలంలో 3, వేల 856 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది అన్నారు. ఆర్టీసీకి భారం అయినప్పటికీ మహిళలను గమ్యస్థానాలు చేర్చడంలో ఆర్టీసీ సిబ్బంది సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆర్టీసీ పల్లె వెలుగులు, ఎక్సప్రెస్ లలోనే ఉచిత ప్రయాణం కాకుండా టికెట్ కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత ఉన్నవారు, ఉద్యోగులు, డీలక్స్ బస్సులలో ప్రయాణించి ఆర్టీసీ సంస్థ మనుగడకు చేదోడినివ్వాలని చెప్పారు. త్వరలో మెదక్ జిల్లాకు పర్యావరణ రహిత ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని శుభ పరిణామంగా పేర్కొన్నారు. అంతకు ముందు డీలక్స్ బస్సులలో ప్రయాణించి లక్కీ డిప్ లో గెలుపొందిన మహిళలకు ముఖ్య అతిథులు శాలువాలు ఫ్రీ గిఫ్ట్ లతో సన్మానించారు. ఫుట్ బోర్డు ప్రయాణం ప్రమాదకరం, ఆర్టీసీ ప్రయాణం సురక్షితం శుభప్రదం అనే నినాదంతో ఆర్టీసీ తయారుచేసిన కరపత్రాలను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మామిల్ల ఆంజనేయులు, ఆర్టిసి యూనియన్ సభ్యులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటి విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన



ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి: బాసర ఐఐఐటి విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి అధికారులను ఆదేశించారు. గురువారం బాసర ఐఐఐటీ ని విద్యా కమిషన్ చైర్మన్ సందర్శించి విద్యార్థులు, అధికారులతో కలిసి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమైన అంశాలను చర్చించారు. విద్యా వ్యవస్థలో ఎదురవుతున్న సమస్యలను, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను వివరంగా చర్చించారు. విద్యతో పాటు మెరుగైన వసతి, సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణ, క్యాంపస్ వాతావరణం, బోధన నాణ్యత, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని అన్నారు. వంటగదిలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. క్లాస్ రూమ్ లో విద్యార్థులకు అందుబాటులో ఉండే సదుపాయాలు, ఫర్నిచర్ స్థితి, బోధన సామగ్రి, సాంకేతిక వనరుల అందుబాటులో ఉంచాలని సూచించారు. మ్యూజిక్, జిమ్, బ్యాడ్మింటన్ కోర్టు, సందర్శించి భద్రతా చర్యలు, సీసీటీవీ, సెక్యూరిటీ, మంచినీటి సరఫరా పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాలలో విద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ గోవర్ధన్, ఐఎఫ్‌టి మాజీ డైరెక్టర్ మురళీదర్శన్, కార్యాలయ పర్యవేక్షకులు రణధీర్ సాగి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు గిరిజన సంక్షేమ శాఖల అధికారులు అంబాజీ, మోహన్ సింగ్, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు, పవన్ చంద్ర, శ్రీకాంత్, అధికారులు, సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబలై యాప్‌ను సిఎం రేవంత్‌రెడ్డి గురువారం ట్రా సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కేశవ రావు, షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమార్, చిన్నారెడ్డిలతో కలిసి లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం ద్వారా వీక్షించారు. 22500 కోట్లను వెచ్చిస్తూ తొలి విడతగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నామని సిఎం వెల్లడించారు. నిరుపేద మహిళలు, వితంతువులు, దివ్యాంగులు వ్యవసాయ కూలీలు ట్రాన్స్‌జెండర్లకు గిరిజన, దళిత కుటుంబాల వారికి ఇళ్ల మంజూరీలో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేసేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సర్వే యాప్ ద్వారా ఎంపిక చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రేనీ కలెక్టర్ సంకేత్‌కుమార్ పాల్గొన్నారు.

# పల్లె గుండెల్లో కుల దండనల దడ..!

**కులాంతర వివాహాలను వ్యతిరేకిస్తున్న కుల పెద్దలు**

**బహిష్కరణ, జరిమానాలతో వేధింపులు..!**

**సామాజిక ఐక్యత కోసం ప్రభుత్వ ప్రోత్సాహకాలు**



ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి : సాంకేతికంగా అభివృద్ధి చెందిన, చంద్రుని మీద అడుగు పెట్టిన.. దేశంలో కుల, మత ప్రాంతీయ వర్గ భేదాలను మాత్రం నిర్మూలించలేకపోతున్నామనేది పచ్చి నిజం. కుల పరువు కోసం కన్న బిడ్డలను సైతం లెక్కచేయక హతమారుస్తున్న ఘటనలు సైతం నిత్యం ఎక్కడో ఒక్క చోట మనం చూస్తూనే వున్నాం. ఇది గ్రామీణ ప్రాంతాలలో ఇంకా అధికంగా వుంది. అంతేకాకుండా గ్రామాల్లో కుల సంఘాల, కుల పెద్దల తీరు మరీ దారుణంగా వుంటుంది. గ్రామాల్లోని యువత కులాంతర వివాహాలు చేసుకుంటే వారి కుటుంబాన్ని వెలేయడం, వారికి జరిమాన విధించి తీర్మానాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఇటీవల కాలంలో మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ దళిత యువకుడు పెద్దపెల్లి జిల్లాకు చెందిన బిసి సామాజిక వర్గానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆ గ్రామ కుల పెద్దలు మహిళా కుటుంబాన్ని ఆరు నెలల పాటు కుల బహిష్కరణ విధించడమే కాకుండా రూ. 50 వేల జరిమాన విధించి గ్రామాల్లో జరిగే శుభ, అశుభకార్యాలకు వారిని, వారి కుటుంబాన్ని పిలవద్దు అంటూ హుకుం జారీ చేసినట్లు సమాచారం.

**దండుగలు... బహిష్కరణ...**

యువత కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుంటే ఆ గ్రామంలోని కుల పెద్దలు పంచాయితీ పెట్టి సదరు కుటుంబాన్ని కుల బహిష్కరణ చేయడం, అది చాలదు అన్నట్టుగా వారికి జరిమానాను సైతం విధిస్తూ వారి పెద్దరికాన్ని చాటుతున్నారు. అభివృద్ధి చెందినా అనాగరిక నియమాలు అనుసరిస్తూ సమాజంలో కుల వ్యవస్థను బలపరుస్తున్నారు. ఇది నేటి సమాజంలో అమానుషకరమైన విషయం అయినప్పటికీ గ్రామీణా ప్రాంతాల్లో ఈ విషయంలో గ్రామ పెద్దలు చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

**కులాంతర వివాహాలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు..**

కులాంతర వివాహాలను పోత్సహించేందుకు సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వం ఇటీవల డాక్టర్ బిఆర్. అంబేద్కర్ యోజన పథకం ద్వార సామాజిక ఐక్యత కోసం అనేక చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా కులాంతర వివాహం చేసుకున్న వారిలో వధువు లేదా వరుడు దళితులుగా ఉంటే ప్రభుత్వం రూ.2.5 లక్షల సాయం అందజేస్తూ వివాహం చేసుకున్న వారి జీవితం ప్రారంభ దశలో స్థిరపడేందుకు కృషి చేస్తుంది. కానీ ఇది ప్రజల్లో ముఖ్యంగా గ్రామీణా ప్రాంతాల్లోని ప్రజల్లోకి తీసుకెళ్ళలేకపోయారు. ఇప్పటికైన స్థానిక అధికారులు, జిల్లా యంత్రాంగం గ్రామాల్లో పెట్రేగిపోతున్న కుల వ్యవస్థను, కుల సంఘాల, కుల పెద్దల ఆగడాలను అరికట్టేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే విధంగా, సామాజిక ఐక్యత పెంపొందించే విధంగా అవగాహన సదస్సులు, కఠిన నిబంధనలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్రీడ

# 6 ఏళ్ల తర్వాత మిడిలార్డర్‌లో రోహిత్!



ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో శుభారంభం చేసిన టీమిండియా.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి అడిలైడ్ వేదికగా ప్రారంభం కానున్న పింక్ బాల్ టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్ట్‌కు దూరమైన రోహిత్ శర్మ.. పింక్ బాల్ టెస్ట్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అయితే రోహిత్ శర్మ గైర్హాజరీలో ఓపెనర్‌గా ఆడిన కేఎల్ రాహుల్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. దాంతో అతన్నే ఓపెనర్‌గా కొనసాగించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. రాహుల్ ఓపెనర్‌గా ఆడనుండటంతో రోహిత్ శర్మ మిడిలార్డర్‌లో ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కెరీర్ ఆరంభంలో మిడిలార్డర్‌లో ఆడిన రోహిత్ శర్మ.. మళ్లీ 6 ఏళ్ల తర్వాత అదే స్థానంలో బరిలోకి దిగనున్నాడు. దాంతో మిడిలార్డర్‌లో రోహిత్ శర్మ గణంకాలు ఎలా ఉన్నాయనే ఆతృత అభిమానుల్లో నెలకొంది. 2018లో చివరిసారిగా మిడిలార్డర్‌లో ఆడిన రోహిత్ శర్మ.. ఆ తర్వాత ఓపెనర్‌గా బరిలోకి దిగి అసాధారణ ప్రదర్శనతో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఇన్నాళ్లకు మళ్లీ రోహిత్ మిడిలార్డర్‌లో ఆడుతుండటంతో అతని ఆట ఎలా ఉంటుందోననే అంచనాలు పెరిగిపోయాయి. ఇప్పటి వరకు రోహిత్ శర్మ మిడిలార్డర్‌లో 30 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. మూడో స్థానంలో 4 మ్యాచ్‌లు ఆడిన రోహిత్.. కేవలం ఒకే ఒక్క హాఫ్ సెంచరీ నమోదు చేసి 107 పరుగులే చేశాడు. నాలుగో స్థానంలో ఒకే ఒక్క మ్యాచ్ ఆడిన రోహిత్ 4 పరుగులే చేశాడు. ఐదో స్థానంలో 9 మ్యాచ్‌లు ఆడిన రోహిత్.. 3 హాఫ్ సెంచరీలతో 437 రన్స్ కొట్టాడు. ఆరో స్థానంలో 16 మ్యాచ్‌లు ఆడిన రోహిత్.. 3 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలతో 1037 రన్స్ చేశాడు. మిడిలార్డర్‌లో రోహిత్ నాలుగు సార్లు డకౌటయ్యాడు. పింక్ బాల్ టెస్ట్‌లోనూ రోహిత్ శర్మ 6వ స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. రోహిత్ 6వ స్థానంలో బ్యాటింగ్ చేస్తేనే.. నాథన్ లయన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటాడని భావిస్తున్నారు.

## చరిత్ర సృష్టించిన 'సన్‌రైజర్స్' హైదరాబాద్ బ్యాటర్..




టీమిండియా యువ ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. టీ20ల్లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్‌కు సారథ్యం వహిస్తున్న అభిషేక్ శర్మ.. మేఘాలయతో గురువారం జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 11 సిక్సర్లతో వీరవిహారం చేశాడు. 28 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. తద్వారా టీ20ల్లో భారత్ తరపున అత్యంత వేగంగా సెంచరీ బాదిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. భారత్ తరపున గుజరాత్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ కూడా 28 బంతుల్లోనే శతకాన్ని అందుకున్నాడు. అతను కూడా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనే ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో 11 సిక్సర్లు బాదిన అభిషేక్ శర్మ.. టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉన్న అత్యధిక సిక్స్‌ల రికార్డ్‌ను అధిగమించాడు.ఈ ఏడాది అభిషేక్ శర్మ 38 టీ20 ఇన్నింగ్స్‌లు ఆడి 87 సిక్సర్లు బాదాడు. రెండేళ్ల క్రితం 2022లో సూర్యకుమార్ యాదవ్ 41 ఇన్నింగ్స్‌ల్లో 85 సిక్సర్లు బాదాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన మేఘాలయ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 142 పరుగులు చేసింది. మేఘాలయ ఇన్నింగ్స్‌లో అర్పిత్ భటేవారా(31) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం పంజాబ్.. అభిషేక్ శర్మ విధ్వంసకర శతకంతో 9.3 ఓవర్లలోనే విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

## 100 పరుగులకే ఆలౌట్

### తొలి వన్డేలో మహిళా భారత జట్టు ఓటమి!




ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత మహిళా జట్టు పరాజయం చూసింది. ఈ పోరులో ఆతిథ్య ఆస్ట్రేలియా, భారత మహిళా జట్టును 5 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమ్ ఇండియా 100 పరుగులకే ఆలౌట్ అయింది. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా కూడా తడబాటకు గురైంది. లక్ష్యం 101 పరుగులే కావడం వల్ల వికెట్లు పడినా కూడా ఆస్ట్రేలియా పెద్దగా ఇబ్బంది పడలేదు. కేవలం 16.2 ఓవర్లలోనే ఐదు వికెట్లను కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఓపెనర్లు జార్జియా వోల్ (46; 42 బంతులు 6 ఫోర్లు, 1 సిక్స్), ఫోబ్ లిట్చ్ ఫీల్ (35; 29 బంతులు 8 ఫోర్లు) మంచిగానే రాణించారు. ఎల్లిస్ పెర్రీ, బెత్ మూనీ, అన్నాబెల్ సుదర్లాండ్ అష్లేగ్ గార్డ్నర్, తాహ్లియా మెక్‌గ్ర్ విఫలమయ్యారు. భారత బౌలర్లలో రేణుకా ఠాకూర్ 3, ప్రియా మిశ్రా 2 వికెట్లు పడగొట్టారు. భారత్ డౌన్ కెరీర్‌లో మొదటి వన్డే ఆడుతోన్న ఆస్ట్రేలియా బౌలర్ మెగాన్ స్కట్ (5/19) ఐదు వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టింది. భారత్ బ్యాటర్లను బెంబేలెత్తించింది. భారత బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ (23) టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆమెతో పాటు హర్లీన్ డియోల్ (19), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (17), రిచా ఘోష్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. ఓపెనర్లు ప్రియా పునియా (3), స్మృతీ మంధాన (8), దీప్తి శర్మ (1), సైమా ఠాకూర్ (4), టిటాస్ సధు (2), ప్రియా మిశ్రా (0) పరుగులు చేశారు ఆసీస్ బౌలర్లలో మెగాన్ స్కట్ (6.21195) వికెట్లు పడగొట్టగా, కిమ్ గార్త్, గార్డెనర్, సదర్లాండ అలానా కింగ్ తలో వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో భారత్ మహిళ జట్టు మూడు వన్డేల మ్యాచ్ ఆడనుంది. రెండో వన్డే బ్రిస్బేన్ వేదికగా డిసెంబర్ 8న జరుగనుంది. మూడో మ్యాచ్ డిసెంబర్ 11న నిర్వహించనున్నారు.

రీల్



## ఓటిటిలో దేవరకి సెన్సేషనల్ రెస్పాన్స్..

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం దేవర కోసం తెలిసిందే. అయితే ఈ చిత్రం పార్ట్ 1 గా మొదట థియేటర్స్ లోకి వచ్చి సోలోగా ఎన్టీఆర్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ గ్రాసర్ గా నిలిచి అదరగొట్టింది. ఇక ఈ చిత్రం థియేటర్స్ లో మంచి వసూళ్ల తర్వాత ఓటిటిలో రిలీజ్ కి వచ్చింది. అయితే ఈ సినిమా థియేటర్స్ తర్వాత ఓటిటిలో వచ్చి అదరగొట్టింది. దిగ్గజ స్ట్రీమింగ్ యాప్ నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ కి వచ్చిన ఈ చిత్రం ఇపుడు ఓటిటిలో సాలిడ్ రెస్పాన్స్ ని అది కూడా గ్లోబల్ లెవెల్లో అదరగొడుతున్నట్టుగా మేకర్స్ చెబుతున్నారు. అయితే ఈ సినిమాని ఇటీవల గ్లోబల్ భాషల్లో కూడా స్ట్రీమింగ్ కి తీసుకురాగా లేటెస్ట్ గా అయితే నాలుగు వారాలు కంటిన్యూగా నెట్ ఫ్లిక్స్ లో పలు దేశాల్లో ట్రెండ్ అవుతున్న సినిమాగా దేవర నిలిచినట్టు మేకర్స్ చెప్తున్నారు. మరి దేవర 2.8 మిలియన్ వ్యూస్ అలాగే 8.1 మిలియన్ హావర్స్ స్ట్రీమింగ్ చేసినట్టుగా తెలుపుతున్నారు. ఇలా మొత్తానికి అయితే దేవర సినిమా ఓటిటిలో కూడా మంచి రెస్పాన్స్ తో దూసుకెళ్తుంది అని చెప్పాలి.



## పుష్ప–2 అల్లు అర్జున్ విశ్వరూపం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటించిన లేటెస్ట్ అవైటెడ్ సినిమానే పుష్ప 2. దర్శకుడు సుకుమార్ తో చేసిన ఈ క్రేజీ అండ్ మ్యాడ సీక్వెల్ కోసం అభిమానులు పాన్ ఇండియా ఆడియెన్స్ ఓ రేంజ్ లో ఆసక్తిగా ఎదురు చూడగా ఎట్టకేలకు సినిమా థియేటర్స్ లో పడిపోయింది. గతంలో పార్ట్ 1 కి బన్నీ ఏ రకంగా తన పెర్ఫార్మన్స్ తో మెస్మరైజ్ చేసాడో ఈసారి అంతకు మించి అందించాడు అని చెప్పడంలో సందేహం లేదు. మెయిన్ గా అల్లు అర్జున్ నటనా విశ్వరూపం సినిమాలో ఎవరి కళ్ళు తిప్పుకొనివ్వకుండా చేస్తుంది. ఆ జాతర సీక్వెన్స్ కానీ క్లైమాక్స్ ఎపిసోడ్ లో తన ఎమోషనల్ అండ్ ఇంటెన్స్ పెర్ఫామెన్స్ లు గాని అల్లు అర్జున్ కి స్పెషల్ అప్లాజ్ ని తీసుకొస్తాయి అలాగే ఈసారి కూడా డెఫినెట్ గా నేషనల్ అవార్డ్ బన్నీకి వచ్చినా ఆశ్చర్యం లేదనే చెప్పాలి. ఆ రేంజ్ లో బన్నీ ఈ సినిమాకి ప్రాణం పెట్టేసాడు.



## 'జటాయు' పవర్ చూపెట్టనున్న విజయ్ దేవరకొండ..?

టాలీవుడ్ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం దర్శకుడు గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాను విడి12 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సరికొత్త లుక్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఇక ఈ సినిమాతో బాక్సాఫీస్ దగ్గర విజయ్ దేవరకొండ సాలిడ్ సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, విజయ్ దేవరకొండ నెక్స్ట్ మూవీకి సంబంధించి సినీ సర్కిల్స్‌లో ఓ వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. విజయ్ దేవరకొండ తన నెక్స్ట్ చిత్రాన్ని క్లాసిక్ చిత్రాల దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి డైరెక్షన్‌లో చేయబోతున్నాడట. గతంలో ఇంద్రగంటి 'జటాయు' అనే పవర్‌ఫుల్ కథను విజయ్‌కి నెరేట్ చేశారని.. ఇప్పుడు ఈ సినిమాను తన నెక్స్ట్ చిత్రంగా విజయ్ తెరకెక్కించేందుకు ఆసక్తిగా ఉన్నాడని టాక్ వినిపిస్తోంది.ఈ సినిమా టైటిల్ 'జటాయు' మాత్రమే కాదు.. ఇందులో విజయ్ చేయబోయే పాత్ర కూడా చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సినీ సర్కిల్స్ టాక్. మరి ఈ వార్తలో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే.

### గ్రేటర్ హైదరాబాద్‌పై కాంగ్రెస్ సర్కార్

# వరాల జల్లు

గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.5,942 కోట్లు విడుదల
భారీ ఫ్లైఓవర్లు, రోడ్డు విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్
ఇక ఊపందుకోనున్న ప్రాజెక్టు పనులు



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌పై కాంగ్రెస్ సర్కార్ వరాల జల్లు కురిపించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జిహెచ్ఎంసి) చేపట్టే ప్రాజెక్టులకు భారీ మొత్తంలో రూ.5,942 కోట్ల నిధులు మంజూరు చేసింది. హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టులు నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్ సిటీ ఇన్నొవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(హెచ్‌సిటీ) ప్రాజెక్టుల్లో భాగంగా చేపట్టనున్న ఫ్లైఓవర్ల నిర్మాణం, రహదారుల విస్తరణ కోసం రూ.5,942 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ నిధులకు పరిపాలన అనుమతులు ఇస్తూ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే టెండర్లు ఆహ్వానించి, ఈ నిధులతో పనులు చేపట్టాలని ఉత్తర్వులలో ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజాపాలన విజయోత్సవాల్లో హెచ్‌సిటీలో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెల్సిందే. తాజాగా జిహెచ్ఎంసిలోని ఆరు జోన్‌లలో 5 ప్యాకేజీల్లో చేపట్టనున్న పనులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా సికింద్రాబాద్ జోన్‌లోని ఏఓసి సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం కోసం అత్యధికంగా రూ.940 కోట్లు విడుదలకు అనుమతులు ఇచ్చింది. శేరిలింగంపల్లి జోన్‌లో ఖాజాగూడ, ఐఐఐటి జంక్షన్, విప్రో జంక్షన్‌ల అభివృద్ధికి రూ.837 కోట్లు, మీయాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి అల్విన్ ఎక్స్ రోడ్డు వరకు ఆరు లెన్‌ల ఫ్లైఓవర్, లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు మూడు వరుసలతో అండర్‌పాస్ నిర్మాణానికి రూ.530 కోట్లు విడుదల చేసింది. ఎల్.బి.నగర్ జోన్‌లో టికెఆర్ కాలేజీ జంక్షన్ నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు ఆరు లెన్‌ల ఫ్లైఓవర్ కోసం రూ.416 కోట్లు, ఖైరతాబాద్ జోన్ పరిధిలో రైతిబౌలి నుంచి నానల్ నగర్ జంక్షన్ వరకు మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.398 కోట్లు, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట, హాఫీజ్ బాబా నగర్, శాస్త్రీపురం జంక్షన్‌ల రోడ్డు విస్తరణకు రూ.594 కోట్లు, విడుదల చేస్తూ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల లేమితో ఇప్పటి వరకు ప్రాజెక్టు పనుల విషయంలో అధికార వర్గాల్లో సిదిగ్దత నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రాజెక్టు పనులు ఊపందుకోనున్నాయి.

### చట్టాలు, సమాజం పట్ల

# విద్యార్థుల్లో అవగాహన

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యార్థులు చట్టాలతో పాటు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. రాష్ట్ర జవహార్ బాల్ మంచ్ రాష్ట్ర ఛైర్మన్ మామిడి రిషికేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 300 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ శాసనసభ పనితీరును విద్యార్థులకు వివరించారు. యువత డ్రగ్స్ భారిన పడకుండా జీవితంలో ఉన్నత శిఖరాలకు వెళ్లాలని, బాలికలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పియుసి ఛైర్మన్ శంకరయ్య మాట్లాడుతూ జవహార్ బాల్ మంచ్ ఆధ్వర్యంలో అసెంబ్లీ సందర్శన ద్వారా విద్యార్థిని, విద్యార్థులు కింది స్థాయిలో గ్రామ, మండల, జిల్లా పరిషత్తుల చట్టసభలపై కూడా అవగాహన పెంచుకుని భావి భారత పౌరులుగా ఎదగాలని కోరారు. రిషికేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూరైన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి మండలికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, సేట్ట్ కో ఆర్డినేటర్లు జిట్టా సునిల్ కుమార్, అంబటి తులసి, వికారాబాద్ జిల్లా చైర్మన్ రాఘవేంద్ర గౌడ్, మంచిర్యాల జిల్లా కో ఆర్డినేటర్ సాయి కృష్ణ, రాహుల్ సింగ్ తదితరు పాల్గొన్నారు.

## నేడు 'శంభు నుండి ఢిల్లీ'కి..

(మొదటి పేజీ తరువాయి)

ఉండదని మా నాయకులు చెబుతున్నారని చెప్పారు. ఇదిలా ఉంటే రైతుల ఢిల్లీ మార్చ్ ప్లాన్ నేపథ్యంలో అంబాలా పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. అంబాలా జిల్లా ఎస్పి సహా సీనియర్ పోలీస్ అధికారులు అందరినీ సరిహద్దు ప్రాంతానికి పంపించి భద్రతను అంచనా వేసి దానికి సంబంధించిన ఒక లెక్క చెప్పాలని కోరారు. హర్యానా వైపు సరిహద్దులో కేంద్ర పారామిలిటరీ బలగాలను సైతం అధికసంఖ్యలో మోహరింపజేశారు. తమ మార్చ్‌పై పునరాలోచించాలని, ఢిల్లీ పోలీసుల అనుమతి పొందిన తర్వాతనే ఏదైనా చర్య తీసుకోవాలని అంబాలా పోలీసులు బుధవారం కోరిన విషయం తెలిసిందే. అయితే పరిపాలనా యంత్రాంగం ఇప్పటికే భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163ను విధించింది.అంబాలా జిల్లా పరిధిలో ఐదుగురు లేదా అంతకుమించి వ్యక్తులు గుమిగూడటంపై ఆంక్షలు విధించింది. నిరసన ప్రదేశంలో ఆంక్షలు అతిక్రమించిన వారికి నోటీసులు జారీ చేశారు. అది మనకు పంజాబ్‌హర్యానా సరిహద్దు మాదిరిగా కనిపించడంలేదని, కానీ ఒక అంతర్జాతీయ ప్రాదేశికంగా మాత్రం కనిపిస్తోందని, ఒకవేళ వారు వారి మార్గంలోనే వెళ్లాలని అనుకుంటున్నారేమో కానీ వారినే కాదు కనీసం ఒక పక్షిని కూడా ఆ మార్గం నుంచి దాటనీయమని సర్వన్‌సింగ్ పంధేర్ విలేకరులకు చెప్పారు. హర్యానాలోని ఖనౌరీ సరిహద్దునుండి కవాతుకు ఇంకా ప్రణాళిక లేదని చెప్పారు. ఖనౌరీ సరిహద్దు ప్రాంతం నుంచి ఢిల్లీకి కవాతు సాగడానికి మేం ఎలాంటి ప్రకటనా చేయలేదని, అయినప్పటికీ అక్కడ పోలీసులు భారీగా మోహరించారని పంధేర్ తెలియజేశారు.అంతకు ముందు రోజు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ మన్‌దీప్ సింగ్ సిద్ధు (పాటియాలా రేంజి), పాటియాలా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నానక్ సింగ్ శంభు సరిహద్దులో సర్వన్‌సింగ్ పంధేర్‌ను, సుర్జీత్‌సింగ్ ఫుల్‌ను కలిశారు. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా బ్యానర్ కింద రైతులు సమీకరించబడి దేశ రాజధాని ఢిల్లీకి కాలినడకన కవాతు నిర్వహించాలని ప్రకటన చేసిన విషయం విదితమే. రైతుల పంటకు కనీసమద్దతు ధరపై లీగల్ గ్యారెంటీ, వారికి సంబంధించిన పలు డిమాండ్లపై ఈ నిరసన కవాతుకు పిలుపునిచ్చారు. సిద్ధు మాట్లాడుతూ రైతులు తమ ట్రాక్టర్‌ట్రాలీలను తీసుకురామని పోలీసులకు హామీ ఇస్తున్నారని, వారు కాలినడకన మాత్రమే కవాతు చేస్తారని 'మార్చర్ల' గురించి తెలియజేశారు. నిరసన తెలియజేస్తున్న రైతులు శంభుఖనౌరీ సరిహద్దులైన పంజాబ్‌హర్యానా మధ్య శిబిరాలు ఏర్పాటు చేసుకోగా ఫిబ్రవరి 13న పోలీసులు తొలగించారు. ఆ తర్వాత వారిమార్చ్ ఢిల్లీకి సాగుతుండగా భద్రతా బలగాలు నిలిపివేశారు. అయితే ఇంతకు ముందే రైతు నేతలు రైతుల జాతాకు సత్నామ్ సింగ్ పన్ను, సురిందర్ సింగ్ చౌతాలా, సుర్జీత్ సింగ్ ఫుల్, బల్జీందర్ సింగ్ నాయకత్వం వహిస్తారని ప్రకటించిన విషయం తెలిసిందే. రాళ్లదాడినుంచి రక్షించుకోవడానికి పోలీసులు స్టీల్ మెష్‌ను ఏర్పాటు చేశారు. అంబాలా అధికార యంత్రాంగం ఇంకా అక్కడ బారికేడ్లను ఎత్తివేయనేలేదు. ఫిబ్రవరి 21న ఖనౌరీ సరిహద్దులోనిరసనకారులు ఢిల్లీకి వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు జరిగిన ఘర్షణలో భద్రతా బలగాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించినప్పుడు పంజాబ్‌కు చెందిన శుభంకరన్ సింగ్ అనే రైతు మరణించిన విష యం తెలిసిందే. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి)తో పాటు, రైతులు, రైతు కూలీలకు వ్యవసాయ రుణమాఫీ పెన్షన్, విద్యుత్ ఛార్జీల పెంపుదల, పోలీసు కే సుల ఉపసంహారణ, 2021న లఖింపూర్ ఖేరీ హిం సాకాండలో బాధితులకు న్యాయం చేయాలని రైతు లు డిమాండ్ చేస్తున్నారు. భూసేకరణ చట్టం2013 ను పునరుద్ధరించడం, 202021సంవత్సరంలో ముం దస్తు ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించడం కూడా వారి రెండు డిమాండ్లుగా ఉన్నాయి.

## కాళేశ్వరం నీరు లేకున్నా.. సాగు భళా

(మొదటి పేజీ తరువాయి)

నియమించింది.

**తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగునీటిని అందించే ప్రాజెక్టులపై దృష్టి**

గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రాధాన్యమిచ్చింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రాజెక్టులపైనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి కేంద్రీకరించారు. నీలం వాగు, పింప్రి ప్రాజెక్టు, పాలెం వాగు, మత్తడి వాగు, ఎస్ఆర్ఎస్‌పి స్టేజీ 2, సదర్‌మట్ ప్రాజెక్టులపై ముందుగా ఫోకస్ చేసింది. రూ.241 కోట్ల ఖర్చుతో దాదాపు 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేలా పనులు ప్రారంభించింది. 2025 మార్చి నాటికి ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరి బేసిన్‌లో ఉన్న చిన్న కాళేశ్వరం, మోదికుంట, లోయర్ పెన్‌గంగా, చనాక కోరాట, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టు, కృష్ణా బేసిన్‌లో కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్‌బిసి పనులు ఈ ప్రాధాన్యత జాబితాలో చేర్చింది. ఏడు జిల్లాలను సస్యశ్యామలం చేసే దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టుకు అవసరమైన 2,947 ఎకరాల భూసేకరణ చేపట్టి 89,312 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం మొట్టమొదటగా కొబ్బరికాయ కొట్టి అసంపూర్తిగా వదిలేసిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును ఆర్థిక సాయం అందించాలని అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి చేశారు. 'ప్రధానిమంత్రి కృషి సించాయి యోజన పథకం'లో ఈ ప్రాజెక్టును చేర్చి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

**లక్ష ఎకరాలకు సాగునీటితో రికార్డు**

ఆగస్ట్ 15వ తేదీన ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రారంభించారు. గత ప్రభుత్వం రూ.7400 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వకుండా వదిలేసిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం రూ.482.87 కోట్లతో ఎనిమిది నెలల్లోనే పూర్తి చేసింది. 9 కిలోమీటర్ల రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సీతారామ నీటిని నాగార్జునసాగర్ కెనాల్‌కు అనుసంధానం చేసి లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందించడం రికార్డు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు తో పాటు సీతారామ లిఫ్ట్, సమ్మక్కసారక్క ప్రాజెక్టు కు అవసరమైన అనుమతులను తెచ్చుకునేందుకు ప్రభుత్వం కేంద్రంతో, మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది.

**2027 సెప్టెంబర్ నాటికి ఎస్ఎల్‌బిసి పూర్తికి చర్యలు**

ఉమ్మడి నల్గొండ జిల్లాకు సాగునీటితో పాటు ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించే ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టును గత ప్రభుత్వం విస్మరించింది. ఎస్ఎల్‌బిసి పనులను ప్రజా ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. సాంకేతిక నిపుణులతో కమిటీ వేసి అత్యాధునిక యంత్ర పరికరాలను విదేశాల నుంచి తెప్పించింది. 2027 సెప్టెంబర్‌లోగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో రూ.4,658 కోట్లు కేటాయించింది. 2014కు పూర్వం ప్రతిపాదించిన నారాయణపేట్‌కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులకు ఫిబ్రవరి నెలలోనే ప్రజా ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పాటు మక్తల్, నారాయణపేట్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీటిని అందించే ఈ ప్రాజెక్టుకు రూ.4350 కోట్లు కేటాయించింది.

**కాళేశ్వరం నీరు లేకుండానే రికార్డు స్థాయిలో పంటలు**

కాళేశ్వరం నుంచి ఒక్క చుక్క నీళ్లు లిఫ్ట్ చేయకుండానే ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టుల కింద రికార్డు స్థాయిలో పంటలు సాగయ్యాయి. ఈ వానాకాలంలో 67 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 153 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి జరగడం విశేషం. రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధిక రికార్డు. యాసంగిలో కూడా 42.11లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రభుత్వం ఇటీవలే సాగునీటి ప్రణాళికను విడుదల చేయడం గమనార్హం. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గత ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ బరాజ్ గతేడాది అక్టోబర్‌లో కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో బుంగలు పడి ప్రమాదకర పరిస్థితి తలెత్తింది. లోపాలను గుర్తించి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యల బాధ్యతను నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ(ఎన్‌డిఎస్ఎ)కి అప్పగించింది. ఎన్‌డిఎస్ఎ నిపుణుల కమిటీ మధ్యంతర నివేదికలోని సిఫారసుల ఆధారంగా వానాకాలం ప్రారంభానికి ముందే బరాజ్‌లకు అత్యవసర మరమ్మతులు నిర్వహించింది. జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు నిర్వహించింది. కాళేశ్వరం ప్రాజెక్టుతోనే రాష్ట్రంలో పంటల సాగువిస్తీర్ణం పెరిగిందని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. ఎన్డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం ఈ ఏడాది మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్లో చుక్క నీటిని నిల్వ చేయలేదు.

**కృష్ణా, గోదావరి నదులపై ప్రాజెక్టుల పూర్తి లక్ష్యంగా ముందుకు**

కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాలను దక్కించుకోవాలని, ఈ నీటిని వినియోగించేలా చేపట్టిన అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. నీటి వాటాలు, గోదావరి కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు ఇంతకాలం జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని అధికారం చేపట్టినప్పటి నుంచీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో అడుగులేస్తున్నారు. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో 70 శాతం ఉండగా, ఏపిలో కేవలం 30 శాతం ఉంది. అంతర్జాతీయ నీటి సూత్రాల ప్రకారం కృష్ణా జలాల్లోని 1005 టీఎంసీల్లో 70 శాతం రాష్ట్ర వాటా సాధించేలా ట్రిబ్యునల్ ఎదుట సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించటం గమనార్హం.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com